సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

మేడే ప్రత్యేక సంచిక

56

రైల్వే కార్మికులారా ఏకంకండి।

అన్ని రంగాల్లో దోపిడీకి గురవుతున్న పీడితులారా

రైల్వే ఉద్యోగులతో కలిసి పోరాడండి।

పోరాటంలో మనకు పోయేవేమీలేవు

బానిస సంకెళ్ళు తప్ప।

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

80 పేజీలు | 1 రూపాయి

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J. P. N. Road, Warangal - 506002 (A. P.)

'రైళ్ళను జైళ్ళు నడిపించగలవా?'

రైలుమార్గం పడడమే ఒక విప్లవమన్నాడు లెనిన్. పనిగంటలు సాధించుకోవడానికి దాదాపు తొంబది సంవత్సరాలక్రితం చికాగోనగర కార్మికులు చిందించిన రక్తం అంతర్జాతీయ కార్మిక ఐక్యతా అరుణపతాకమై పోరాటాలకు సంకేతంగా ఎగురుతున్నది. పనిగంటలు సాధించుకోవడానికి, పబ్లిక్ రంగంలో వున్న తమ తోటి ఉద్యోగస్థులపాటి జీతమైనా పొందడానికి, 'చట్టబద్ధంగా' రావలసిన బోనస్ కోరడానికి దేశమంతటా రైల్వే ఉద్యోగులు యీ మే నెలలో పూనుకుంటున్నారు. ఈ సమ్మె దేశద్రోహకరమని, ఈ సమ్మెను సమర్థించినా, ప్రోత్సహించినా, సమ్మెలో పాల్గొన్నా దేశద్రోహ నేరమవుతుందని బెదిరిస్తున్నది ప్రభుత్వం. 'Railway men if you win, you will loose' (రైల్వే ఉద్యోగులారా మీరు సమ్మెను గెలుచుకోవడమంటే నష్టపడడమన్నమాట)ని కుటిలమైన విషప్రచారం చేస్తున్నది. సమ్మెగెలిచి బోనస్‌లు, ఎక్కువ జీతాలు సాధించుకుంటే ధరలు పెరుగుతాయని బెదిరిస్తున్నది; (జీతాలు పెంచడానికి బోనస్‌లు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర నిధులులేవు ధరలు అరికట్టడానికి దమ్ములు లేవు; ప్రజల కష్టం తినడానికిమాత్రం పాలకవర్గాలకు దానవలాంటి కడుపులున్నాయి)

ఒకవైపు సంభాషణలు సాగిస్తూనే నాయకత్వాన్నంత జైళ్ళలో కుక్కి చర్చలకు రైల్వే ఉద్యోగుల నాయకులు రాలేదని ఫిర్యాదుచేస్తున్నది. చర్చలు సాగుతుండగా సమ్మెకోసం ఉద్యోగులను నాయకత్వం రెచ్చగొడుతున్నదని అంటూనే సమ్మెలోపాల్గొనే సంఘాలను చీల్చడానికి చేయగలిగినన్ని చెడుగు చేష్టలు చేస్తున్నది ప్రభుత్వం. 'సమ్మె జరుగబోదు' అన్న విశ్వాసాన్నికూడ తన శకుని రాజకీయాలమీద భరోసాతో ప్రకటిస్తున్నడు రైల్వే మంత్రి. కాని రైల్వే మంత్రిగాని, పాలకవర్గంగాని గుర్తించవలసిన సత్యం మాత్రం ఒకటున్నది. రైళ్ళను జైళ్ళు నడుపలేవు. రైల్వే మంత్రి నడుపలేడు. ఇందిరమ్మ నడుపలేదు. ఆ పని రైల్వేకార్మికులు మాత్రమే చేయగలరు. వాళ్ళ జీవితాలతో చెలగాటాలాడుకుంటేమాత్రం రైల్వే సమ్మె యీ దేశంలో విప్లవానికి బాటలువేసి తీరుతుంది.

6-5-'74

పోరాటమే నేటి జీవనసూత్రం

మే 8 ఉదయం 6 గంటలకు రైల్వే సార్వత్రిక సమ్మె

నేటి పోరాట విజయమే రేపటి మన ప్రయోజనాలకు నాంది

దృఢదీక్షతో పోరాటాన్ని నడుపుదాం ! భారత శ్రామికవర్గ పోరాటాలకు నాయకులమౌదాం !

కార్మిక సోదరులారా !

"అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు
అరెస్టులను సాగించి ప్రజాశక్తి నడ్డలేరు"

ఒక ప్రక్క సంప్రదింపులని చెప్తూ ఈ మేకవన్నెపులి ప్రభుత్వం తన నిజస్వరూపాన్ని బహిర్గతం చేసుకుంది. ఈ పులి ఒక్కసారి కార్మికులపై విరుచుకు పడింది. వందలాది కార్మికనాయకులను అరెస్టుచేసింది, చేస్తున్నది. రైల్వేకార్మికులమైన మనం ఈ దేశ పీడితప్రజలమైన మనం, బ్రతుకుబండి ఈడ్చలేక, అప్పులబాధ తట్టుకోలేక, మనరక్తాన్ని ధారపోసి పనిచేస్తున్నందుకుగాను కొన్ని న్యాయమైన ఆర్థికకోర్కెలను కోరాం. కాని ఈ కసాయిప్రభుత్వం వాటి నంగీకరింపటాని కేమాత్రం సిద్ధంగాలేదని మన నాయకులందర్ని అరెస్టుచేసి నిరూపించుకున్నది.

ఈ అరెస్టులవల్ల కార్మికులలో గందరగోళం సృష్టించగలనని ఐక్య ఉద్యమాన్ని అణచివేయగలనని ఈ ధనికస్వామ్య ప్రభుత్వం అనుకుంటే అది పూర్తిగా ఓడిపోయిందని అరెస్టులను నిరసిస్తూ 2-5-'74 న వేలాది రైల్వే కార్మికులు జరిపిన చారిత్రాత్మకమైన ప్రదర్శన నిరూపిస్తున్నది. ఇది 1961 కాదని విప్లవాల దశాబ్దంలో 1974 అని దేశవ్యాప్తంగా నాయకుల అరెస్టులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలే తార్కాణం. నేడు రైల్వే కార్మికులలో ఏర్పడిన ఈ ఐక్యత మహోన్నతమైనది. ఈ ఐక్యతే ప్రభుత్వాన్ని మన పాదాలవద్దకు తీసుకువచ్చి మన కోర్కెలను అంగీకరించేటట్టు చేస్తుంది.

సమ్మెను విజయవంతం చేద్దాం !

8-5-74, 6-00 గంటలకు ప్రారంభం కానున్న సమ్మెను గురించి దేశవ్యాప్తంగా ఉన్న శ్రామికవర్గం ఆలోచిస్తున్నది. ఎందుచేతనంటే భారత దేశంలో నేడు జరుగుతున్న శ్రామికవర్గ పోరాటాలన్నీ 20 లక్షల రైల్వే కార్మికులమైన మన సమ్మె విజయంపైనే ఆధారపడిఉన్నాయి. ఈ సమ్మెపోరాటంలో మనం సాధించబోయే ప్రాథమికవిజయం మరిన్ని విప్లవానుకూల విజయాలను సాధించటానికి మార్గమౌతుంది.

ఓడిపోతే శ్రామికవర్గానికి తీరని నష్టం జరుగుతుంది. మనం నేడు జరుపుతున్న యీ పోరాటం రేపు జరగనున్న జనతా ప్రజాస్వామిక విప్లవానికి నాంది అనే సంగతి మనం మరువకూడదు. అందుకని దృఢదీక్షతో మనం ఈ పోరాటంలో పాల్గొనాలి.

విద్యార్థుల, రైతుల, ఇతర పీడితవర్గాల మద్దతును సంపాదించుదాం!

రైల్వే కార్మికుల పోరాట జాతీయ సమన్వయసమితి 8-5-'74 సమ్మెకు పిలుపు నిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులను, వ్యవసాయ కార్మికులను, ఇతర పీడితవర్గాల ప్రజలను మన కోర్కెలను, పోరాటాన్ని బలపర్చమని కోరింది. వారి మద్దతును సంపాదించటంకోసం ఇటు విద్యార్థి పోరాటాలతోను, అటు గ్రామీణ రైతాంగపోరాటాలతోను మన పోరాటాన్ని సమన్వయం చేద్దాం. సకల పీడిత ప్రజానీకం అయిన మనమంతా ఐక్యమౌదాం. అటువంటి ఐక్యపోరాటాలే మనకు నిజమైన ప్రయోజనాలను సాధిస్తాయి. ఎందువల్లనంటే మన నాయకత్వంలో జరిగే యీ విప్లవ పోరాటాలు దేశంలోని పాలనావ్యవస్థని మార్చి శ్రామిక శ్రేయోరాజ్యాన్ని యేర్పాటుచేస్తాయి.

కామ్రేడ్ మాలిగి మరణానికి ప్రతీకారం తీర్చుకుందాం!

ఈ కార్మిక వ్యతిరేక ప్రభుత్వం తన పాశవిక చర్యలతో పోలీసు కస్టడీలలో అనేకమంది పీడిత ప్రజానాయకులను పొట్టన పెట్టుకుంది. అలాగే నేడు కామ్రేడ్ మాలిగి బొంబాయిలో పోలీసు కస్టడిలో మరణించడానికి కారణమైంది. ఈమరణానికి మనం ప్రతీకారం తీర్చుకోవాలి. ఇది మనం పోరాటాన్ని తీవ్రతరం చేయడంద్వారానే సాధ్యం.

విద్రోహులను తునుమాడుదాం!

అన్ని పోరాటాలలోను విద్రోహుల బాధ ఉన్నట్లే నేటి మన పోరాటంలోకూడ కార్మికవర్గ శత్రువులు కొందరు, ప్రభుత్వ ఏజంట్లు కొందరు, స్వార్థపరులు మరికొందరు కార్మికులలో నేడు ఏర్పడిన ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. అట్టి విచ్ఛిన్నకులనూ, మన సమ్మెను బలపర్చకుండా, 99.9 శాతం కార్మికులయొక్క అభిప్రాయానికి భిన్నంగా నడచుకొనే కార్మిక విద్రోహులను నాశనంచేద్దాం.

8-5-74 ఉదయం 6-00 గంటల నుంచి జరిగే మన సమ్మెను జయప్రదం చేయటానికి నేటినుండి ఉద్యుక్తులమౌదాం. పోరాట మార్గాన పురోగమిద్దాం.

— ఆకలితో చచ్చేకన్నా
— పోరాటంలో చద్దాం!

రైల్వే కార్మిక చైతన్య మిత్రులు

రిక్షా పాట

వి. బి. గద్దర్

రక్తంతో నడుపుతాను
రిక్షానూ
నా రక్తమె నా రిక్షకు
పెట్రోలు—

పెట్రోల్ ధర పెరిగింది
డీజిల్ ధర హెచ్చింది
నా రక్తం ధర యేమో
రోజు రోజు తగ్గబట్టె ॥ర॥

ఇరవయేండ్లనుండి రిక్ష
తొక్కి తొక్కి విసిగిపోయిన
చావురాక బతుకలేక
చెలాంచుకొని పోతున్న ॥ర॥

నాల్గుపైస లెక్కువొస్తె
నవ్వుకుంట గుడిసకొస్తె
సేటుకిరాయి పడకుంటె
గునుసుకుంట పందుకుంట
గిరాకైన కాకున్న
సేటు కిరాయి కక్కాలే ॥ర॥

నా రిక్షతోనె సేటుకు
పదిరిక్ష లొచ్చినాయి
నా రక్తమంత ఎండిపాయె
చావేమొ దెగ్గరాయె ॥ర॥

చాతి విరిచి ఎంత పెద్ద
చెడాపైన ఎక్కిస్తొ
చాతగాని కాడదిగి
ఎద్దులాగ లాగుకెల్తె ॥ర॥

తొక్కి తొక్కి ఊపిరి
తిత్తులన్ని చెడిపాయె
దగ్గి దగ్గి బొక్కలన్ని
పుచ్చిపోయి జల్లడాయె ॥ర॥

గుడ్లు, పండ్లు, మంచి తిండి
తినుమని డాక్టరుచెప్పె
తిండే దొరకకపోతే
మంచి తిండి క్యాడబోదు ॥ర॥

దొరకొడుకులు రిక్షలెక్కి
హారిగోస బెడ్తారు
తప్పతాగి, తెప్పరిల్లి
తన్న తన్న వొస్తారు
పాంచ్ పైసకాడ వాళ్లు
పదిసార్లు కొసురుతారు ॥ర॥

పోలీసుకొడుకు నాకు
భూలోకం యెముడు
యాడబడ్తె అడబట్టి
ఏపుకతింటాడు వాడు ॥ర॥

చావబోయె తల్లికి
జీవిగంజి బోతమన్న
గంజినీలకన్న ఇంట్ల
గవ్వ గూడబెట్టలేదు ॥ర॥

ఏదీ కొనబోదమన్న
అగ్గిమండి పోబట్టె
ధరలేమొ పెరగబట్టె
రిక్షకిరాయి దిగబట్టె ॥ర॥

వాయసుల సంపాంచింది
నయాపైస ఆస్తి లేదు
రక్త మొడిసి పోబట్టే
ముసలితనం రాబట్టే ॥ర॥

చిన్నెక్కిన వీరుడెవడో
నా కండ్లు తెరిపించెను
ఆపద సంపద అడిగి
అయ్యో పాపమన్నాడు ॥ర॥

లక్షలు, కోట్లు దొరలకు
ఎట్లొచ్చెనో ఎరిగించెను
దారిద్రం బోయేటి
దారి ఒకటి చూపించెను
అడివి పత్త ఇచ్చినాకు
అర్జంటుగ కలువుమండు ॥ర॥

అడివికెల్లి పోయెముందు
సేటునర్సుకొని పోతా
ఖుషిదీర, కసిదీర
సేటు పీకె కోసి పోత ॥ర॥

ఇంకా ఉన్నాం

నిరంజన్

ఉన్నాము వున్నాము పేదోల్లమూ
ఈసురోమని బతుకుతున్నోల్లము ॥ఉన్నాము॥

ఉండ గూడేలేదు తిండి అసలేలేదు
కట్ట బట్టలులేని కడు దరిద్రులము మేము ॥ఉన్నాము॥

ఏడు మేడలుగట్టి ఎలుగుతున్నోరికి
చాకిరీచేస్తేనె బాకీలు పెడతారు
సుఖసౌఖ్యభోగాలు వారొంతూ
ఉపవాసముండటమె మావంతూ ॥ఉన్నాము॥

భూస్వామి పొలములో నాట్లన్ని వేశాము
పొద్దుపోయేదాక చద్దికూడేలేదు
ఎండలకు ఎండడం మావొంతూ
పంటనుభవించడం వారొంతూ ॥ఉన్నాము॥

నలిగి చినిగినగుడ్డలె మా మానరక్షలు
బట్ట కొందామంటె బత్తె మింట్లోలేదు
కల్ల ఎరుగని మేము కష్టించుతుంటేను
కల్లలాడేవాడు కోట్లు కూడేస్తాడు ॥ఉన్నాము॥

అమ్మగారికి కాళ్ళు అయ్యగారికి ఒళ్ళు
రోజంత పట్టినా పట్టెడన్నము లేదు
పిల్లలను కనడమే- వారొంతూ
పట్టి ఆడించడమేమో- మావంతూ ॥ఉన్నాము॥

మురికికాల్వలపక్క- ఇరుకైన గుడిశల్లో
జబ్బు జరములతోను కుస్తీలు పడుతుంటె
రోగమొచ్చినమాకు మందు మాకులులేవు
డాకుటేర్లే కరువు పేదోల్లకూ
మందులన్నీ దక్కు- గొప్పోల్లకూ ॥ఉన్నాము॥

పనిలేని సోమరులు- తినిబలిసిన గొప్పోరు
కామదాహముతోన కరడుగడుతున్నారు
పేదవారిని చెరచవస్తారూ
కాదంటె పేణాలు తీస్తారు ॥ఉన్నాము॥

హరిజనులమున్నాము- గిరిజనులమున్నాము
మాల మాదిగజాతి అందరము ఉన్నాము
అంటరానీ జాతి మాదంటా
అందముంటే అడ్డురాదంటా ॥ఉన్నాము॥

ఎన్నికలు వస్తేను ఓట్లడగవస్తారు
పేదలకు పనులెన్నొ చేస్తామనంటారు
సీటు దొరకంగానె సీటుగా కూర్చొని
పేదోళ్ళు కనబడితే కసిరిపొమ్మంటారు ॥ఉన్నాము॥

ఇన్నేళ్ళు మా బ్రతుకు ఈడ్చుకొని వచ్చాము
వెలుగులేని చీకటింట్లోనె వున్నాము
వీర శ్రీకాకుళం వెలుగు చూపించింది
నగ్జల్‌బరీ నవ్యకాంతులే జల్లింది
ఇక ఆగిలేమింక సాగిపోతామింక ॥ఉన్నాము॥

అదిగదిగో ఇప్పుడే పొద్దుపొడిచేసింది
తూరుపూ దేశమూ ఎరుపుమయమయ్యింది
అందరకు రమ్మంటూ ఆహ్వానమిస్తోంది
ఆహ్వానమందుకొని వస్తామూ
అందరము కలిసెళ్ళిపోదామూ ॥ఉన్నాము॥

దారితెలిసిన బాటసారులు

సీజం

కారునల్లని చీకటమ్మను
తరిమి తరిమీ కొట్టువారలు
ప్రజల మేలును కోరి ఊపిరి
వెరుపుమాలను గుచ్చువారలు
చెట్టపట్టాలేసుకుంటూ
గట్టు పుట్టా దాటుకుంటూ
గుండె పొదిలోనుండి తీసిన
మంది శరములు దూసుకుంటూ
ఏడుపూ గాడుపులులేని
దోపిడీ దుర్నీతికందని
ఎరుపు స్వర్గపుదారులందున
వెలుగు దివ్వెలు నిలుపువారలు...

ఏరులా సెలయేరులాగ
జలజలా జనహృదయమందున
ఆడుకుంటూ పాడుకుంటూ
ఏరా అన్నా! ఏనె చెల్లే!
నేమమా! నువు సౌఖ్యమా! అని
మంచిచెడ్డలు తెలుసుకుంటూ
కష్టసుఖములు పంచుకుంటూ
ఇంటి ఇంటికి పెద్దకొడుకై
ఇంటింటి ముద్దుల గుమ్మై
గోచి కట్టడమంటె ఎరుగని
కొండ అన్నల దండ గుచ్చి
కొండ చిలువల వంటి దోపిడి
షావుకారుల చితులు పేర్చి
ప్రజల బాటలు తొక్కినారు
ప్రజల మనుషులు వారు వారు

వారలే రేపటికి దారులు
దారితెలిసిన బాటసారులు
వారలే దోపిడికి చిచ్చులు
కష్టజీవుల కంటి రెప్పలు.

నాడె పాట

యం. కె. సుగమ్‌బాబు

కుయ్యి కుయ్యి మంట
కుమలతా వెందుకు
కుమల మాకే నువ్వు నాదే!
నేను నేసిన గుడ్డ
అమెరికా బోతంది
కుందమాకే నువ్వు నాదే ॥

రోజుకొక్కింటికి
పదహారు గంటలు
నేత నేనూ నేస్తె నేమి?
రాత్రింబగళ్ళు నా
ఇంటిదీ, పిల్లలు
ఒళ్లు యిరుసూకొంటెనేమి? ॥కు॥

కడుపులోకీ ముద్ద
ఒంటి మీనా గుడ్డ
మాకు లేకుంటేనేమి?
వయసంత వడ్డీకి
బతుకంత అసలుకి
దారబోత్తే మాత్రమేమి? ॥కు॥

నేసినేసీ ఒల్లు
సూసి సూసీ కల్లు
రోగాలపాలైన నేమి?
మందు మాకూలేక
దిక్కు మొక్కూలేక
సచ్చిపోతే మాత్రమేమి? ॥కు॥

కుయ్యి కుయ్యి మంట
కుమలతా వెందుకు?
సంతొసించె పిచ్చినాడె!
నేను నేసిన గుడ్డ
అమెరికా బోతంది
గంతులెయ్యే ఎర్రినాడె ॥

దొరల గుమ్ముల్లొ గింజలున్నాయి
జనం కడుపులొ ఆకలున్నాది
ఆకలెట్లా తీరవలెరన్నో
గుమ్ములన్నీ పగలగొట్టన్నా
దుమ్ముదుమ్ముగ పగలగొట్టన్నా
దమ్ముతీరా పంచిపెట్టన్నా
అడ్డమొచ్చిన దొంగకొడుకుల
అడ్డముగ నరికేసి పోరన్నా

కథలు :

వార్త

సుబ్బారావు

సాయంకాలం మూడు గంటలు. గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు వుక్కిరిబిక్కిరిగా వుంది. వాతావరణం "తుఫాను" ముందరి ప్రశాంతతలా వుంది.

కాస్త కాఫీ తాగుదామని ముందుగదిలో కూర్చున్నాను. సుడిగాలి రివ్వున వీచినట్లు పరుగెత్తుకొచ్చాడు మూర్తి. 'పోతుగడ్డలో కాల్పులు జరిగాయట విన్నావా?' అన్నాడు వస్తూనే. అదిరి పడ్డాను. ఆయాసపడుతూ కుర్చీలో కూలబడ్డాడు మూర్తి. వాడికో కాఫీ కప్పందిస్తూ, 'ఎందుకట?' అన్నాను ఆశ్చర్యాన్ని, ఆత్రాన్నీ సాధ్యమైనంతగా అణచుకోడానికి ప్రయత్నిస్తూ. పోతుగడ్డలాంటి మారుమూల గ్రామంలో కాల్పులు జరగడమంటే, నాలాంటి సగటు మనుషులకెవరికైనా ఆశ్చర్యం కలగక మానదుమరి.

స్థిమితంగా కూర్చుని మొదలెట్టాడు మూర్తి. "పోతుగడ్డ ఆ చుట్టుపక్కల గ్రామాల్లో వ్యవసాయకూలీలెక్కువ. వాళ్ళకు మరో జీవనాధారంలేదు, వ్యవసాయప్పన్లు తప్ప. అక్కడే వేలాది ఎకరాల భూస్వాములూ, కోట్లాది నల్ల, తెల్ల ధనానికి అధిపతులూ వున్న సంగతి మనకి తెలియందికాదు. ఈ యేడాది 'వూడ్పులు' ప్రారంభం కాగానే కూలీలంతా కల్సి, నిత్యజీవితావసర వస్తువుల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయాయి గనక మా కూలిరేట్లుకూడా ఇదివరకట్లా రూపాయిన్నరా, రెండూ కాకుండా, ఐదురూపాయలిప్పించ వల్సిందని భూస్వాముల్నడిగారు. కూలివాళ్ళ కష్టంమీద కోట్లు కూడబెట్టినవాళ్ళంతా, అందుకెంతమాత్రం ఒప్పుకోలేదు. పైపెచ్చు కూలోళ్ళకి సంగాలేంటిరొండ్రా అన్నారు. మీరెలా పన్జెయ్యరో మేం జూస్తాంలే అన్నారు. ఎధవ్వేషాలేస్తే, సున్నంలోకి ఎముకల్లేకుండా పొడిపిస్తామన్నారు. వాళ్ళకష్టం మీద బతుకుతూ వాళ్ళచేత తొక్కిపట్టి పన్జెయ్యించుకోవాలనుకుంటే, ఎప్పుడూ వాళ్ళని కాళ్ళకింద చెప్పుల్లాగే వుపయోగించుకుంటే, ఎప్పుడూ వాళ్ళనే బెదిరిస్తుంటే, చెప్పులకైతే చైతన్యం వుండకపోవచ్చుగాని, మనిషన్నవాడు ఎంతకాలమని భరిస్తాడు? వాళ్ళంతా గత్యంతరంలేక సమ్మెకుదిగారు. భూస్వాములంతా దూరపూళ్ళనుంచి, మనుషుల్ని పిలిపించుకొని, పన్లు జరిపించుకోవాలని ప్రయత్నించారుగాని, ఈ సంగతులన్నీ తెలిశాక వాళ్లూ పోయారు. మరీ లోగా ఏం జరిగిందో తెలియదుగాని, ఇదుగో యిప్పుడీ వార్త తెలిసింది" అంటూ ముగించాడు మూర్తి. తనకు తెలిసిందంతా చెప్పేశానన్నట్టు ముఖం పెట్టి.

ఇంకా పూర్తి వివరాలు తెల్సుకోవాలనిపించింది నాకు. మూర్తిని పంపేసి, వూరిమీదపడ్డాను. కూరగాయలు బేరంచేస్తూ అప్పారావు కన్పించాడు. 'పోతుగడ్డలో కాల్పులు జరిగాయట విన్నావా?' అన్నాను.

"అరాచకం, దౌర్జన్యం పెరిగిపోతుంటే, కాల్పులుజరక్క యేంజేస్తాయ్? కూలీవెధవలు కూలీవెధవల్లా పడుండాల. పూటకి గతిలేనివాళ్ళకి సంఘాలెందుకోయ్? 'శ్రమశక్తి', 'దోపిడి' ఏమిటీ పదాలు? కోతకొచ్చిన వెధవలు తుప్పనూర్చుకు పోతామంటే. కష్టపడి భూములు సంపాదించుకున్నవాళ్ళేమయేట్టు? పెద్దపెద్ద భూస్వాములూ వాళ్ళపొలాలూ లేకపోతే, వీళ్ళ బతుకులెలా వెళ్ళమారుతయ్? ఏమైనారావ్! ఈమధ్య ఈ అలగాజనం మితిమీరి పోతున్నారనుకో. వాడు చూడు ఆ కూరలవాడు. వీశ అర్ధ రూపాయికి తెస్తాడు అరవై పైసలంటాడు. ఐదు పైసలు తగ్గించరా అంటే, పెద్ద నీల్గుడు వెధవకి." ఆగాడు అప్పారావు.

నాకు తెలిసినంతలో అప్పారావు నాలాగే బాధపడ్తున్న ఓ మధ్యతరగతి సంసారి. పొలాలూ, మేడలూ ఏమీలేవు. ఏదో వుద్యోగం చేసుకుంటూ బండిలాక్కొస్తున్నాడు. పెద్దపెద్ద షావుకార్ల వద్ద నెల ఖాతాలున్నాయ్. జీతంరాగానే పద్దులో ఎంతుంటే, అంతా జమకట్టి, ఏ సరుక్కి ఎంత ఎక్కువరేటు వేసినా, మారు మాట్లాడకుండా తెచ్చుకొనే రకం. అలాంటివాడు కూలివాళ్ళ విషయంలోనూ, కూరలవాడి విషయంలోనూ ఇలా మాట్లాడ్డమేమిటో!

ఇక లాభంలేదని బస్టాప్‌వైపు బయల్దేరాను. అక్కడకూడా అందరూ యీ సంగతులే మాట్లాడుకుంటున్నారు. ఎంతమంది చనిపోయారో, యిప్పుడు పరిస్థితి ఎలా వుందో ఏమీ తెలియటంలేదు- పోనీ నాలుగుమైళ్ళేకదా, ఓసారి వెళ్లొస్తేనో అనిపించింది. అంతలోనే బస్సొచ్చింది. అనుకోకుండానే ఎక్కి కూర్చున్నాను.

'అమ్మ నాయాళ్లు! ఈళ్ళకి రేట్లు పెంచాలా? యియ్యాల రేట్లంటారు; రేపు ఎకరాలే పంచియ్యమంటారు. దీన్ని యిప్పుడే ఓ సూపు సూసెయ్యకపోతే, ఇంక మాలాంటోళ్ళంటే, కేరాజాట్ అయిపోద్ది ఈ గాడిదకొడుకులికి. అమ్మో! అమ్మో!!' విచిత్రంగా నోరాడిస్తూ, బొర్రకదలకుండా, చేతులు చిత్రంగా తిప్పుతూ, మాట్లాడుతున్నాడొకాయన. చేతులు తిప్పినపుడల్లా, రవ్వల వుంగరాలు తళుక్కు తళుక్కుమంటున్నాయ్.

'ఏమిచ్చినా ఈ నాలుగురోజులే కదండి నాయుడుగారూ. ఈ మాత్రానికి మీకు పోయాదేముందండె? పావం! ఇచ్చేత్తె పోనుగదా. పిచ్చిముండాకొడుకులు బంద చేకిరీ చేత్తారు' అంటున్నాడు కండక్టరు.

"ఆకరికి నీకూలిబుద్ధి పోనిచ్చుకున్నావు గాదురో! వున్నట్టుండి. నువ్వూ ఎప్పుడో మీ ఓనర్ని ముంచేత్తావ్"

ఆ మాటలకి బస్సంతా గొల్లుమంది. నాకూ నవ్వొచ్చింది. ఓనర్లూ క్లీనర్లూ అని యిన్నిరకాల మనుషులుండకుండా పోయేరోజు రాకపోతుందా ! అని.

ఇంతలో పోతుగడ్డ రానేవచ్చింది. బస్సుదిగి వూరిమధ్యగా నడిచిపోతున్నాను. ఈమధ్య నేనక్కడకు పోలేదు. రోడ్డుకు రెండువైపులా ఠీవిగా నిలబడ్డ మేడలు. నేనెక్కువ మేకల్ని తిన్నానంటే, నేనెక్కువ తిన్నానని, గర్వంగా నవ్వుకుంటున్న పులుల్లా. ఒకదానికొకటి పోటీలు పడ్తున్నాయ్. మేడలచుట్టూ కావలికుక్కల్లా, నిల బడివున్నారు పోలీసులు. ఆ సమయంలో ఆ రోడ్లు అదురుతున్నట్టూ ఆ మేడల పునా దులు కదుల్తున్నట్టూ అన్పించింది నాకు.

గ్రామచావట్లోనుండి కమ్మటి కూరల వాసనలు. పిండివంటల ఘుమ ఘుమలూ అక్కడి వాతావరణాన్ని ఓ విధమైన మత్తులో ముంచేస్తున్నాయి. అసలైనమాంసాన్ని మెకాలుతినిపోగా, ఎముకలతో తృప్తిపడ్డ నక్కల్లా, మూతులుతుడుచుకుంటూ బయట కొస్తున్నారు జవాన్లు.

పంటకాల్వ వంతెనమీద నడుస్తున్నాను. కొలిమిలోనుండి అప్పుడే బయటికి తీసిన ఇనుపగుండులా వున్నాడు సూర్యుడు. ఆ సాయంకాలపు నీరెండకి కాలవలో నీళ్లు మెరుస్తున్నాయి. కాలవదాటి పేటలో ప్రవేశించాను.

అక్కడిళ్ళన్నీ చాలాభాగం పూరిగుడిసెలు. వాటిల్లో ఎక్కువ భాగం వాళ్ళజీవి తాల్లాగే శిథిలమైపోయినయ్. ఏకొంపలోనూ నిప్పురాజుతున్నట్టులేదు. ఏ యింటిపైనా పొగవచ్చిన జాడైనాలేదు. కాని అక్కడి మనుషుల్నిచూస్తే, ప్రతివాడికళ్లూ పొగలూ సెగలూ కక్కుతూనే వున్నాయనీ, ప్రతి వ్యక్తి గుండెల్లోనూ నిప్పురాజుతూనే వుందని స్పష్టంగా తెలుస్తూనేవుంది. వాళ్ళంతా కన్నుల్లో ప్రతీకారజ్వాలలతో, మూర్తీభవించిన నిశ్చయాల్లా, ఎక్కుపెట్టిన విల్లుల్లా, గురిపెట్టిన తుపాకుల్లావున్నారు.

ఓ ఇంటిముందు చాలామంది కూర్చుని, ఏవో తర్జనభర్జనలు చేసుకుంటున్నారు. కొంతమంది కాళ్ళకూ, చేతులకూ చిన్న చిన్న కట్లున్నాయ్. ఇద్దరు ముగ్గురు తెలిసిన వాళ్లు కనిపిస్తే అక్కడికి పోయి కూర్చున్నాను. అప్పటికే వాళ్లంతా ఓ నిశ్చయాని కొచ్చినట్టు కన్పించారు. పక్కనున్న స్నేహితుణ్ణడిగాను. 'ఎలాజరిగింది' అని. నా మాటలు విన్న ఓ ముసలాయన చెప్పటం మొదలెట్టాడు.

"ఏం చెప్పమంటావు బాబూ! మేం కూలిమ్మన్నాం గాని, ఆస్తికరాలిమ్మ న్నామా ? మా రెక్కలు ముక్కలైసుకున్నా, మా డొక్కలు నిండటంలేదు, మాసీమూ

నెత్తురూ ఎరువులుగామార్చి, మీ పొలాలు పండిత్తన్నాం, మా కష్టానికి తగ్గ ఫలివివ్వం డన్నాం అది తప్పా ? నువ్వు గొడుగేసుకుని, గట్టునికూకుంటే, మేం సెమటలు కక్కు కుంటూ, ఒళ్లు రగ్గొట్టుకుంటూ పన్జేత్తంటాబూ ! నువ్వెచ్చగా పెళ్ళంపక్క లోతొంగుంటే, మేమూ మా పెళ్లాలూ ఒంటికి సుకమున్నాదిలేక, కంటికి కునుకున్నాదిలేక, మా కన్నీళ్ళతో మీ పొలాలు తడుపుతున్నాం. పగలనక, రాత్రనక, రాయనక రప్పనక పురుగనక పుట్రనక సంవచ్చరాలతరబడి సేకరిజేసి, రాసులు పడించి, మీ గాదెలు నింపుతున్నాం బాబూ. మేమింత పన్జేత్తన్నాం, మా కష్టం గమనించండన్నాం. మీరు సోమారిపోతుల్లాగ పరుపుల మీద్దొర్లుతున్నారు. మీరు నల్లుల్లాగ జలగల్లాగ మా మీద బతికేత్తన్నారు. మా కూలికినే యిమ్మన్నామా ? మా కష్టానికి యిలవడుగుతున్నాం. అది తప్పైపోయిందా ! అదుగో అటుసూడు బాబూ ! ఆ పొలాలెలాగున్నాయో ?

అటుకేసి దృష్టిసారించాను. ఎప్పుడూ పచ్చపచ్చగా పైరగాలికి పరవశించిపోతూ కళకళలాడే ఆ పొలాలు యిప్పుడు రకరకాల కలుపుమొక్కలు పెరిగిపోయి పాడుపడి పోయినయ్.

సూడు బాబూ అయ్యిప్పుడు పొలాలు కావు. చవిటిపర్రలు. ఆళ్ళపాలిటి సొపాణాలు. అయ్యలా గుండటానికి కొన్నమేటంటారు ? ఈ పెయ్యి పడకపోడమే బాబూ ! ఎంత నిగనిగలాడే జుట్టయినా నాలుగు రోజులు సూనెట్టకపోతే ఏమౌద్ది ? పువ్వునీళ్లో పొర్లిన గేదె రోమాల్లా ఎర్రబడిపోద్ది. ఎంటిక పెర్రబడిపోతే, ఆడిమొక మేమౌద్ది ? ఎదవ రూపొచ్చేత్తాద్ది. ఆడికి సన్నాసి మొకమడిపోద్ది. అంతేబాబూ! ఈ పొలాలూ, పుట్రిలూ, తోటలూ, దొడ్లూ యీ కూలోళ్ల కడుపుమంటకి బస్మమై పోవల్సిందే.

ఇప్పుడేమొచ్చింది నీకు ? పొలాలు బీదెట్టేసావు. కానీ కలిసొచ్చిందా ? పొలాలు బీదెట్టేటాకైనా నీకిట్టమైందిగాని, కూలోడికి కూలిపెంచడానికి నీకొప్పుదలవ్వ లేదు. ఎందుకని ? మేం కూలోళ్లం. మీరు కామందులు. కూలోడు సెప్పెడమేంటి ? మేమిస్తమేంటనేకదా ? పోనీ మీరనొద్దు మేం పన్జెయ్యమన్నాం. మరి మీకు మా మీద కసెందుకు ? మీ దారి మీర్జూసుకోండి. మా దారికి మమ్మల్నొదిలెయ్యండన్నాం. మరలా గొదల్లే ? మీ మెప్పుడూ గొర్రెపిల్లలం బాబూ. అల్లెప్పుడూ తోడేళ్ళు. గొర్రిపిల్లనిజూత్తే, తోడేలు కెప్పుడూ గుర్రేబాబూ !

గొర్రిపిల్ల నీళ్లు తాగుతుంటె, తోడేలేమంది ? నేన్తాగే నీళ్ళ నువ్వెంగిలిజేత్తన్నావంది. దానికి గొర్రిపిల్ల నీటి పైన్నువ్వు తాగుతున్నావు. కింద నేన్తాగుతున్నాను. నువ్వు తాగిన్నీళ్లేకదా నాకొత్తంట మరిదేం న్యాయమంది. దానికి తోడేలేమంది ?

ఎంటనే మాట మార్చేసింది. కొత్తాడుపేసింది. ఆరుమాసాల కితం నువ్వు నన్ను తిట్టావంటకాదా అంది. అప్పుడు గొర్రెపిల్ల నేను పుట్టే మూడు మాసాలైంది కదా : ఇదేమి సిత్రిమని తెల్లమొకమేసింది. నీమాటకెదురానోణ్ణి నువ్వు నొక్కెయ్యాలి. మరింకాదెప్పుడూ పైకి లెగ్గూడదు. ఆయనెవళో అన్నట్టు, సంపేసీముందో పేరెట్టెయ్యాల. అప్పుడు తోడేలేవంది? నువ్వు తిట్టాపోతే, నీయమ్మైనా తిట్టుంటాదని, మీదపడి, పీక నొక్కేసింది.

ఇప్పుడు నువ్వు సేసీదదేకదాబాబూ! పేదోళ్ళమందరం మీ పనులు సెయ్యమన్నాం. మీకులాసొచ్చింది. మీతోదేలుబుద్ధి బుఱకొట్టింది. అందుకనేదోరకంగా, మమ్మల్ని ఒకించాల. అందుసేత. మీ కుప్పలు తగలబెట్టేత్తన్నామంటన్నారు. మీకొంపలు దోసుకుంటన్నామంటన్నారు. మిమ్మల్ని నిలబడి నీళ్లతాగనియ్యటం లేదంటన్నారు. అలాగని మీరు గవరమెంటోళ్ళని నమ్మింతన్నారు. అదిని గవరమెంటోళ్లేంజేత్తన్నారు? పోలీసోల్ని, సియ్యార్పీవోళ్ళని పంపేతన్నారు. ఆళ్లొచ్చేంజేత్తన్నారు? నాయమేంటన్నాయమేంటని సూత్తన్నారా? వూరపందుల్లాగ అన్ని తినిపించీసి తినేసి దొరికినకూలోల్లా పుతికేత్తన్నారు. బొక్కలో తోసేత్తన్నారు."

"కారణాలేమీ చూపించకుండా ఎలా అరెస్టులు చేస్తున్నారూ?" అన్నాను.

"కారణమేంటిబాబూ. సవాలక్షుంటాయ్. కొబ్బరకాయలు కోసేసి, చేసనుకాడ పొయ్యంచేత్తన్నారు. దాన్యం బత్తాలూ, రూపాయిలూ, నగలూ అక్కడ పెట్టేత్తన్నారు. తొంభై తొమ్మిది తప్పుడు కేసులు రాసేత్తన్నారు. ఆళ్ళకత్తి కద్దేముంది.

ఆన్నీ సయింపాం బాబూ అయినా ఆళ్ళకసొస్తిర్లేదు. ఆళ్ళ పగ సల్లార్లేదు. ఈ మంటలిలా సుట్టూ రేగిపోయి. ఆళ్ళమీదకి నాలికలాస్పేటాన్కి కార్నమైన నుప్పు రవ్వేంటని దుర్బిణీ ఏసారు. అందులో యిదిగీ బాబు కనపడ్డాడు. ఈ కతంతా యీ రాంబాబే నడిపిత్తన్నాడని ఆళ్ళకెరికే బాబూ!"

అటు చూసాను. ముప్పై ముప్పైఐదు సంవత్సరాలున్న ఓ యువకుడు చలాగ్గా బిక్కుపల్చగా పెరగనినవ్వుతో, ఎంతో వినయంగా వాళ్ళమధ్యన కూర్చునివున్నాడు.

ముసలాయన అందుకున్నాడు.

ఆళ్ళ పిచ్చిగానిబాబూ, రాజేసిన నుప్పునీ సేత్తే మాత్రం మంటలారిపోతాయా? అయినా ఆళ్ళేవనుకుంటారంటే మద్దినున్న పెద్దమోడున్లాగేత్తే, సిల్లరనుప్పుల్మీద నీళ్లు సిలికెయ్యొచ్చని అందుకనీ బాబు మీ దేశారాళ్ళరూము. మాకు తెల్సుబాబూ. ఆళ్ల కిందనుంచిపైదాకా గడ్డితినిపించేసారు. లచ్చలకిలచ్చలు కర్సైనా యీ శాల్తీని తీసె

య్యాలని ఆళ్లంతా కూడబలికేసుకున్నారు. మేంకూడా యీ బాబుని కంటికిరెప్పలా కాపాడుకుంటున్నాం. నిన్నీమద్దెణ పేల ఏయోపన్లుమీదలా అలా పెదిరిపోయాం: అది కనిపెట్టేసారాళ్లు.

పీనన్నానని నీకో్కవమొద్దు. నీది గవరమెంటు. నీకు బోల్డు సట్టాలున్నాయి. అతికారాలున్నాయి. దర్జాగా వారంటట్టుకొచ్చి అరెట్టు సేసుకెళ్ళొచ్చు. అలాటప్పుడా దొంగబతుకెందుకు? నక్క కోడిపుంజుని లటక్కన కరుసుకుపోయినట్టు అట్టుకుపోతావా? పోనీ ఎలాగో లాక్కుపోయావ్. లాక్కుపోయినోడివి రాజబాటని సేసక్కీసుక్కుపోక, నీకడివిదారెందుకు? అడివిలోకి తీసుకుపోయేంజేద్దామని?

ఈ కపురెలాగో మాకందింది: సేతికందిందలా పుచ్చుకుని పరుగెత్తాం. పుల్లలు నరుక్కునీవోళ్లు అడివిలోనే అడ్డేసారు. ఆడకూతుళ్లు కారంబుడ్లుచ్చుకున్నారు. కత్తులూ, కర్రలూ, గొడ్డళ్లూ, గునపాలూ అడ్డమేసాంబాబూ, జనం వంచలు, వేలు. ఆళ్లీ జనం మద్దినిరుక్కుపోయారు. వున్నట్టుండెవడో పైరన్నాడు. ఆడు పైరంద మేంటి, ఆడిబుర్ర పగిలిపోడమేంటి రొండూ ఒక్కపాలే జరిగిపోయాయి. ఈ అవిడిలో మా'బాబు'ని పట్టుకున్నావోడు పిస్తోలు గురిపెట్టేసాడాబాబుకి. అది సూసినొకాడకూతురు ఏసిందిబాబూ ఆడి గుత్తిమీద. దెబ్బతో గుత్తి రిగిపోయింది. అదెవరసని ఆడకూతుళ్లు కారంబుడ్లు గుర్రెట్టేసారు, సూడాలబాబూ ఆళ్ళదైర్నమప్పుడు. దణ్ణం లెట్టేసారు. టోపీలూడిపోయీ, బూట్లు జారిపోయీ ఒకేపరుగు."

ముసలతను కొంచెంసేపాగాడు. వున్నట్టుండి అతనిముఖంలో విషాదచ్ఛాయలు కన్పించినయ్. అతను చెప్పడం మొదలుపెట్టాడు.

సెమించెయ్యడమన్నది మాచెడ్డది బాబూ. సెత్రువు నీ సేతికిసిక్కితే సఫా సెయ్యటమేగాని, సెమించకూడదు. సెమించావంటే నువ్వు దెబ్బతినేసావన్నమాటే. మావోళ్లు సేసిందదేబాబూ! ఆళ్ళని కొట్టేయి. కుక్కల్ని కొట్టేయని బయల్దేరొచ్చేత్తన్నాం.

ఉన్నట్టుండి ఎనకాల తుపాకులు పేలినియ్యి. బిడ్డలు పిట్టల్లా రాలిపోయారు. సేనామందికి రవ్వలు తగిలాయి. జనమంతా పుల్లెనక్కి తిరిగిసరికి పారిపోయారు.

ఇంక సివరగా నీకోసంగతిసెప్పాల. మేం కూలి పెంచమన్నాం, నువ్వుసేమిరా అన్నావ్. మేం సమ్మెజేత్తే, నువ్వు పోలీసుల్ని తెచ్చావ్. ఆళ్ళకి పలావులూ పాయసాల్తో తెగమేపుతున్నావు. మా నాయకుణ్ణి తీసెయ్యటాకి లచ్చలకిలచ్చలు కర్చుపెడ్తున్నావు. ఆళ్ళకి కర్చుపెట్టేదాంట్లో పదోవొంతుకూడా మా కూలికి కర్చవ్వదు. అయినా నువ్వాళ్ళనే మేపుతావుగాని, కూలోడికి కానీ యిదవవు. పైపెచ్చు మీవోళ్ళం

దర్నీ పోగేసుకుంటున్నావు. ఉన్నోళ్లున్నోళ్లూ ఒకటైతే, మరి లేనోళ్ళంజెయ్యాల? ఎక్కడెక్కడున్నా అళ్లూ ఒకటవ్వాల. తాడోపేడో తేలిపోవాల. పేణాలు పోయినా పట్టిన కర్ర ఒదిలేదికల్ల. సివరివూపిరిదాకా పోరాడే తీరతాం. అదే అన్నాట్లకీ పరిష్కారం అళ్లసావు నాళ్ళే కొనితెచ్చుకుంటన్నారు.

ఆ మాటలంటూ అతను వుద్రేకంతో వూగిపోతున్నాడు. ప్రతీకారంతో నేత్రాలు అరుణారుణమైనాయి. పోతుగడ్డ పీడితలోకాన్ని ఎలుగెత్తి పిలుస్తున్నది.

మర్నాడు పేపర్లో వార్త.

"'పోతుగడ్డలో పోలీసు కాల్పులు. ఒకని మృతి. ఒక యస్సైతోసహా పలువురి పోలీసు సిబ్బందికి గాయాలు. కూలీలను అపహరించడం, భూస్వాములపై పోలీసులను రెచ్చగొట్టడం, దోపిడీలు, హత్యలు మొదలైన హింసాయుత కార్యక్రమాల్లో బహిరంగంగా నిమగ్నమైవున్న రాంబాబు అనేవ్యక్తిని పోలీసు అరెస్టుచేసి తీసుకువస్తుండగా అతన్ని విడిపించుకుపోవడానికి ఒక గుంపు కత్తులు, గొడ్డళ్లు, గునపాలు మొదలగు మారణాయుధాలతో పోలీసులపై దౌర్జన్యానికి దిగినప్పుడు పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించి ఫలితంలేక, ఆత్మరక్షణార్ధం తప్పనిసరిగా పోలీసులు కాల్పులు జరపవలసివచ్చినట్లు ఇక్కడి పోలీసు కేంద్ర కార్యాలయానికి అందిన వార్తలవల్ల తెలియవచ్చింది."

వార్త చూసి నేను విస్తుపోయాను.

ఆ వార్తనిబట్టి నా కర్థమైందేమిటీ అంటే ప్రజాస్వామ్యంలో కూలి, నాలి జనం శాంతికి భంగం కలిగిస్తారు. భూస్వాములు శాంతికాముకులుగనుక ప్రభుత్వం శాంతిని పరిరక్షించటానికి పోలీలులను వారికి సాయంపంపిస్తుంది. ప్రజలు దౌర్జన్యానికి దిగుతారు. పోలీసులు ఆత్మరక్షణార్ధం కాల్పులు జరుపుతారు. దేశాన్ని నిత్యం ప్రగతి పథంలో నడిపించడానికి పాటుపడే మన పత్రికలు పోలీసుల సాయంతో నమ్మకమైన వార్తల్ని ప్రకటించి దేశానికెంతో మేలుచేస్తాయి!

[పల్లంకుర్రులో జరిగిన కూలిపోరాటాన్ని ఆధారంగా తీసుకొని, దానికి వర్గదృక్పథంతో రూపకల్పనచేసి, పరిష్కారాన్ని సూచించాను. — రచయిత]

'మేము ప్రపంచ విప్లవంకోసం పనిచేస్తున్నాం. మేం మాకోసం మాత్రమే, మా సామూహిక జీవితం కోసం మాత్రమే, చైనా కోసం మాత్రమే కాదు, ప్రపంచ ప్రజల స్వేచ్ఛకోసం పనిచేస్తున్నాం. దేశ దేశాల ప్రజల పోరాటాలు మా భవిష్యత్తు కోసం కూడ సాగుతున్న పోరాటాలుగా మేం భావిస్తాం.'

[ఫెంగ్ వాంగ్-యెహ్, చైనా: రెవల్యూషన్ కంటిన్యూడ్ పేజి 185]

నవజీవనం

కె.వి.యస్. వర్మ

ఆ యిల్లు విషాదంలావుంది. ఆ యింట్లోని మనుషులు నిరాశతో వచ్చే నిట్టూర్పుల్లా వున్నారు.

అరగంటక్రితం ఆ యిల్లు ఏ ఆలోచనాలేని మెదడులా వుంది. సుభద్ర అత్తవారింటినుంచి నాలుగు మైళ్లు నడిచి నడిచి వస్తూ వస్తూ బోలెడు విషాదాన్ని మోసుకుని మరీ వచ్చింది. సుభద్ర తల్లీ తండ్రీ తమ్ముడూ తలోకాస్త విషాదాన్ని పంచుకున్నారు.

పదిహేను నెలలక్రితం సూర్యానికి హైదరాబాద్‌నుంచి ఇంటర్వ్యూ 'వుద్యోగం' ఆశచూపిస్తూ వచ్చింది. వెళ్దామంటే డబ్బులేదు. మానేద్దామంటే మొదటి ఇంటర్వ్యూ కావడంవల్ల మనసు వొప్పలేదు. ఏడుమైళ్లు తొక్కు సైకిలుమీద కాలేజికి వెళ్ళి మరీ చదివాడు బి.ఏ. వరకూ. రెండేళ్ళనుంచి ఖాళీగా వున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో సుభద్ర యిక్కడేవుంది. ఇంట్లోని పరిస్థితిచూసి, తన పెళ్ళినాడు పెట్టిన బంగారు గాజులజతా తీసి, తమ్ముడికిచ్చింది. తాకట్టుపెట్టి డబ్బు తెమ్మంది. సూర్యం పట్నంవెళ్ళి గాజులు తాకట్టుపెట్టేడు. నూటయాభై రూపాయలు పట్టుకొచ్చాడు.

సూర్యం ఋంటి ఖర్చులకు యాభై రూపాయలిచ్చి సర్టిఫికేట్లూ, వంద రూపాయలూ పట్టుకుని హైదరాబాదు వెళ్ళేడు. అయిదురోజులకి తిరిగి వచ్చాడు. ఉద్యోగం సంపాదించికాదు— ఉత్త చేతులతో.

రోజులు గడుస్తున్నాయి. సూర్యం ఉద్యోగప్రయత్నాలు చేస్తున్నాడు. ఎంప్లాయ్‌మెంటు ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు.

ఆకాశం నీలంగా వుంటూనేవుంది. వర్షం కురుస్తూనేవుంది. వెన్నెల వెండిలా మెరిసి పోతూనేవుంది. ఎండ నిప్పుల్ని వూదుతూనేవుంది మార్వాడీకొట్లో వడ్డీ పెరిగి పోతూనేవుంది.

జరిగిపోయిన కథలోంచి జరుగుతున్న కథలోకివస్తే—

సుభద్రకీ వాళ్ళ అత్తగార్కీ ఈ మధ్య పడకపోవడంవల్ల గొడవ వచ్చిపడింది. సుభద్రని ఎలా రాచి రంపాన పెట్టాలా అని ఆలోచిస్తున్న అత్తగారికి తటుక్కున ఆలోచన రానేవచ్చింది. సుభద్రని గాజులేంచేసేవని అడిగింది. సుభద్ర నిజాన్ని నిర్భయంగా చెప్పింది.

సుభద్రి అత్తగారు గట్టిగా అరిచింది. మాదంతా దోచేసి మీ పుట్టింటికి తరలించేస్తున్నావంది. ఇలాగైతే మా యిల్లు గుల్లయిపోతుంది అంది. తక్షణం పోయి గాజులు పట్టుకొస్తేనే యింట్లోకి రానిచ్చేదంది. సుభద్రిని బయటకు గెంటేసింది.

భర్త యింట్లో లేకపోవడంవల్ల, సుభద్రి నాలుగు మైళ్ళు నడిచి నడిచి వస్తూ బోల్డు విషాదాన్ని మోసుకుని మరీ వచ్చింది.

"నువ్వొస్తుంటే మీ వారేమీ మాట్లాడలేదా"

"ఆయన ఊళ్ళోలేరమ్మా"

"యిదంతా నాగురించే జరిగింది" అన్నాడు సూర్యం బాధపడుతూ.

"ఇప్పుడేం అనుకుంటే ఏంలాభం? ధాన్యం షావుకారి దగ్గరకు వెళ్ళివస్తానుండు"అని సుభద్రి తండ్రి వీధిలోకి నడిచాడు.

తిన్నగా ధాన్యం షావుకారి దగ్గరకు వెళ్ళేడు. పరిస్థితి చెప్పుకున్నాడు. కోతలు కోయగానే ధాన్యం తూగేస్తానన్నాడు. ఎలాగైనా డబ్బు సర్దమన్నాడు. షావుకారు మొదట, ధాన్యం తూయకుండా డబ్బివ్వనన్నాడు. ఆఖరికి, ధాన్యం తూసేటప్పటికి వుండేధరకి, బస్తాకు మూడురూపాయలు తగ్గించి యిచ్చాడు. రెండొందలు తీసుకుని, యింటికి వచ్చి, సూర్యానికి యిచ్చాడు. గాజులు విడిపించుకుని రమ్మన్నాడు.

సూర్యం బట్టలు మార్చుకుని బయల్దేరాడు.

పంచాయతీబోర్డు రేడియోనుంచి కార్మికుల కార్యక్రమం ప్రసారమవుతోంది. ఒక కార్మికునితో ఇంటర్వ్యూ.

"నువ్వు పనిచేసే కార్ఖానాలో పని కష్టంగా వుంటుందా? సులభంగా వుంటుందా"

"సులభంగానే వుంటుందండి"

"ప్రతినెలా జీతాలు సక్రమంగా యిస్తారా"

"మొదటి తారీఖునే యిచ్చేస్తారండి"

"నీకిచ్చే జీతం సరిపోతుందా"

"సరిపోకేమండి. ఇంకా మిగులుతుందికూడా"

వింటున్న సూర్యానికి నవ్వొచ్చింది. "మిగిలింది ఏం చేస్తావు" అనే ప్రశ్నా "వడ్డీకిచ్చుకుంటానండి"అనే జవాబుకూడా ప్రసారంచేస్తే ఇంకా బావుండుననుకున్నాడు.

ఊరు దాటేడు. ఒక మైలు నడిచాడు. దోనేపూడి కాలువదాటేడు. మరో రెండు ఫర్లాంగులు నడిచాడు, బస్సుకోసం చూస్తూ నిలబడ్డాడు. బస్సు వచ్చింది. ఎక్కేడు. ఒక గంట గడిచింది. బస్సు పట్నంలోకి బాణంలా దూసుకుపోయి, పంతెనకి దిగువగా ఆగింది.

సూర్యం బస్సు దిగేడు.

"బాబూ. కారులోంచి పడిపోయానండి. ధర్మం చెయ్యండి" పదిహేనేళ్ళకుర్రోడు అడుక్కుంటున్నాడు.

సూర్యం అతన్ని చూసేడు. వాడిదివరకు ఈ బస్సులోనే క్లీనర్‌గా పన్జేసేవాడు. బస్సునిండా జనాన్ని ఎక్కించేసి, తను తలుపు పట్టుకుని వేలాడేవాడు. అలా యజమానికి లాభాలు పెరగడానికి తోడ్పడేవాడు. పాపం, ఎప్పుడు పడ్డాడో బస్సులోంచి పడ్డాడు కాలు పచ్చడై పోయింది. క్లీనర్ వుద్యోగంపోయింది. అడుక్కునే వుద్యోగం వచ్చింది.

సూర్యం హృదయం ద్రవించి పోయింది. మేన్‌రోడ్డుమీద నడుస్తున్నాడు. కాళ్ళకి జోళ్లలేవు. నిప్పుల దారిమీద నడుస్తున్నట్టుంది. ఎండ వేడిగా కాస్తూంది. వెల్‌కమ్ హోటల్ దగ్గరికి వచ్చేడు. "ఆపదమొక్కులవాడా, ఓ శ్రీనివాసా" అని పాడుతూ హోటల్ ముందు కూచుని అడుక్కుంటున్నాడొకడు.

వేగంగా నడుస్తూ సూర్యం, నాలుగురోడ్ల సెంటరుదగ్గర ఆగేడు. కుడిపక్కకి తిరిగేడు. నాలుగడుగులు వేసేడు. "శేఠ్..." బోర్డుచూసేడు. లోపలికి వెళ్ళేడు.

మెత్తని పరుపుమీద తలకింద చెయ్యిపెట్టుకుని పడుకున్నాడు మార్వాడీ నాటకాల కృష్ణుడిపోజులో. మార్వాడీ బంగారు రంగులో పండిన అమృతపాణీ అరటి పండులా వున్నాడు. నుదుట చిన్నబొట్టువుంది.

మార్వాడీ సూర్యాన్నిచూసి, లేచి, గోడకి జారబడ్డాడు.

"ఏం కావాలి"

"మీదగ్గర జత బంగారుగాజులు సంవత్సరంక్రితం తాకట్టు పెట్టేను. విడిపించుకోమని మీదగ్గర్నించి లెటరుగూడా వచ్చింది. తీసుకుపోదామని వచ్చేను."

"ఎంతకు పెట్టేవు"

"నూటయాభైకి"

మార్వాడీ తన గుమస్తావంక చూసేడు. గుమస్తా రెండు చెక్కలమధ్య కట్టిన కాగితాల్ని తీసి, వెదికి, ఒక కాగితం మార్వాడీకిచ్చాడు. మార్వాడీ గుమస్తాని లెక్క కట్టమని చెప్పి, యినుపబీరువాదగ్గరకెళ్లాడు. ఒక సొరుగులాగి, అందులోనివస్తువుల్ని వెదికి, బంగారు గాజులజత తీసేడు. ఆ గాజులకి కట్టిన చీటీ తీసేడు.

"పదహారు నెలలయ్యింది. వడ్డీ యాభైనాలుగు రూపాయలు" అన్నాడు మార్వాడీతో గుమస్తా.

"యా భైనాలుగు రూపాయలెలా అయ్యింది? పదహారునెలలు ఎలాఅయ్యింది? చీటీ ఒకసారి చూడండి. పదిహేను నెలలే అయింది. ఇదుగో. ఇందులోవేసిన తారీఖు ప్రకారం పదిహేనునెల్లే అయింది. నెలకీ నూటికీ రెండురూపాయల వడ్డీ చొ॥న నూట యాభైకి మూడురూపాయలు. పదిహేనునెలలకి నలభై ఐదు"

"మీలెక్కకీ మాలెక్కకీ ఒకనెల తేడావస్తుంది. తర్వాత వడ్డీకి వడ్డీకడతాం."

"మీకోలెక్కా మాకోలెక్కా ఎలా వుంటుంది. వడ్డీకి వడ్డీకడతామని ముందే ఎందుకు చెప్పలేదు."

"ఆ అవసరం మాకులేదు. ఇంతకీ తీసుకువెళ్ళేదేరమేనా" వ్యంగ్యంగానవ్వుతూ మార్వాడీ.

సూర్యం కళ్ళకి మార్వాడీ అసహ్యంగానే కాకుండా కలుపుమొక్కలాగకూడా కనిపించాడు.

ఇద్దరూ కొంచెంసేపు వాదించుకున్నారు. ఇద్దరి లెక్కకీ వున్న తేడా తెగలేదు. అన్యాయంగా అనవసరంగా మార్వాడీకి ఎందుకు ఎక్కువ యివ్వాలనుకున్నాడు సూర్యం.

"న్యాయంగా తారీకుప్రకారం వడ్డీ నలభై ఐదూ, అసలు నూటయాభై మొత్తం నూటతొంభైఅయిదూ యివిగో" అని ఎదురుగావున్న బల్ల మీద పెట్టేడు సూర్యం.

"మిగతా తొమ్మిదీ ఏవి?"

"అవి యివ్వనవసరంలేదు. గాజులిలాయియ్యి"

"ఇవ్వను"

"ఎందుకివ్వవూ"

"ఎందుకివ్వాలి"

సూర్యం మార్వాడీదగ్గరకెళ్ళేడు. అతని చేతుల్లోని గాజులు లాక్కున్నాడు. గుమ్మం దాటబోయాడు. మార్వాడీ సూర్యం కాలరు పట్టుకున్నాడు.

"నక్సలైటులావున్నావే! గాజులు పట్టుకుపోదామనే"

"ముందు కాలరొదులు. నీకు రావలసింది నీకు ముట్టిందిగా"

మార్వాడీ సూర్యం చేతిలోని గాజులు లాక్కోబోయాడు. సూర్యం మార్వాడీని బలంగా తోసేడు. మార్వాడీతల గుమ్మానికి తగిలింది. నుదురు చిట్లింది. రక్తం కారింది రక్తాన్నిచూసి మార్వాడీ గజగజవణికాడు.

పక్కకొట్టుల్లోంచి కొంతమంది వచ్చేరు. సూర్యాన్ని పట్టుకున్నారు. గుమస్తా సిగ్గుతో తలవంచుకుని నిలబడ్డాడు. మార్వాడీ వణుకుతూ చెప్పగా, గుమస్తా పోలీస్ స్టేషన్కి ఫోన్ చేసేడు.

* * *

రోడ్డు బ్లాక్ కలర్ పేపర్‌లావుంది. సూర్యం నడుస్తున్నాడు. అటూ యిటూ చూస్తూ నడుస్తున్నాడు. అంతా బిజీగా వున్నారు.

హోటల్స్‌దగ్గరా కిళ్ళీబడ్డీలదగ్గరా ఒక్క ముష్టివాడుకూడా లేడు.

సూర్యం బస్‌స్టేండ్‌దగ్గరకొచ్చాడు. తిరుపతిగుండుకానీ అన్నవరం గుండుకానీ కనిపించలేదు. సూర్యం ఆశ్చర్యపోతూ ముందుకు నడిచాడు.

ఎక్కడా ఎవరూ ఏం చదివేవనీ, ఏంచేస్తున్నావనీ ఎవర్నీ అడగడంలేదు. నీ కులం ఏవిటని అడగడంలేదు. నీ వృత్తే విటని అడుగుతున్నారు. ఏం ఉద్యోగం చేస్తున్నావని అడుగుతున్నారు.

సూర్యం నడుస్తూ దేవాలయందగ్గరికి వచ్చాడు. కొంతమంది బయటకువచ్చారు. వాళ్ళ ముఖాల్ని బొట్లు లేవు. చెవుల్లో పువ్వులేవు. వాళ్ల దేవాలయంమీది శిల్పాల గురించీ, శిల్పుల ప్రతిభ గురించీ మాట్లాడుకుంటున్నారు. సూర్యం సంభ్రమంగా వాళ్ళని చూసేడు.

పక్కరోడ్‌మీదకు తిరిగాడు. కుడిచేతివేపున 'బొమ్మల పరిశ్రమ' బోర్డు కనిపించింది.

ఒకడు మట్టితో బొమ్మలు చేస్తున్నాడు సూర్యం వాడ్ని పరీక్షగా చూసేడు. వాడిదివరకు వెల్‌కమ్ హోటల్‌దగ్గర "ఆపదల మొక్కులవాడా ఓ శ్రీనివాసా"అని పాడుతూ అడుక్కునేవాడు. వాడిప్పుడు బొమ్మలుచేస్తూ "ఏరువంటే కొందరికి భయం భయం– పసిపిల్లలు వారికన్న నయం నయం"అని పాడుకుంటున్నాడు ఉత్సాహంగా. మరొకడు బొమ్మలకు రంగులు వేస్తున్నాడు. అతన్ని సూర్యం పరిశీలనగాచూసేడు. అతనింతకుముందు రోడ్డుమీద బొమ్మలువేసి, అడుక్కునేవాడు. అతని చేతిలోని బొమ్మను చూసేడు సూర్యం. అతనప్పుడు ఆ బొమ్మ కళ్ళల్లో ఎర్రజీరల్ని చిత్రిస్తున్నాడు. సూర్యం మిగతా బొమ్మల్ని చూసేడు.

ఆ బొమ్మల్లో ఏ దేవుడిబొమ్మాలేదు. సమాజాన్ని ప్రతిబింబించే బొమ్మలున్నాయి– చైతన్యవంతంచేసే బొమ్మలున్నాయి.

సూర్యం అక్కడనుంచి ముందుకు నడిచాడు. అక్కడింతకుముందువుండే పూరి గుడిసెలులేవు. మురికిలేదు అందంగా సింపుల్‌గా యిప్పుడక్కడ పెంకిటిళ్లున్నాయి. వాకిళ్ళు యిస్త్రీచేసిన తెల్లదుప్పట్లలా వున్నాయి. డొక్కలెండి ఆకలికళ్ళతో అడుగడుగునా కన్పించే వాళ్ళెవరూ లేరు. ప్రతి మనిషి యాపిల్‌పండులా వున్నాడు. ప్రతి ముఖం తృప్తిగా వుంది.

సూర్యం సంతోషంగా నడుస్తున్నాడు. ఎడమచేతివేపున వుండాల్సిన 'ఎంప్లాయ్‌మెంటు' ఆఫీసు కనిపించలేదు. బిల్డింగ్ మాత్రం వుంది. బోర్డు లేదు. అటువేపే వస్తున్నవాణ్ని ఆపి, ఇక్కడి ఆఫీసు ఏమైందని సూర్యం అడిగాడు. అతను సూర్యాన్ని అదోలాచూసి "యింకా ఎంప్లాయ్‌మెంటాఫీసెందుకు? చదువునీబట్టీ, అతని ఇంటరెస్ట్‌ని బట్టీ, పాసైన సర్టిఫికేట్ మీద ఫలానా ఉద్యోగం అని రాసిస్తారు. వెళ్ళి జాయినయిపోవడమే" అన్చెప్పి, అతను తనదారిన తను వెళ్ళిపోయాడు.

సూర్యం నడుస్తున్నాడు. నడుస్తున్నాడు. ఒక కార్ఖానాదగ్గర ఆగాడు. యూనిఫార్మ్‌లో వున్న కుర్రాళ్ళు కార్మికులతో కలిసి పనిచేస్తున్నారు. చాలా ఉత్సాహంగా సరదాగా పనిచేస్తున్నారు. సూర్యం కళ్ళు పెద్దవి చేసుకుని చూసేడు. 'ఇదేమిట'ని ఒక కార్మికుణ్ణి అడిగాడు సూర్యం. అతను నవ్వుతూ చెప్పేడు "వీళ్ళందరూ కాలేజీల్లోనూ హైస్కూళ్ళల్లోనూ చదువుకుంటున్నారు. ఐతే, వారానికోసారి కార్ఖానాలకి వస్తారు. మా దగ్గర పనినేర్చుకుంటారు. దీనివల్ల కష్టం అంటే ఏమిటో తెలుస్తుంది. శ్రమజీవిమీద గౌరవం పెరుగుతుంది."

సూర్యం హుషారుగా చలాకీగా వేగంగా నడుస్తున్నాడు. పట్నం దాటేడు. పొలాల్ని దమ్ము చేస్తున్నారు. యూనిఫార్మ్‌లోవున్న విద్యార్థులు వస్తున్నారు. యువకులతోనూ పెద్దవాళ్ళతోనూ కలిసి కేరింతాలు కొడుతూ వస్తున్నారు. సూర్యం 'యిదేమిట'ని అడుగుదామనుకున్నాడు. అర్థం అయ్యింది. "శ్రమకు ఎంతవిలువ వుందో!" అనుకున్నాడు.

అతనికి ఆనందం అధికం కావడంవల్ల కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయి. మనసు తెగమురిసిపోతోంది. సంతృప్తివల్ల కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

* * *

మూడు గంటలు ఠంగ్ ఠంగ్‌మని బరువుగా మోగేయి. సూర్యానికి మెలకువ వచ్చింది. ఒళ్ళు విరుచుకున్నాడు. లేచి నిలుచున్నాడు. మార్వాడీ మనసులా నల్లగా వుంది రాత్రి. సూర్యం కళ్ళు మూసుకున్నాడు. కల గుర్తుకు వచ్చింది. అతని మేను పులకించి పోయింది.

"అమ్మా వసుమతీ కన్నతల్లీ! నీ వొంటిమీద భయంకరంగా మొలిచిన వ్రణాలకి ఆపరేషన్ చేసి, నీ బాధని పూర్తిగా పోగొట్టగలమా? నీ ముఖంమీద పచ్చని చిర్నవ్వును ఎప్పటికైనా జూడగలమా? కులమతాలూ ఎక్కువ తక్కువలూ ఆకలీ దోపిడీ లేని మరో ప్రపంచాన్ని సృష్టించుకోగలమా? నేనుకన్న స్వప్నాన్ని సత్యం చేసుకోగలమా? స్వేచ్ఛల సంతృప్తుల సమతా జీవనాన్ని సాగించగలమా?"

సూర్యానికి మరి నిద్రరాలేదు. రాత్రికి కాపలా కాస్తూనేవున్నాడు. ఆలోచనలకు పదును పెడుతూనేవున్నాడు.

తెల్లవారింది. సూర్యం కటకటాల్లోంచి బయటకు చూస్తున్నాడు.

ఇంతలో—

జైలు గది తలుపులు తెరుచుకున్నాయి. ఒక వ్యక్తిని లోపలికితోశారు. తలుపులు మూసుకున్నాయి.

సూర్యం ఆ కొత్త మనిషిని పరికించి చూశాడు. కొద్దిగా మాసినగడ్డం. కష్టించి పన్జేసేవాడని తెల్పుతూ కండలు తిరిగిన చేతులు. పంచె. బనీను. ముప్పై ఏళ్లపైగా వుండొచ్చు.

"నిన్నెందుకు తీసుకొచ్చారిక్కడికి ?"

"ఎందుకేటి. బుగతని నరికేసేను."

"ఏం"

"సిన్నప్పట్నించీ ఆడిదగ్గర పనిసేత్తన్నాను, ఒకపూట తినీ, తినకా, నాజీతం డబ్బుల్లోంచి కొంచెం కొంచెం మిగిల్చి, ఆడిదగ్గర దాత్తన్నాను. ఎందుకని అడగవేం? నా కూతురి మనువు సేద్దారని ; మొన్నదానికి మనువు కుదిర్చేను. బుగతదగ్గరికెళ్ళి, నేన్దాచుకున్న డబ్బిమ్మన్నాను. డబ్బేటన్నాడు. నువ్వు దాయటమేటిరాఎదవా అన్నాడు. బతిమాలేను. నా డబ్బు నాకిచ్చీమని ఆడికాళ్ళమీదపడ్డాను. ఆడు ఛీఛీ పోరా యెదవా అని గెంటీసీడు. నాకింక ఒళ్ళు కిందా మీదా తెలలేదు. అప్పుడే పచ్చగడ్డికోసి, దూళ్ళకి పడేసివచ్చేనేమో. కొడవలి చేతిలోవున్నది. దాంతో ఆ నంజికొడుకుని నరికేసేను. సచ్చేడోనేదో తెలీదనుకోయింకా."

సూర్యం కళ్ళు తళతళా మెరిసేయి. అతను తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. అతని గుండెకి కొండంతబలం వచ్చింది. అతని మెదడులో ఆలోచనలు ఆనందంగా ఆడుకుంటున్నాయి.

అరుణారుణకిరణాలు ప్రతి యిసుకరేణువునీ తాకుతున్నాయి. ఆకలికి మలమల మాడుతున్నవాళ్ళు... అన్యాయాలకు ఆహూతి అవుతున్నవాళ్ళు... యింకా శాంతంగా వుంటారా... యింకానా... యింకానా...

బీహార్‌లో విద్యార్థుల ఆందోళనకు బాసటగా పాట్నాలో ఐదుగురు కవులు, సాహిత్యవేత్తలు సుప్రసిద్ధ కళాకారుడు దామోదర్ అంబస్తా 12 గంటలు నిరాహారదీక్ష చేసారు. 'శ్రీస్రీఖసం' అనే గ్రంథానికి సాహిత్య అకాడమీ అవార్డ్ పొందిన ఫణీశ్వర్‌నాథ్ రేణు కూడా యీ నిరాహారదీక్ష చేసినవాళ్ళలో వున్నాడు.

గైడ్

చైనా మూలం : యేట్జు
అనువాదం :. అరుణ

లియూ పెద్దమ్మకు కాలిమీద గాయం చెప్పరాని బాధ కలిగిస్తూంది. అయినా పళ్ళ బిగువున ఆ బాధభరిస్తూ శక్తినంతనూ కూడగట్టుకొని ఆ పాడుబడిన గుడిలోనుండి బయటకు పాకాలని ప్రయత్నించింది. గాయంనుండి రక్తం కారుతూనే ఉంది. అది గాలికి వెంటనే గడ్డకడుతూంది. ఆమె కట్టుకున్న బట్టలు రక్తంతో తడిసి గాయానికి అంటుకుపోతున్నాయి. బట్టలమీది రక్తం నల్లని మరకలుగా మారుతూంది.

ఒక అడుగు ముందుకు వేసింది, ఏదో బాణం శరీరాన్ని చీలుస్తూ తిన్నగా గుండెల్లో గుచ్చుకొన్నట్లుగావుంది ఆ బాధ. అయినా ఇంకొక కాలు, రెండు చేతుల సాయంతో ఒక్కొక్క అడుగు ముందుకువేస్తూ గుడి తలుపువైపు పోతూంది. ఆమె వెనక దెబ్బతగిలిన కాలు గాలిలోకి లేస్తున్నది. గడపలోకి చేరుకొనేసరికి ఆ బాధకు తట్టుకోలేక కుప్పకూలిపోయింది. రాతిమెట్లమీదగా కిందపడిపోయింది.

ఆమె బాధతో మూలుగుతూంది. రెండుచేతులూ గుండెలమీదపెట్టుకొని బాధతో నిండిన కళ్ళతో ఆకాశంలోకి తదేకంగా చూస్తూంది.

మెరుస్తున్న ఆ చుక్కల్ని చూస్తుంటే ఆమెకు తనచుట్టూవున్న ప్రపంచంగిర్రున తిరుగుతున్నట్టుంది. తనను మింగటానికే చూస్తూందా ఈ రాత్రి అనిపించింది...

"అందాజాగా అర్ధరాతిరి దాటి ఉండొచ్చు"అనుకున్నదామె.

కలబడిందా ఏంది అనుకుంది! చల్లనిగాలి ముఖానికి తగిలేసరికి ఆమె శరీర మంతా ఒక్కసారి కదిలినట్లయింది. మనస్సు కొంచెం తేలికపడింది. కాని దానితో పాటు కాలిమీద దెబ్బ బాధ మరింత ఎక్కువైంది.

"ఓ పోచమ్మ తల్లీ! అమ్మా సాయం రాతల్లీ! అని పెద్దగానే అన్నది లియూ పెద్దమ్మ. అలవాటుగామారిన పిలుపేగాని నిజంగా నమ్మకంతో కాదు ఆమె అలా పిలిచింది.

తన ముగ్గురు కొడుకులూ చంపబడినప్పటినుండీ ఆ దయగల పోచమ్మ తల్లిని చాలవరకు మరచిపోయిందామె. ఒక పసిపాప ఏడుస్తూ తన తల్లిని పిలిచినంత సహజంగా ఇప్పుడామె పోచమ్మతల్లిని పిలిచింది. అయినా తన గుండెల్లోని బాధ ఆ దేవ

తను తెలిసినంతగా ఈ దునియాలో ఎవ్వరికీ తెలియదనుకుందామె. అందుకే అలవాటు ప్రకారం ఇట్లా ప్రార్థించడం మొదలుపెట్టింది.

"ఓ పోచమ్మ తల్లీ! దయజూడమ్మా. నలభై ఏళ్ళనుంచి నిన్నే కొలుస్తుంట. నా కొడుకులను సంపినోళ్ళమీద బదులు తీర్చుకోనాల. సాయం రా మా యమ్మా! అయ్యో!.... నా కొడుకులు... వాళ్ళే నా ప్రాణం...నేను యింకేమీ కోరను. నిన్ను బదులుతీర్చుకోవటమే... ఓ తల్లీ!...నేను...నేను...కోరేది అదే..."

చంపివేయబడిన తన కొడుకులు యింకా కళ్ళకు కట్టినట్లుగా కళ్ళముందే ఉన్నట్లుగా వాళ్ళను పేరుపేరునా తలచుకొంటున్నది లియూ పెద్దమ్మ. పెద్దకొడుకును... తల నరికివేశారు. శరీరమంతటా ఏడుచోట్ల కత్తితో లోతుగా గాయాలుచేశారు. అతని పేగులన్నీ నేలమీద చిందర వందరగా పడ్డాయి. చిన్నవాళ్ళిద్దరూ? ఒకతనిని నిలువుగా మూడుసార్లు చీల్చారు. మూడవకొడుకును పూర్తిగా ముక్కలు ముక్కలు చేసి పడేశారు. వాళ్ళచుట్టూ నేలంతా రక్తంతో నానిపోయింది. "బందిపోటు సి బ డి లు[1] చంపబడినారు" అని రక్తంతో మూడు అట్టలమీద రాసి ప్రదర్శించారు

"దేవుడా!"

లియూ పెద్దమ్మ పళ్లు గిట్టకరిచింది; శరీరాన్ని చీల్చుకొని బయటకు వచ్చేటట్లుగా గుండె అతివేగంగా కొట్టుకొంటూంది. అతి కష్టంమీద ఆమె లేచి కూర్చుంది. ఒక నిట్టూర్పువిడిచి కళ్ళ నీళ్ళు తుడుచుకుంది. కాని వెంటనే ఆమె కళ్ళనుండి నీళ్ళు ధారగా కారసాగినయి. పక్కకు తిరిగి కన్నీళ్ళతో మసకబారిన కళ్ళతో చీకట్లోకి చూస్తుంది. తనలో తనే ఆశ్చర్యపడుతూ "వాళ్ళు ఇయ్యాల వచ్చితీరాల" అనుకుంది.

తనలో చెలరేగుతున్న సమస్యయొక్క ప్రాముఖ్యతను గుర్తుకు తెచ్చుకున్నది లియూ పెద్దమ్మ. వెంటనే చనిపోయిన తన కొడుకుల రూపాలను తాత్కాలికంగా మరచిపోవాలనుకుంది. తన ముందున్న సమస్యను గురించే ఎడతెగకుండా ఆలోచించసాగింది. ఆ మంద[2] బహుశా తెల్లవారే వరకూ రాకపోవచ్చుననుకుందామె. కాని వచ్చితీరతారు. వాళ్ళిప్పటికే భూదేవి మఠం వరకూ వచ్చారనీ తెల్లవారే ముందుగానే ఇక్కడికి వస్తారనీ రాత్రి పిల్లలు[3] అన్నారు. ఆప్యాయంగా తమతో ఆమెను రమ్మన్నారు. కాని ఆమె వెళ్ళలేదు. వాళ్లెప్పుడూ ఆమెను తమ సొంత తల్లిగానే చూసేవాళ్లు. ఇక్కడే ఉండిపోవాలన్న తన స్థిరనిశ్చయాన్ని వాళ్ళకు తెలియజెప్పింది. ఎందుకంటే ఆ వెధవల పని ఎట్లా పట్టాలో ఆమెకు తెలుసు. "యాభై ఏళ్ళు దాటిన ముసలి

---

1. కొమింటాంగ్ అభివృద్ధివిరోధకులు ప్రజావిముక్తి సైన్యానికి పెట్టిన పేరు.
2. కొమింటాంగ్ సైనికులు. 3. ప్రజావిముక్తి సైనికులు.

దాన్ని. నాకెందుకు నాయనా పేకరు" అందామె. తన కొడుకుల కోసం ఆమె ఏం చెయ్యటానికైనా సిద్ధంగావుంది. ఆమె ఇంకేవిషయాన్ని గురించీ ఆలోచించటంలేదు. ఒకే ఒక్క విషయంగురించి తప్ప. తన కాలిమీద కావాలని తనే గాయంచేసుకుంది. ఆ బాధను అలాగే భరించుతూంది ఆమెకున్న బాధల్లా ఒక్కటే బహుశా ఆ మంద అసలు రాకపోతే...

తెల్లవారుజాము 5 గంటలు కావచ్చు. ఆకాశంలో చుక్కలు మాయమౌతున్నాయి. ఆమె అలాగే ఎదురుచూస్తున్నది.

"అళ్ళు యిప్పటికి వత్తుండొచ్చు"

మళ్ళీ ఆమె మనస్సులో అనుమానం తలెత్తింది వాళ్ళసలు రాకపోతే తనేం చెయ్యాలి? ఇంత జాగ్రత్తగా ఆలోచించి వేసిన ప్లానంతా నీటిమీద బుడగై పోదూ? ఇప్పటివరకూ భరించిన బాధంతా వట్టిగా పోవాల్సిందేనా? ఇలా ఆలోచిస్తూ గడప ముందు రాతి మెట్టుమీద కూలిపోయింది. ఇంతలో దూరం నుండి తుపాకి "ఢన్" మన్న చప్పుడు.

అది అస్పష్టంగా ఉంది. అవునా కాదా అని అనుమానం వచ్చింది.

ఢన్, ఢన్, ఢన్ మని మళ్ళీ చప్పుడు..

ఇప్పుడామె స్పష్టంగా వినగలుగుతూంది నిజంగా వాళ్లొస్తున్నారా!... చెవులు నిక్కబొడుచుకుని వినసాగింది. తుపాకి కాల్పుల చప్పుడు ఎక్కువైంది. అది ఇంకా దగ్గరవుతూంది

ఢన్ ఢన్ ఢన్ ఢన్! పట్ పట్ పట్ పట్...

"నిజంగా వాళ్ళొస్తున్నారు!"

ఆమెలో ఉద్వేగం ఎక్కువైంది. ఆత్రంగా, సంతోషంతో ఎదురుచూస్తూంది.

"మంచిది. అట్లాగే కావాల" అనుకుందామె.

వాళ్ళను గురించి ఆమె భయపడడం లేదు. పగిలిపోయిన ఆమె ముసలిగుండె చెప్పరాని ఆవేదనతో నిండిపోయింది.

అంతకంతకూ దగ్గరవుతున్న ఆ చప్పుడును లియూ పెద్దమ్మ ఆత్రంగా వినసాగింది. తన "పిల్లలు"గుడిని ఖాళీచేసి పోయారని వాళ్ళకు తెలుసు. అయినా దానిని నేలమట్టం చెయ్యాలని తుపాకిగుళ్ల కురిపిస్తున్నారు.

నరాలు బిగుసుకున్నట్టు అనిపించింది లియూ పెద్దమ్మకు. మళ్ళీ ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది. పెద్దగా ఏడ్చేద్దామా అనిపించింది. భయంతో కాదు ఆమె ఏడ

వటం. తను పడిన కష్టాల్ని తలచుకొని ఆమె ఏడ్చింది. ఎందుకు తనిన్ని కష్టాలు పడవలసి వచ్చింది? ముసలితనంలో తను ఈ రొమ్ముల కుంపటిని భరించగలదా? తన కొడుకులు, తనూ... ఇదంతా ఇలా జరగాలని ఆ దేవుడు ముందే రాశాడేమో!..

ఏమైనాసరే తను ఈ బాధతో చచ్చిపోకూడదు అనుకుని శక్తినంతనూ కూడదీసుకుని చీలుస్తున్నట్టున్న ఆ బాధను ఓర్చుకుంటూంది లియూ పెద్దమ్మ. కొంచెం కదిలితేచాలు కాలిబాధతో ఆమె మెలికలు తిరిగిపోతూంది. ఇంతలో ఆగకుండా వినిపిస్తున్న తుపాకి కాల్పులు దగ్గరవుతున్నాయి. ముక్కలు ముక్కలుగా నరకబడిన తన కొడుకుల్ని తలచుకుని దుఃఖం దిగమింగింది. మనస్సు రాయిచేసుకుంది.

ఇంతలో ఒక గుండు గాలిలో దూసుకుపోయింది. వెంటనే ఆమె దెబ్బతగిలిన కాలును రెండుచేతులతో పట్టుకుని గడపముందునుండి కింది నేలమీదకు దొర్లింది.

తెలతెలవారుతూంది. ఉన్నట్టుండి కాల్పులచప్పుడు ఆగిపోయింది.

అప్పుడు టట్ - టట్ - టట్ -...

"ముందుకు ఉరకండి"

అని గర్జిస్తూ తనవైపువస్తున్న మనుష్యులను చూస్తుంటే ఆమెకు ఏం జరుగుతూందీ తెలియడంలేదు. ఆ చోటంతా అరుపులతో చప్పుళ్ళతో మారుమోగిపోయింది. ఆమె కళ్ళు గట్టిగా మూసుకుంది.

కొన్ని చెదురుమదురు కాల్పులతర్వాత వాళ్ళు లియూపెద్దమ్మను అన్నిపక్కల నుండీ చుట్టుముట్టారు. దాంతో ఆమె కళ్ళుతెరవడానికికూడ భయపడింది. ఏదైతే అది అవుతుందని ఆమెపక్కకు తిరిగి లేచికూర్చుంది. తనలో తను ఇలా అనుకుంది:

"వచ్చి పట్టుకోండిరా! ఈ నా ముసలిప్రాణం ఏక్షణంలోనైనా పోయేదే."

2

లియూ పెద్దమ్మను విచారించి శిక్షించడానికి తాత్కాలిక ట్రిబ్యునల్ ఏర్పడింది. అది పిల్లల ఆటలాగ ఉంది. అయినా ఆమె గాబరాపడింది. నలుగురు సైనికులు ఒక వరసగా హాలుకు రెండుపక్కలా ఎనిమిదిమంది సైనికులు ఆటోమాటిక్ పిస్టళ్ళు పట్టుకొని నిలబడ్డారు. హాలుమధ్య పవిత్రమైన దేవతాపీఠంఉంది. అది అమ్మవారి దేవాలయం. లియూపెద్దమ్మను పట్టుకొన్న ముగ్గురు రెజిమెంటల్ కమాండర్లను, ఒక కంపెనీ కమాండరును ఈ కోర్టుమార్షల్‌కోసం పిలిచారు.

ఇక అప్పుడు బ్రిగేడ్ కమాండర్ పీఠం వెనకనుండివచ్చి "అటెన్షన్"అన్నాడు. ఒక్క ఎగురు ఎగిరి పీఠంమీదకు చేరుకున్నాడు. కళ్ళు సగంమూసి పరవాలేదన్నట్టు

గార్డుల వైపు చూశాడు. మీసాలను అటూ ఇటూ తిప్పింతర్వాత మధ్యలో ఉన్న కొయ్య బల్లమీద కూర్చున్నాడు.

"మామూలుగా నిలబడండి" అన్నాడు.

బ్రిగేడ్ కమాండర్ కుడివైపున ముగ్గురు రెజిమెంటల్ కమాండర్లు కూర్చున్నారు. ఎడమవైపున రికార్డుచేయడానికి కంపెనీ కమాండరు కూర్చున్నాడు.

"రా" అని ఆజ్ఞాపించాడు బ్రిగేడ్ కమాండర్. మీసాలు మెలేస్తూ "ఆ ముసలి దాన్ని ఇటుతీసుకురా" అన్నాడు.

"ఎస్‌సార్"

ముగ్గురు సైనికులు లియూ పెద్దమ్మను హాలుమధ్యకు ఈడ్చుకొచ్చారు. మూర్ఛ వచ్చినంత పనిఅయింది ఆమెకు. కళ్ళుపెద్దగచేసి చుట్టూచూచింది. రక్తం తాగడానికి చూస్తున్న తోడేళ్ళలాటి సైనికుల గుంపుతప్ప ఆమెకేమీ కనిపించలేదు.

మధ్యలో నిటారుగాకూర్చున్న ఐదుగురూ తమ కోరలతో మనుష్యులను పీక్కుతినేటట్లున్నారు, మిగిలినవాళ్ళు గుంటనక్కల్లాగ ఉన్నారు. "అరి దేవుడా! ఈళ్ళేగా హాంగ్ చీటుంగ్‌లో "నా" పిల్లల్ని ముప్పూరుమందిని సంపిపడేసింది! ఈళ్ళే నా కొడుకుల్ని సంపేసిర్రు. అవును. ఆళ్ళంతా ఒక్కటే సైతాన్లు, అందరూ సైతాన్లే."

తన చుట్టూఉన్న ట్రిబ్యునల్‌ను చూస్తుంటే కోపంతో ఆమెకళ్ళు నిప్పులు చెరిగాయి. ఆ తోడేళ్ళమీదపడి పళ్ళతో చీల్చి చెండాడి తనకొడుకుల్ని చంపినందుకు బదులు తీర్చుకోవాలనిపించింది! ఇప్పుడు అట్లాచెయ్యలేదు. ఇప్పుడుకాదు...... తన కక్షని, దుఃఖాన్ని దిగమింగాలి. వీళ్ళతో ఎలాగో కొంతసేపుండాలి. తర్వాత......

లియూ పెద్దమ్మ పళ్ళుబిగించి అతికష్టంమీద గుండెమంటను అణచుకొంది. కోపంతో కళ్ళనిండా నీళ్ళునిండాయి. చివరికి సర్దుకొని తన కథనుమార్చి ఇట్లాచెప్పింది.

"ఓ దొరా! నా, నా అత్తగారింట్లో పేరుహాంగ్ తల్లిగారింట్లో లియూ అనేవాళ్ళు......"

"నువ్వు ఇక్కడికెలా వచ్చావే?"

"ఆ ఏడూ పింగ్ చియాంగ్ పట్టణానికి బందిపోటోళ్ళొచ్చిర్రుగదా. అప్పుడు నా కుటుంబమంతా ఊరొదిలి పారిపోయినం. హిసియాంగ్యిన్ పట్టణంలో తల దాచుకున్నాం. బహుశా పోయిననెలలో అనుకుంటా, ఇంకొక దొర సైన్యంతో వచ్చిండు. పింగ్ చియాంగ్ చుట్టుపట్లఉన్న బందిపోటోళ్ళందరినీ సంపినమనీ, జనమందర్నీ వాళ్ళ వాళ్ళ ఇళ్ళకు తిరిగిరమ్మనీ గోడలమీద కాగితాలు అంటించిర్రు. అప్పుడు అప్పుడు నేను

తిరిగి నా ముగ్గురు కొడుకులతో ఈ ఊరు వచ్చినాను. ఈ గుడిని అంటుకొని మేము ఉండేతందుకు ఒక చిన్న గుడిసేసుకున్నం. అయ్యో దేవుడా! చెప్పా పెయ్యకుండా ఒక దినం రాత్రికిరాత్రే ఆ దొర ఉడాయిస్తడని నాకేఎరక దొరా! ఆ బందిపోటోళ్లొచ్చి నిద్రలనుండి లేపిందనక మాకెరకనేలేకపాయె ఈ ముచ్చట. యాడ జూడూ బందిపోటోళ్లే! ఓ దొరా! ఏం జెప్పుదూ...మేం...మేం...

లియూ పెద్దమ్మ గుండెలు పగిలేటట్లు ఏడుస్తూంది

"అప్పుడు మీరూ బందిపోటోళ్ళతో చేరిపోయారేమే?"

"హూ, హూ...హూ..."ఏడుస్తూనే ఉందామె.

"మాట్లాడవేమే"అని గద్దించాడు బ్రిగేడ్ కమాండరు.

"నా నశీబు అట్లున్నది దొరా!...అప్పుడు నా కొడుకుల్ని ముగ్గుర్నీ గుంజుకుంట బోయిన్రు...ఒకవెనక ఒకరిని అందర్నీ సంపిన్రు దొరా! నాకు ఇగ ఒక్కకొడుకన్న లేడు దొరా!... హూ హూ..."

"ఏమంటున్నావ్ వాళ్లు నీకొడుకుల్ని చంపారా!" వెంటనే బ్రిగేడియర్ అడిగాడు "మరి అప్పుడు నువ్వేంచేశావు?"

"హూ...హూ...హూ"ఏడుస్తూనే ఉంది.

"చెప్పు. చెప్పు. తర్వాతేమైందో చెప్పు. ఆదుర్దాగా అడిగాడు కమాండర్. ఆదుర్దా ఎక్కువైనకొద్దీ మీసాలు మరొకసారి ఎక్కువ మెలేస్తున్నాడు.

"నేనా - దొరా! అది జూస్తనే బేహోసయినా. జరయినంక కండ్లు తెరిచి చూచినా. వాళ్ళమీదపడి గోళ్ళతోను, పళ్ళతోను చీలుద్దామనుకున్నా. అంతలో హిసి యాంగ్యన్‌లో ఇద్దరు మనుషులున్నారాని యాదొచ్చింది. బతికుండి ఎట్లగన్న వాళ్ళను పెద్దగ చెయ్యాల, వాళ్ళ నాయనల్ని సంపినోళ్ళ పని పట్టాలనుకుంటి. బదలా తియ్యాల దొరా! నా కొడుకుల్ని సంపినోళ్ళమీద బదలా తీసుకోవాల! - అప్పుడు అల్లు నన్ని గుడిల ఏసి తాళమేసిన్రు. అళ్ళ సినిగిన అంగీలు కుట్టమని సాపు చెయ్యమనీఅన్నరు. ఉహా!—"

"ఆ తర్వాతేమైంది?" ఒక ఉబ్బుముఖం రెజిమెంటల్ కమాండరు అడిగాడు.

"అప్పుడా దొర! నేను అనుకున్నట్లగనే కండ్లల్ల నీళ్లు తుడుసుకున్న. ఏడుపు దిగమింగినా. పదిపేను దినాలపంది అట్లనే అళ్ళ పనులు చేత్తున్న. అల్ల కండ్లల్ల దుమ్ము చల్లి ఎల్లిపోదామని అనేకం అనుకున్న. నాతోని గాలేదాపని. ఇగ రాతిరి ఏమైందనుకున్నవు? ఉన్నట్టుండి అల్లు కిందు మీదయిన్రు. పారిపోవాలనుకున్నట్టుంది నేను ఏమని సోచాయించినానంటే ఎట్లనన్నజేసి ఇప్పుడే తప్పించుకుపోవాల. నామనసు

లో మాట ఆళ్ళకు తెలిసినట్టు నన్ను ఆళ్ళతోనే రమ్మని బెదిరించిన్రు. ఆ జంగిలోళ్లు నా గుడిసెకి నిప్పుబెట్టిన్రు. నన్ను ఆళ్ళతో లియావ్‌షాంట్స్యకు తోలకుపోతమన్నరు."

"లియావ్‌షాంట్స్యా?" ఇది వింటే బ్రిగేడియర్‌కు ఇంకా ఆశ్చర్యం కలిగింది. అతనీ ప్రాంతానికి కొత్త. ఆ లియావ్‌షాంట్స్య ఎక్కడుందో అతనికి తెలియదు.

"మరి నువ్వెళ్ళావా వాళ్ళతో"

"నేనా? లే నేను బోతనా దొరా ఆళ్ళతో. ఆల్ల చేతుల్ల మన్నుబడ. చెంప మీద చెంపమీద కొట్టిన్రు. పోతా పోతా బందూకు ఉల్ట దిప్పి కాలిమీద పొడిసిన్రు. దాంతో నేను బేహోసయినా. తెలివొచ్చి కండ్లిప్పి సూసినా, ఆళ్ళ నామ్‌నిశానిగూడ కండ్లబడలే. దెబ్బ తాకిన జాగాల పెద్దగాయమై నెత్తురంతే నెత్తురు కారిపోనాదిదొరా! నా పెయిమీది నీరంతా నెత్తురుతో అట్టగట్టిపోనాది— అంతలో"

అప్పుడు లియాపెద్దమ్మను పట్టుకొన్న కంపెనీ కమాండరువచ్చి మట్టుపట్ల తనుచూచిన విషయాలన్నీ ఏకరువుపెట్టాడు. అవి లియాపెద్దమ్మకథకు సరిగ్గా అతికి నట్లున్నాయి.

బ్రిగేడియర్ తలఆడిస్తూ కొంతసేపు ఆలోచించాడు లియాపెద్దమ్మవైపుతిరిగి,

"హాంగ్ పెద్దమ్మా! ఆ బందిపోటోళ్ళు నిన్ను వాళ్ళతో లియాల్‌షాంట్స్యకు రమ్మన్నారా?"

"అవును...అవును దొరా! దయగల దొరలు మీరు నన్ను రచ్చించాల. మీ కాల్మొక్కుత దొరా! ఎట్లన్నజేసి నన్ను నా మనమళ్ళున్న ఊరికి పంపుండ్రిదొరా. మిమ్మల్నెప్పుడూ యాదిజేసుకుంటదొరా... దీపంబెట్టి నిన్నే తలుసుకుంటదొరా! అ పోచమ్మతల్లి మిమ్మల్ని సల్లగసూడాల...దొరా!" అని ఏడుస్తూ తల నేలకేసి కొట్టు కుంటూంది

"ఆఁ సరేసరే నువ్వుచెప్పింది వింటుంటే గుండెచెరువైపోతున్నది. మావాళ్ళను తోడిచ్చి నిన్ను హిసియాంగ్యన్‌కు పంపుతాలే" అని బ్రిగేడియర్ ధర్మపరిభువలె వాగ్దానం చేశాడు. అటూ ఇటూ నిలబడిన గార్డులవైపుచూశాడు. "స్టాఫ్ ఆఫీసర్ యాంగ్‌ని పిలుచుకురండి. వచ్చేటప్పుడు మిలిటరీ మ్యాప్‌లు తెమ్మనిచెప్పండి."

"అట్లాగేసార్!"

"ఓ దొరా! నన్ను దయజూడుండ్రి. ఇప్పుడేనన్ను మావూరికి పంపుండ్రి. నా మనమల్లనన్న జూసుకొని బతుకుతా!..."

"ఊఁ..."

ఇంతలో స్టాఫ్ ఆఫీసర్ యాంగ్ చేతిలో మ్యాపులకట్టతో అక్కడికి వచ్చాడు.

"బ్రిగేడ్ కమాండర్‌కు రిపోర్టుచేస్తున్నాను. సార్! మాపులు చూడాలనుకుంటున్నారా?"

"అవును. మ్యాప్‌లో లియావ్‌షాంట్స్యు ఎక్కడుందో చూడు."

స్టాఫ్ ఆఫీసరు యాంగ్ మ్యాప్‌ను పీఠంమీద పరిచాడు. ఆ ఊరు ఎక్కడుందో వెదకడానికి కమాండర్లూ గుమిగూడారు.

"హొంగ్ చింటుంగ్, లియూచీచెన్, కాన్‌హంచియావ్, లిట్‌సేవింగ్....."

"ఆ పేరుగల ఊరు ఈ మ్యాప్‌లో లేదుసార్."అని స్టాఫ్ ఆఫీసర్ యాంగ్ చెప్పాడు. "ఎక్కడా ఆ ఊరేలేదు."అన్నారు మిగిలినవాళ్ళు.

"లేదు పింగ్‌చియాంగ్ చుట్టుపక్కల అలాంటి ఊరేలేదుసార్!"

రెజిమెంటల్ కమాండర్లు ముగ్గురూ అలాగే అన్నారు. బ్రిగేడియర్ మ్యాప్ అంతా వెదికాడు. ఆ ఊరు ఎక్కడా కనిపించలేదు.

"హొంగ్ పెద్దమ్మా! మరి నీకు ఈ లియావ్ షాంట్స్యు ఎక్కడుందో తెలుసా? ఎప్పుడైనా వెళ్ళావా నువ్వు?"

"కొండల మద్దెనున్నదిదొరా! రెండు ఆమడలకు ఎక్కువేఉండొచ్చు. మాయప్ప నాయన ఆడినుండేవచ్చినురి దొరా. సాల ఏండ్లసంది అడ ఎవురూ ఉంటల్లేరుదొరా!..."

ఆ అయిదుగురూ మ్యాప్‌లో కొండప్రాంతాలన్నీ వెదుకుతున్నారు. కాని ఎంత వెదికినా ఆ ఊరు కనబడలేదు.

"హొంగ్ పెద్దమ్మా! మమ్మల్ని అక్కడకు తీసుకెళ్తావా నువ్వు?"

"నేను, నేనా—దొరా!...నా చేతగాదు దొరా..."

"ఏం పరవాలేదు పెద్దమ్మా మేమున్నాంగా, నీకేంభయంలేదు." అందరూ ఒక్కసారి హామీఇచ్చారు. "నువ్వుకొంచెం ముందెళ్ళుతూ మమ్మల్ని అక్కడకు తీసుకెళ్ళ మేము ఆ బందిపోట్లను పట్టుకుంటే నీకుకూడ పేరొస్తుంది. అప్పుడే నీ కొడుకుల్ని చంపినదానికి బదులు తీర్చగలవు! పని పూర్తయింతర్వాత నీకు మస్తు పైసలిచ్చి మీ ఊరు పంపుతాం."

"అట్లగంటే మల్లనాకు నడవరాదుగదా దొరా!...దయజూడుండిరి దొరా!..."

మా దగ్గర ఒక కుర్చీఉంది. దాన్లో కూచ్చోపెట్టి ఎత్తుకుని తీసుకుపోతాంనిన్ను నీకేం భయంలేదు హొంగ్‌పెద్దమ్మా–నీ కొడుకుల్ని చంపినోళ్ళను ముక్కలు ముక్కలు చేస్తాం. సరేనా"

"నేను- నేను నిజంగా..."

"రండి" బ్రిగేడియర్ గార్డుల వైపు తిరిగాడు. "హాంగ్ పెద్దమ్మను బయటికి తీసు కెళ్ళండి. ఆమె గాయానికి మంచి మందేసి కట్టుకట్టించండి. ఆమెకు మంచి భోజనం కూడ పెట్టించండి!"

3

స్కౌట్లు చెప్పిందాని ప్రకారం బందిపోట్లు తూర్పువైపుకు పారిపోయి ఉండొచ్చు కాని ఎంతదూరం వెళ్ళిఉంటారో ఎవరూ ఊహించలేకపోయారు. బ్రిగేడియర్ రెజిమెంటల్ కమాండర్లతోను, బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్ స్టాఫ్‌తోనూ ఈ విషయాన్ని తీవ్రంగా చర్చించాడు. అందరూ బందిపోట్ల వెంట పడడమే మంచిదన్నారు. హాంగ్ పెద్దమ్మ అబద్ధం చెప్పి ఉండదు. అలాంటి అమాయకపు ముసలామె, అందులోనూ బందిపోట్లు ఆమె కొడుకుల్ని చంపి ఆమె కాలిమీద గాయంకూడ చేశారు!

కనక వెంటపడి తరమాల్సిందే, వెంటదరమడానికే సర్వశక్తులూ కేంద్రీకరించాలి.

ఆ మధ్యాహ్నమే సైన్యమంతా బందిపోట్లను తరమాలని నిశ్చయించారు. మొత్తం బ్రిగేడ్‌ను ఐదు యూనిట్లుచేశారు. మెషిన్‌గన్ కంపెనీ అన్నిటికంటే ముందుంటుంది. మొదటి రెజిమెంట్‌ను రెండు భాగాలుచేసి రెండవ, మూడవ యూనిట్లన్నారు. అడ్వాన్స్‌డ్ పార్టీ అది. రెండవ రెజిమెంట్‌ను నాలుగవ యూనిట్‌గాచేశారు. మూడవ రెజిమెంట్‌ను, స్పెషల్ ఆర్మీని, బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్ ఆర్టిల్లరీ బెటాలియన్‌నూ ౫వ యూనిట్‌గా చేశారు.

లియూ పెద్దమ్మను ఒక కుర్చీలో కూర్చోబెట్టారు. ఇద్దరు బలిష్ఠులైన సైనికులు ఆమెను మోస్తూ ముందునడుస్తున్నారు. ఆ వెనక స్కౌట్లు, సైన్యం నడుస్తున్నారు. ఆమెలో ఉద్వేగం ఎక్కువైంది. గుండె దడదడలాడుతుంది. ఆమె ఏ విషయాన్నీ గురించీ ఆలోచించడంలేదు చివరికి తన ప్రాణాన్నిగురించికూడా. ఆమె గుండెల్లో ఒకటే మంట మండుతున్నది. తెలిసిన దేవుళ్ళందరికీ మొక్కుతూంది. తన పని సక్రమంగా పూర్తికావాలని ప్రార్థిస్తూంది. వెంటవస్తున్న సైన్యం వరసను చూడాలని ఆమె వెనక్కు తిరిగింది.* ఎంతచూచినా పాములాగఉన్న ఆ వరస చివరెక్కడో కనిపించడం

---

4 కంపెనీలు 1 బెటాలియన్

4 బెటాలియన్లు 1 రెజిమెంట్

4 రెజిమెంట్లు 1 బ్రిగేడ్.

(ఒక కంపెనీలో ౬ గురుకు మించి సైనికులుంటారు)

లేదు. తనకు బాగాతెలిసిన ఒకదారికి తిరగమని తనను మోస్తున్నవాళ్ళను ఆజ్ఞాపించింది. ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగా ఉండి స్మశానంలాగ కనిపించింది. కనుచూపు మేరలో ఒక మనిషిగాని ఒక జంతువుగాని ఉన్న జాడేలేదు. గాలి అంతకన్నా లేదు. ఆకుకూడ అల్లాడటంలేదు. అది చూస్తుంటే చెట్లుకూడ విచారపడుతున్నట్లు, రేపటికి మేము బతికిఉంటామా అని అనుకుంటున్నట్టుంది.

ప్రతిసారీ ఆ సైనికులవరస ఇరుకుదారులగుండా కొండలలోపలికి పోతూంటే లియూపెద్దమ్మ గుండె అతివేగంగా కొట్టుకొంటూంది. అది చికాకువలనగాని, దుఃఖం వలనగాని, సంతోషంతోగాని, భయాందోళనలతోగాని కాదు అది ఒకవింత అనుభూతి కళ్ళనుండి నీరుకారుతూనేఉంది. మరికొన్ని ఇరుకుదార్లుదాటి కొండల లోలోపలికి పోతూన్నకొద్దీ లియూపెద్దమ్మ గుండెబరువు తగ్గుతూంది.

ఎన్నడూలేనంతగా ఆకాశం మేఘాలతో నిండిపోయింది. అప్పటికి 13 మైళ్ళు వచ్చి ఉంటామని సొల్జర్లుచెప్పారు. అప్పుడప్పుడే సూర్యుడస్తమిస్తున్నాడు. అంతం లేని కొండలు వాళ్ళచుట్టూఉన్నాయి. రోడ్డుకూడ కనుమరుగైపోయింది. ఇంకొక కొండ దాటింతర్వాత కొంత ఖాళీస్థలం కనిపించింది. ఆ తర్వాత అడ్డంగా కొండల వరస కనిపించింది. నెమ్మదిగా వాళ్ళు ముందుకుసాగుతున్నారు. రెండు మూడు కొండలు దాటితే లియూచీచెన్ గ్రామంవస్తుందని ఆలోచించినకొద్దీ ఆమెకు ఆందోళన తగ్గిపోతూంది.

"అఁ ఇప్పుడేమీ తకిలీఫుండదు ఈ సైతాన్లను కొండలనడమకుదెచ్చినా." తన కొడుకులు గుర్తొచ్చేటప్పటికి ఆమెకు ఏడుపు ఒక్కసారి ముంచుకొచ్చింది. "నా కొడుకులు" అనుకుంది. తన కొడుకుల్ని ఈ విధంగా కోరింది.

"నాయనా! ఈ సైతాన్లమీద బదలా తీసుకొనేటందుకు మీ దోస్తులకు సాయపడుండ్రి...మీ ఖూన్‌కి బదులు ఖూన్! నేను-నేను జరసేపట్ల మీ తానికే వస్తకొడకా! మీ తానికే వస్త!..."

ఆమె కన్నీళ్ళు ధారగా కారుతూనే వున్నాయి.

"ఇంక ఒక్క కొండ దాటినమా. లియావ్‌షాంట్స్య ఊరు కండ్లబడతది." వాళ్ళు చూస్తారేమోనని కళ్ళనీళ్ళు ఆదరాబాదరా తుడుచుకొని లియూపెద్దమ్మ సొల్జర్లతో అన్నది.

"అయితే లియావ్‌షాంట్స్య వచ్చేలోయలోనే ఉందా?" సందేహానివృత్తి కొరకు ఆమె నడిగారు.

"అఁ:..."

స్కౌట్లు ఆ కొండమీదికెక్కి బైనాక్యులర్స్‌లో చుట్టూ చూచారు. వెంటనే వాళ్ళల్లో ఒకరు అరిచారు. "ఆఁ నిజమే. పొరపాటేమీలేదు. అదిగో ఒక చిన్న ఊరు కనబడుతూంది. ఆ ఊరి బజారుల్లో ఎర్రతోరణాలు కట్టిఉన్నాయి.

"ఏమిటీ, తోరణాలా! ఏదీనన్ను చూడనీయి" అంటూ అక్కడికి చేరుకొన్నాడు మరొక స్కౌటు.

"ఆఁ కరెక్ట్, ఒకటి, రెండు, మూడు...వాంగ్ చే-షెంగ్! నువ్వు పరుగెత్తుకు పోయి కంపెనీ కమాండరుకుచెప్పు." అన్నాడు స్కౌటు.

వాళ్ళు చేరుకొనవలసిన చోటు కనిపించింది. ముందుపోతున్న మొదటియూనిట్ ఆగి, అడ్డంగా దూరంజరిగి సర్దుకుంది. చుట్టూ తిరిగి రెండవయూనిట్‌వాళ్ళతో చేరింది. అర్థచంద్రాకారంగా నిలబెట్టారు సైన్యాన్ని. ఈ రెండుయూనిట్లు మూడువైపులనుండీ కాలుస్తూ ఎర్రతోరణాలవైపు సాగుతున్నాయి.

"వెళ్ళు హాంగ్‌పెద్దమ్మా! ఇకనువ్వు ఉండొద్దు. ఇక్కడనుండి వెనక్కు వెళ్ళిపో."

ముసలామెను వెనక్కుపంపి కంపెనీ కమాండర్ మెషిన్‌గన్ కంపెనీని నడిపిస్తున్నాడు. శత్రువుమీద ఎటాక్ చేయడానికి ముందుకుపోతున్నారు.

లోయదాటింతర్వాతకూడ సాయం సమయపు సన్నని వెలుగులో ఆ ఊరిలోని బజారునీ, ఎర్రతోరణాలనుమాత్రమే చూడగలుగుతున్నారు. మూడువైపులనుండి మెషిన్‌గన్లు, రైఫిళ్ళు, మరతుపాకులూ ఆ గ్రామంమీదికి గుళ్ళవర్షం కురిపిస్తున్నాయి.

ఢన్ ఢన్ ఢన్. టట్ టట్ టట్...

అలా కాల్చుకుంటూ వాళ్ళు రెండుఫర్లాంగులు ముందుకుసాగారు. అంతలో మూడవ యూనిట్‌కూడ వాళ్ళతో కలిసింది. కాని ఆ గ్రామంలో చడీ చప్పుడూ లేదు. ఎదుటినుండి ఇంతవరకు ఒక్క తుపాకీగుండైనా పడలేదు.

"ఏదో పొరపాటు జరిగిఉండదుకదా!" అనుకున్నారు. కాల్పులు తమ యూనిట్లవే నని నిర్ధారణ చేసుకొనడానికి కాల్పులు ఆపమన్నాడు కంపెనీకమాండరు.

"ఛీ ఛీ. మనం శత్రువులలో చిక్కుకున్నాం. అతడు నిరాశతో దుఃఖంతో అరిచాడు. ఇంకా ముందుకుపోవడానికి తనపై అధికారి ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నాడు కంపెనీ కమాండర్. మూడువక్కలా కాల్పులు ఆపగానే అంతటా నిశ్శబ్దం ఆవరించింది.

"ఇదంతా ఏమై ఉంటుందసలు?"

అకస్మాత్తుగా ప్రతివాడూ ఆలోచనలోపడ్డాడు.

"బహూశా ఆ ఊరి బజారువెనక శత్రువులు పొంచిఉన్నారేమో మనకోసం" ఒకడు ధైర్యంచేసి అన్నాడు.

ఇంకొంచెం ముందుకుపోయిచూద్దాం. మనం ఒకళ్ళతో ఒకళ్ళంకలిసి ఉన్నంత వరకు పరవాలేదు. ఎటూ ఇంతదూరం వచ్చాంకదా" సలహాఇచ్చాడు ఇంకొకడు.

ఇది పై అధికారి అభిప్రాయం కనక సాధ్యమైనంతవరకు చప్పుడుచెయ్యకుండా ముందుకుసాగుతున్నారు. అప్పటికి చీకటి దట్టంగా వ్యాపించింది. కన్నుపొడుచుకున్నా కళ్ళముందున్న దేమిటో కనిపించడంలేదు.

అది లియూచీచెన్ గ్రామం!

ఎక్కడా శత్రువు జాడేలేదు! అలంకరంగా కొన్ని తోరణాలుమాత్రం కట్టి ఉన్నాయి. మనుషులుకాదుగదా ఆ స్మశానంలాంటి చోటులో ఒక పురుగుకూడ కనిపించలేదు! ఫ్లాష్ లైటుకాంతిలో దుకాణాలముందు కట్టబడిన బోర్డులమీద "లియూచీచెన్"అని స్పష్టంగా కనిపిస్తూంది.

"లియూచీచెన్నా? ఎందుకిలా జరిగింది? దీనినే లియూచ్‌షాంట్స్య అంటారేమో"

"ఛీ ఛీ సర్వనాశనమైపోయింది."

అందరూ అయోమయంలో పడిపోయారు. రెండవ మూడవ యూనిట్లుకూడ అక్కడికి చేరుకున్నాయి. ఆ ఇరుకులోయలో రెజిమెంటంతా గుమికూడింది. రెండు మైళ్ళలో మిగిలిన బ్రిగేడంతా ఉంది.

ఆ ప్రదేశమంతా గాఢాంధకారంలో మునిగిపోయింది.

"అంతా విడ్డూరంగా ఉందే!"అన్న ఉబ్బుముఖం రెజిమెంటల్ కమాండర్ ఏడవడానికి సిద్ధంగా ఉన్నట్లనిపించింది.

మనం శత్రువుటోనులో చిక్కుకున్నాం. ఇదంతా అదేచేసింది. ఆ ముసలి దెయ్యం కావాలనే ఈ వూరిపేరు తప్పుచెప్పింది. అది తప్పకుండా వాళ్ళల్లోచేరిందే!"

"మనమేంచెయ్యాలిప్పుడు? వెనక్కు తిరిగిపోవాలా ఇక్కడే బిగదీసుకుని కూర్చోవాలా?"

అంతలో ఒక్కసారి—

ధన్ - ఎదురుగాఉన్న కొండలలోనుండి ఒక తుపాకిగొట్టు వినిపించింది. ఆ ఉబ్బు ముఖం కమాండరు మొదలెట్టాడు.

"ఏమిటదీ?"

ఎవరైనా అతనికి జవాబుచెప్పేలోగా అన్నివైపులనుండి తుపాకిశాల్వులశబ్దంతో చెవులు గింగురుమంటున్నాయి.

ధన్ ధన్ ధన్ - పట్ - పట్ - ఫట్ - టట్ టట్ టట్!

"చెదిరిపొండి" ఆఫీసర్లు చేసేవేంలేక ఆజ్ఞాపించారు. స్క్వాడ్ లీడర్లు నిరాశగా ఆమాటనే వల్లించారు.

ప్రతి తుపాకిగొట్టం పొగలుకక్కుతుంది. ఆకాశమంతా నిండిపోయిన పొగ, మంటలు ఉజ్వలంగా వెలుగుతున్న తోకచుక్కలలాగ ఉన్నాయి.

4

బ్రిగేడియర్ కోపంతో ఊగిపోతున్నాడు. మరసటిరోజు మధ్యాహ్నంవరకు ఆగాడు. అప్పటికి మొత్తం మొదటి రెజిమెంట్‌లో ఒక్క కంపెనీ సైన్యంమాత్రం తిరిగొచ్చింది. మెలేసి మెలేసి ఉన్న అతని మీసాలు ఆకాశాన్ని చూస్తున్నాయి.

లియూ పెద్దమ్మను తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. గార్డులు ఆమెను ఈడ్చుకొచ్చి అతనిముందు కూలేశారు. రబ్బరుబంతిలాగా పైకీ, కిందికీ వంగుతూలేస్తూ శివమెత్తినవాడిలాగ చేతిలోని ఇనపకర్రని పైకిలేపాడు. అంతే! ఆక్షణంలో అతడు మనిషినని మర్చిపోయి మృగంగా మారిపోయాడు.

"చెప్పు, చెప్పవే ముసలిముండా! మమ్మల్నెందుకు ఇలా ధోకాచేశావు? ఇది లియూచీచెన్ అయితే లియూవ్‌షాంట్స్య అబద్ధం ఎందుకుచెప్పావే? చెప్పు, ఇప్పుడూ- నిన్ను ముక్కలు ముక్కలుచేసి కాకులకూ గద్దలకూవేస్తా, చెప్పవే. దరిద్రపు దెయ్యమా!..."

ఇనపకర్ర బలంగా ఆమెతలకు తాకింది. ఆమె శరీరంమీద దెబ్బల తుపాను వీస్తూనేఉంది. నిస్సహాయంగా ఆమె తెలివితప్పి పడిపోయేదాకా అది ఆగనేలేదు.

"అయితే నువ్వుచెప్పవన్నమాట! ఏమే ముసలిముండా!..." మళ్ళీ దెబ్బల జడివానకురుస్తున్నది. "పరుగెత్తుకుపోయి చన్నీళ్ళు తీసుకురండి. త్వరగా తెలివి తెప్పిద్దాం. దీని దరిద్రపు ముఖం...

చల్లనినీరు మీదపడడంతో లియూపెద్దమ్మ శరీరం కొంచెం అటూ ఇటూ కదిలింది. ఆమెకు కొంచెం కొంచెం స్పృహవస్తున్నది. కోటి నిప్పురవ్వలు మెరుస్తూ ఆమె కళ్ళముందు నాట్యంచేస్తున్నట్లున్నాయి. ఉరుముల్లాంటి అరుపులు ఆమె చెవులను బద్దలుకొట్టాయి.

"ఏమే మాట్లాడతావా ఇప్పుడు? మురుగు గుంటలోని పందీ? మమ్మల్నెందుకు ముంచావు ఇట్లా? ఆ బందిపోట్లు ఆడించినట్లల్లా ఎందుకాడాలే? లేకపోతే నీవుకూడా వాళ్ళల్లో చేరినదానివేనా? చెప్పు నీ..."

లియూపెద్దమ్మ రక్తంచిందే తనకళ్ళుతెరిచింది. కాని ఒక్క మాటకూడ ఆమె నోటినుండి రాలేదు. ఇప్పుడిప్పుడే ఆమెకు అంతా గుర్తొస్తూంది. ఆమెకు ఒక్కటే కోరిక. ఉన్నకొద్దిబలంతో శత్రువులవైపు దొర్లి అందులో ఒకడికాలిని పళ్ళతో కర వాలనిఉంది. కాని దెబ్బలతో చితికిపోయి మాంసంముద్దలాగ రక్తంకారుతున్న శరీరం ఆమెమాట వినలేదు. ఒక అంగుళంకూడ కదల్లేకపోయింది. ఆఖరు ప్రయత్నంగా ఆమె బిగ్గరగా అరుస్తూ ఇలా అంది.

"అరే! మీకు చెప్పాల్నా? మీరు... మీరు నెత్తురుతాగే పసువులురా. మీరు సస్తుంటే చూడలేమగందా అని బుగులుగుందిరా నాకు. నేను-నేను సచ్చేముందు ఎట్ల నన్న మీ కాలినిపట్టుకొని కసిదీర కరవాలనిఉందిరా. మీమీద మన్నుబడ! మీ పీనిగ లెల్ల! మీరు కటికోళ్ళుగాదురా? నా కొడుకుల్ని టుకడాలు టుకడాలుగా నరికింది. మా దేశం మందిని హాంగ్‌చింటుంగ్‌దగ్గర సంపిపడేసినోళ్ళు మీరుగాదురా! మీకుభూమ్మీద రోజులు నిండినయిరా. మాకున్న ప్రతికట్టెనీ పూచికపుల్లనీ దొంగిలించింది, తగల బెట్టింది మీరేగదరా. మీరు ఒక్కసారిగాదూ నూరుమాట్లు వచ్చిన్రు. వచ్చినప్పుడల్లా ఎటుజూచినా చావు- చావు...అంతా సత్తెనాశ్‌జేసిన్రు. మీరు యాడ అడుగుబెట్టినోర్రి ఆడనల్లా ఇండ్లు, గుడిసెలు బూడిదకుప్పజేసిన్రుగదరా? మీరు బతికుండగనే మీ తోడ కలు వొలవాల్నని ఎంతగనో అనుకున్న...కాని నా చేతనైతలేదు... నాకాలిమీద నేనే గాయంచేసుకున్న, ఇంతన పికరులేదునాకు. అందుకే నేను, నేను–"

లియూపెద్దమ్మ ఉన్న శక్తినంతా కూడదీసుకొని నేలమీదదొర్లి తనను పట్టు కొన్న రాక్షసుని కాలిమీద ఒక్కగుద్దు గుద్దింది.

బ్రిగేడియర్ దెబ్బతిన్న కుక్కపిల్లలా అరిచాడు. ఒక్కసారి భయంతోను, కోపంతోను ఫిట్‌వచ్చినంతపనయింది. "ఓహ్! నీవు దరిద్రపుముండా! నిన్నిప్పుడే యమధర్మరాజు దగ్గరకు పంపుతా, అయితే నువ్వు శత్రువుల సి. ఐ. డివా? అవునా?.. ఓహ్ – !" అని వెంటనే తనపిస్టల్‌తీసి ఇష్టమొచ్చినట్లు లియూపెద్దమ్మ శరీరంలోకి దారుణంగా గుళ్ళు బొప్పించాడు.

ధన్:

ఎవరో కుదిపినట్లుగా లియూపెద్దమ్మ ఒక్కసారి ఎగిరిపడింది. అంతే, మరు క్షణంలో ఆమె నేలకొరిగింది. ఆమె జీవంలేని పగిలి, ఉబ్బిన పెదవులమీద చిరునవ్వు అలాగే నిలిచిపోయింది.

... ...

వెనకనుండి రెండుచేతుల్లో రెండు రివాల్వర్లతో ఒక శత్రుసైనికుడు దూసుకొచ్చాడు.

"బ్రిగేడ్ కమాండర్ సార్! మొదటి రెజిమెంటు కమాండరు వాంగ్ బహుశా గతరాత్రి శత్రువులకు చిక్కి ఉండవచ్చు. రెండవ మూడవ రెజిమెంట్లు రెండూ ఇంకెంతోసేపు శత్రువును ఎదిరించలేవు. దయచేసి వెంటనే వెనక్కి తిరగమని ఆజ్ఞ ఇస్తే మంచిది!"

"వెనక్కి తిరగడమా!?" ఆ మాట మంచు ప్రవాహంలాగ వచ్చింది. బ్రిగేడియర్ అందులో మునిగి పోతున్నట్టున్నాడు.

"దేవుడు మన మొర ఆలకించలేదు. ఎందుకనో! ఈసారి... ఈసారి... దురదృష్ట దేవత నెత్తిమీద కూర్చొంది. అందుకనే ఇలా...

ఏడు అగ్నికణాలు

చైనీస్ మూలం: యువాన్ చీన్

స్వేచ్ఛానువాదం: చలసాని ప్రసాదరావు

తలెత్తి చూసేను. వర్షం పూర్తిగా ఆగిపోయి అప్పుడే సూర్యోదయ మవుతున్నది. ఎన్నిరోజులయిందీ సూర్యుణ్ణి చూసి! కొద్ది క్షణాల క్రితం వరకూ ఈ పరిసరాలెంత బీభత్సంగా ఉన్నాయో యిప్పుడంత ప్రశాంతంగా ఉంది.

కొన్ని గంటల క్రితం వాతావరణం యిలా లేదు. ఆకాశంలో పూర్ణచంద్రుడు ప్రకాశవంతంగా వెలిగిపోతూ ఈ చిత్తడినేలల్లో ఏ బురదగుంటలోనూ పడిపోకుండా నాకు దారిచూపుతూ ఉన్నాడు. తెల్లారేసరికి మా దళం చివర్ని అందుకోగలననుకున్నాను.

మా లాంగ్‌మార్చ్ పశ్చిమ చైనాలోని నిర్జనమైన బురదనేలలగుండా సాగిపోతూన్నది. కాలికి తగిలిన గాయం మూలంగా నేను దళాన్ని వదలి వెనుకబడిపోయేను. నెమ్మదిగా నడుస్తూ రెండు రోజుల ఆలస్యంగా రానున్న మజిలీలో దళాన్ని కలుసుకోగలననుకున్నాను. న్యాయంగా ఈ సరికి నేను దళంలో కలిసిపోయి ఉండవలసిందే. కానీ...

కొద్ది గంటలక్రితం ప్రశాంతంగాఉన్న వాతావరణాన్ని భగ్నంచేస్తూ ఓ వాయు కెరటం తుఫానుకన్నా వేగంగా ఈ చిత్తడినేలలమీదుగా దూసుకుపోయింది. ఆవెంటనే భూమిలోంచి పుట్టుకువచ్చినట్లుగా పెద్ద పెద్ద మేఘాలొచ్చి చంద్రుడినీ, ఆకాశాన్నీ

కమ్మివేశాయి. ఉరుములు-మెరుపులతో కుంభవృష్టి ఆరంభమయింది. అడపాదడపా నిమ్మకాయలంతేసి వడగళ్లు ఊడిపడసాగాయ్.

అసలే బురదనేల. అందునా చలికాలం. పైగా వడగళ్ళవర్షంతోపాటు చలి గాడ్పులు. కాలికి తగిలిన గాయంతో సగం నీరసించి ఉన్న నేనీ దెబ్బతో పూర్తిగా చతికిలబడిపోయేను. వంటినఉన్న బట్టల కన్నా వళ్ళే ఎక్కువగా తడిసి ముద్దయిపోయినట్లుంది. బురదనేలలో అడుగుతీసి అడుగు వేయటమే కష్టమయిపోతున్నది. దానికి తోడు చలి...చలి... ఎముకల్ని విరగ్గొట్టే భయంకరమైన చలి.

మంచుతెరలు కొద్ది కొద్దిగా విచ్చిపోతూ ఉన్నాయ్. బురదనేలల్లో దాదాపు నిలువెత్తునా పెరిగిన అడవిగడ్డి తుఫాను దెబ్బకూ, వర్షపు బరువుకూ నేలవాలిపోయింది. బ్రహ్మాండమైన దువ్వెనతో సున్నగా దువ్వినట్లుగా నేలకు అంటుకుపోయింది. నేలంతా బంగారు తివాచీ పరిచినట్లుంది తప్ప దారెక్కడా కనుపించటమేలేదు. అడపాదడపా ఆ గడ్డిమీద వడగళ్లుపడి తివాచీ మీద తాపిన రత్నాల్లా మెరుస్తూ కరిగిపోతూన్నయ్.

కాలిలో గాయం సలుపుతోంది. ఈ చలిలో శ్వాస పీల్చటమే కష్టమయిపోతున్నది. దుస్తులేగాదు శరీరంలో అణువణువూ తడిసీ ముద్దయిపోయినట్లుంది. ఇప్పుడే గనుక కాస్త చలిమంట లేసుకోగలిగితే...! ఓ గుక్కెడు వేడినీళ్లు తాగ గలిగితే...! ఓహ్ !

కానీ, ఇదో కల. అబ్బే! ఉత్త పగటికల! మూడు దినాలక్రితం దళంతో కలసి ప్రయాణిస్తూన్నపుడే అందుకు గతిలేకపోయింది. ఆనాడు దళసభ్యులంతా వచ్చి గోధుమపిండినే రొట్టెలనుకుంటూ ముద్దలుచేసుకు తినాల్సొచ్చింది. దళానికి అది తప్ప మరేం మిగల్లేదు. రేషన్లన్నీ చాలా రోజులక్రిందటే నిండుకున్నాయ్. రొట్టెలు చేసుకుని వట్టివే తిందామనుకున్నా ఆ పరిసరాలన్నీ నిర్జనం. ఎక్కడా నిప్పు దొరకదు. మా దళానికి మొత్తంమీద ఆఖరి అగ్గిపుల్లకూడా ఖర్చయిపోయింది.

అనాలోచితంగానే జేబులు తడుముకున్నాను. పాంటుజేబులో ఏదో మెత్తగా తగిలింది. ఆశ్చర్యం! తడిసి ముద్దయి మూలల్లో పేరుకున్న బార్లీపిండి అది. అంతా గీకి పోగుజేస్తే కోడిగుడ్డంత అయింది

అద్భుతం...! ఆశించని ఆహారం ఇది...! ఈ రోజుకిది చాలు...! సత్తువ తెచ్చుకునేందుకిప్పటి కీమాత్రం చాలు. దళాన్ని చేరుకునేదాకా నన్నిది నిలబెట్టగలదు.

నిన్ననే యిది నాదృష్టిలోకి రాకపోవటం మంచిదే అయింది. నిన్నల్లా ఏమీ తిననే లేదు. నిన్నేగాదు, దాదాపు అరవైనాలుగ్గంటలుగా ఖాళీకడుపుతోనే ఉన్నానేమో

ఆకలి దహించుకు పోతూన్నది. కాలు బాధతో గుంజుకుపోతున్నది. ఇలాంటి సమయంలో యీమాత్రం ఆహారం...! ఓహ్!... నేనెంత అదృష్టవంతుడిని...!

బార్లీ ముద్దను సాగదీశాను. గుండ్రంగా చేశాను. మరలాసాగదీశాను. ఇలా నాలుగయిదుసార్లు చేసి దాన్ని నోట్లో పెట్టుకోబోతున్నాను. ఉలిక్కిపడ్డాను.

"కామ్రేడ్...!"

ఎటునుండో వినవచ్చిందా క్షీణస్వరం. బలహీనంగాఉందాపిలుపు. భూమిలోంచి చీల్చుకు వస్తున్నదా అన్నట్లుందా గొంతుక. క్షణకాలం సంభ్రమాశ్చర్యాలతో తబ్బిబ్బయిపోయేను. మరుక్షణం ఆ పిలుపు వచ్చినదిశగా కుంటుతూనే పరుగెత్తేను.

దగ్గర్లోనే రెండు గుట్టలమధ్యగాఉందో చిన్నచెట్టు. దాని మొదలుకు జారగిలబడి కూర్చున్నదీ, పడుకున్నదీ తెలీనిస్థితిలో ఉన్నాడో మనిషి. అతని తొడలూ, కాళ్ళూ పూర్తిగా బురదనేలలో మునిగిపోయున్నాయి. అతను భయంకరంగా పాలిపోయున్నాడు. చూడగా చూడగా అతనలా చాలా సేపట్నుంచీ కదలలేనిస్థితిలో పడివున్నట్లున్నాడు. నాలాగే దళానికి వెనుకబడిపోయిన కామ్రేడ్‌లా ఉన్నాడు. వర్షానికి చెదరిన అతని తల వెంట్రుకలు నుదుటిమీద అట్టగట్టుకుపోయాయ్. గుంటలుపడిన కళ్లు బలంగా మూసుకుపోయున్నాయ్! ఎండి పగుళ్ళుపడున్న అతని పెదాలు కొద్దిగా విచ్చుకుంటూన్నాయ్! నిస్సందేహంగా అతను రెడార్మీకి చెందినవాడే.

"కామ్రేడ్...! కామ్రేడ్...!"

దగ్గరయిన నా పాదాలధ్వనికి కాబోల్ను విశ్వప్రియత్నంమీద అతను కళ్ళు కొద్దిగా తెరిచేడు. లేచి కూర్చోవాలని విఫలయత్నంచేశేడు.

అతని స్థితికి ద్రవించిపోయేను. కళ్ళు చెమ్మగిల్లేయి. దళాన్ని వదలి వెనుకబడిపోయాక ఈ మూడు రోజుల్లోనూ నాకిలాంటిస్థితిలో ఎదురయినవారిలో ఈ కామ్రేడ్ మూడోవాడు. ఆ ఇద్దరూ నాకంటపడటానికి ముందే మరణించి ఉన్నారు.

అతన్ని కొద్దిగా లేపి చేయూతతో నా ఒడిలో కూర్చోబెట్టేను. ఆహారంలేక కొనఊపిరితో మిగిలినట్లున్నాడు. శరీరమంతా మంచుముక్కలా బిగుసుకుపోయున్నది. పళ్ళు బలంగా కరుచుకునున్నాయి. వెంటనే జేబులోంచి బార్లీముద్ద తీసి అతని పగిలిన పెదాలవద్ద ఉంచేను.

"తిను...! కామ్రేడ్... తిను...!"

జీవం కోల్పోతూన్న కళ్ళతో అతను దీనంగా, సంభ్రమంగా నా కళ్ళలోకి చూసేడు. అతిప్రయత్నంమీద పళ్ళబిగువున అన్నాడు.

"వద్దు కామ్రేడ్! నేనిక బతకను! నాకోసం ఆహారం వృథాచేయొద్దు!"

ఆ మాటలెంత బలహీనంగా వెలువడినాయో అంత బలంగా నా గుండెల్ని తొలిచివేశాయ్! క్షణకాలం అచేతనంగా స్థంభించిపోయేను. ఎత్తిన చెయ్యి అలాగే ఆగిపోయింది. అతని ముఖం క్రమంగా నీలంరంగులోకి మారిపోతున్నది.

ఈ క్షణంలో ఓ చిన్న చలిమంటవేసుకోగలిగితే...! ఓ కప్పుడు వేడినీళ్లు యీ కామ్రేడ్‌కు యివ్వగలిగితే...!

ఓహ్! ఎంత బాగుండును. ఈ కామ్రేడ్ తప్పక కోలుకుంటాడు. బ్రదికితీరుతాడు. కానీ... ఎలా? ఎలా? కనుచూపుమేరదాకా నలుదిశలా తడి...తడి...నిర్జనం. బురద...బురద...!

మరేం ఆలోచించకుండా లేచి అతని భుజాలుపట్టుకుని లేవదీయబోయేను. "లే! కామ్రేడ్! దగ్గర్లోనే మా దళం మజిలీచేసి వుంటుంది. నిన్ను నడిపిస్తాను. లే, కామ్రేడ్!"

అతని కళ్లు మూతలుపడ్డాయ్! అనంగీకారంగా తల ఆడించేడు. శక్తిని కూడదీసుకుంటున్నవాడిలా కొంచెం ఆగి కళ్ళు తెరిచేడు. ఎడమచెయ్యెత్తి కుడిచంకలోకి చూపుతూ బలహీనంగా గొణిగేడు. "ఇక్కడ...ఇక్కడ..."

అక్కడ గాయం తగిలిందేమోనని అతని షర్టు కిందికి తప్పించేను. అతనిషర్టే కాదు, బాడీకూడా అంతే చల్లగా మంచుముద్దలావుంది. చంకలో తడి తగలకుండా దాచిన ఓ చిన్న గుడ్డసంచీ కనుపించింది. అది తీసి అతని చేతుల్లో వుంచేను.

వణికేచేతుల్తో అతనాసంచీలోంచి కాగితప్పొట్లం ఒకటి తీసేడు. ఆ పొట్లంలోంచి అతని కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వపు పుస్తకం తీసేడు. దాని పేజీలమధ్య కొన్ని అగ్గిపుల్లలు భద్రిపరచి ఉన్నాయ్. ఆ పేజీలో పార్టీ ముద్ర ఊదారంగులో స్టాంపుచేసి వుంది. ఆ ఊదారంగుమీద అగ్గిపుల్ల ఎర్రని మందుగల భాగాలు అగ్నికణాల్లా మెరిసిపోతూఉన్నాయ్!

"చూడు కామ్రేడ్!" అతను నన్ను మరింత దగ్గరకా రమ్మని సంజ్ఞచేసేడు. కొంకర్లుపోయిన వేళ్ళతో అతనా పుల్లల్ని లెక్కించసాగేడు. "ఒకటి... రెండు... మూడు... నాలుగు..." మొత్తం ఏడు అగ్గిపుల్లలున్నాయ్. నా కళ్ళకవి ఏడుజ్వాలల్లా మెరిసిపోతూ ఉన్నాయ్. వాటిని పూర్తిగా లెక్కబెట్టేందుకతనికి చాలాసేపు పట్టింది. లెక్కించటం అవగానే వాటిని పుస్తకంలోసర్ది పేపర్లుచుట్టి సంచిలో భద్రపరిచేడు.

ప్రశ్నార్థకంగా నాకళ్లలోకిచూస్తూ అడిగాడు. "అర్థమయిందా కామ్రేడ్...?"

నేను తలాడించేను. ఈ వాతావరణంలో దీనినర్థంచేసుకోవటం ఏమంత కష్టం కాదు. నా ఊహలో ఓ ఉజ్వలదృశ్యం మెరుపులా మెరిసింది. మేం చలిమంట వేసుకోబోతున్నాం. ఈ కామ్రేడ్ నా ఒడిలో పడుకుని చలికాటునుండి కోలుకోబోతున్నాడు. ఇద్దరం కావలసినన్ని కప్పుల వేడినీళ్ళు తాగబోతున్నాం.

ఆ కామ్రేడ్ నాచేతుల్ని గుండెలమీదికి తీసుకుని వాటిలో ఆ సంచీఉంచి "ఇది చాలా అమూల్యమైనది సుమా" అన్నట్లుగా నా గుప్పిళ్ళుమూసి గట్టిగా పట్టుకున్నాడు. చూపునంతా నామీదకే కేంద్రీకరించి బలవంతాన నోరు తెరిచేడు. "గుర్తుంచుకో కామ్రేడ్। ఇవి... ఇవి... మనందరివీ... మన కామ్రేడ్స్ అందరివీనూ." బలహీనంగా గొణిగేడతను. ఉన్నట్లుండి చేతులుపడిలేసి ఓ గాఢవిశ్వాసం వదిలేడు. శక్తినంతా కూడదీసుకొని చేయెత్తి నా మోకాలిమీద ఆనించి చూపుడువేలితో ఉత్తరదిశగా చూపించేడు.

"మంచిది, కామ్రేడ్...మంచిది... వీటిని త్వరగా మనవారికి అందజెయ్... త్వరగా అందజెయ్।"

ఆ మాటలంతటితో ఆగిపోయేయ్। అతనితల వాలిపోయింది. కళ్లు బిగుసుకుపోయాయ్. అతను అంతిమశ్వాస వదలివేశేడు.

నేను ఒంటరిగాణ్ణయిపోయేను. కళ్ళకు మసకలుకమ్మినట్లయింది. అనంతంగా విస్తరించుకునున్న బురదనేల. దానిమీది తివాచీలాగడ్డి। అక్కడక్కడా వజ్రాల్లా జ్వలిస్తూన్న మంచుముక్కలు. పైన నీలాకాశం. క్రింద నా ఒడిలో నీలంరంగులోకి మారిపోయిన నా కామ్రేడ్... అన్నీ ఆ మసకలో ఒక్కటిగా కలగలిసిపోయేయి.

నా మోకాలి ఊతంతో నిలచిన ఆ కామ్రేడ్ చేయి ఒక్కటే... మార్గనిర్దేశం చేస్తూన్నట్లుగా ఉన్న ఆ చేయి ఒక్కటే... లాంగ్‌మార్చ్ సాగిపోయినదిశగా చూపుడువేలిని సారించిన ఆ చేయి ఒక్కటే... నా కంటికి అనుతున్నది.

ఆ కామ్రేడ్ అందించిన ఉత్సాహంతో అనుకోనివేగాన్ని పుంజుకుని ఆ సాయంత్రం చీకటిపడేవేళకు మా దళం వెనుకభాగానికి చేరుకోగలిగేను.

మరికొద్దిక్షణాల్లో చీకట్లను చీల్చుకుంటూ ఓ పెద్ద మంటలేచింది. కొద్దిరోజులుగా వానల్లోతడుస్తూ, బురదలో నానుతూ, చలిగాడ్పులకు కోసుకుపోతూ భారంగా పయనిస్తూవచ్చిన మా దళయోధులంతా నవ్వుతూ, తుళ్ళుతూ ఆ అగ్నివలయంచుట్టూ పోగైకొత్తజీవం పోసుకోసాగేరు. తడిబట్టలు ఆరుతూన్నయ్. బిగిసిన శరీరాలు వెచ్చబడుతూన్నయ్। అదవిదుంపలు ఉడకసాగేయ్। ఉత్సాహంతో అందరూ వెలిగిఉన్నారు.

నేను మా దళనాయకునివద్దకువెళ్ళి రిపోర్ట్ ఇచ్చేను: జేబులోంచి ఆ కామ్రేడ్ ఇచ్చిన సంచీతీసి అందించేను. దూరాన మండుతూన్న నెగళ్ళనుండి వచ్చే కాంతికెర టాలా పాకెట్‌పై నృత్యంచేస్తూ ఉన్నాయ్.

సంగతంతావిని దళకమాండర్ సంచీలోంచి పాకెట్‌తీసి అందులోంచి పుస్తకం తీసేడు. విషాదం అలుముకున్నవదనంతో, కంపిస్తున్నచేతుల్తో ఆతనాపుస్తకంలోని అగ్గిపుల్లల్ని లెక్కించసాగేడు.

"ఒకటి...రెండు...మూడు...నాలుగు...అయిదు...ఆరు..."

ఆ ఆరు అగ్గిపుల్లలకూ ఉన్న ఎర్రని మందుగోలీలు నృత్యంచేస్తున్నట్లున్న ఆ వెలుగు రేఖల్లో ఆరు అగ్నికణాల్లా మెరిసిపోతూ ఉన్నాయ్!

ప్రభుత్వ దమననీతిని ఖండించండి

గుజరాత్, బీహార్ తదితర ప్రాంతాల్లో దేశమంతటా ఆకలిగొన్న ప్రజలు సరసమైన ధరలకు ఆహారపదార్థాలు అడుగుతుంటే పాశవికంగా కాల్పులు జరుపు తున్న పోలీసు చర్యల్ని మేం ఖండిస్తున్నం. ఆకలి సమస్యను కాల్పులు ఎన్నడూ తీర్చలేదు, తీర్చలేవు. పోలీసులు ఎక్కుబెట్టిన తుపాకులను కూడ లెక్కచేయ కుండా ప్రజలు తమ మనుగడకోసం పోరాడాల్సిన భౌతిక పరిస్థితులను సిగ్గులేని యీ పాలకవర్గాలే సృష్టించినయ్. ఇందిరాగాంధిగారు ఆశపెట్టిన హిమాలయా లంత వాగ్దానాలు. ఆచరణలో దగాకోర్ మాటలుగా మాత్రమే రుజువయ్యాయి. తెలిసితెలిసీ తప్పుడు వాగ్దానాలుచేసి. ప్రజలమీద పాశవిక దమనకాండను అమలు చేస్తున్నందుకు యీ పాలకవర్గాలను దండించే హక్కు భారత ప్రజలకుండితీరుతుంది.

'దేశంలోని ప్రజాస్వామిక శక్తులను, పాలకవర్గాల హింసకు వ్యతిరేకంగా తమ కంఠాలు విప్పి ప్రజల న్యాయమైన పోరాటాలను బలపరచవలసిందిగా కోరు తున్నం.' అని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి వెంకటేశ్వర్లుగారు ప్రకటిస్తున్నరు.

విరసం సభ్యుడు, ప్రభంజనం సంపాదకుడు డాక్టర్ ఎం. వి. రమణారెడ్డిగారి అరెస్టును ఖండిస్తూ, వెంటనే విడుదల చేయాలని డిమాండుచేస్తూ కృష్ణాజిల్లా విరసం యూనిట్, రాజు స్మారక ప్రగతిశీలక గ్రంధాలయం, బొబ్బిలి, ప్రగతిశీల యువజన సంఘం, మాధవరం (కలాన్)ల నుంచి మా కార్యాలయానికి ప్రకటనలందాయి.

కొత్తగొంతులు:

జనసేన పిలిచిందిరా

డాక్టర్ కాటా నారాయణరావు

జనసేన పిలిచిందిరా!
ఎర్ర
ప్రజసేన పిలిచిందిరా!

కర్రా సిర్రా కత్తా సుత్తా
కాడా మేడా చేతబట్టి
కదనానికి రమ్మందిరా
ఎర్ర
జనసేన పిలిచిందిరా! ॥జన॥

రాకాసుల పాలనలో...
రాబందుల రాజ్యంలో... ॥రాకాసుల॥
లేదున్యాయమీజగతి
లేదుమనకు భూవసతి ॥లేదున్యాయ॥
లేదులేదు కూడుగుడ్డ
ఉండుటకైనా గూడు
గూడుగుడ్డ సాధించగ
జబ్బచరచి సాగుమని ॥జనసేన॥

కూలన్నలు, రైతన్నలు
హమాలీలు, గుమస్తాలు
విద్యార్థులు, మేధావులు
అధోజగత్సహోదరులు
అరుణపతాకం చేగొని
బందూకులు పేలిస్తే
ఆకలి అవమానాలు
అన్నీ విడిపోవునని ॥జనసేన॥

ఈగడ్డనె పుట్టామోయ్...
ఈగడ్డనె పెరిగామోయ్ ॥ఈగడ్డనె॥
ఈగడ్డనె మననెత్తురు
ఘర్మజలం రాల్చామోయ్...

అవమానాలను సహించి
అన్నార్తులమై కృషించి
॥అవమానాలను॥
కటికగంజికైనగాని
మొగంవాచి వున్నామోయ్...
బానిసత్వమెన్నాళ్ళని
ఈ సహనమ్మింకేలని ॥బానిసత్వ॥
బంధనాలు తెంచమని
భూమిభుక్తి పంచమని ॥జనసేన॥

నక్సల్బరి రైతాంగం
వినిచెను విప్లవనినదం ॥నక్సల్బరి॥
శ్రీకాకుళ గిరిజనుడు
బాణంలా దూసినాడు
గురిమెళ్ళ అడవులలో
గురిచూసికొట్టె తెలంగాణ
వియత్నాం గెరిల్లాల
శౌర్యానికి వారసులై
మాసియాంగు ప్రజాయుద్ధ
మహాయుద్ధం చేగొనమని ॥జనసేన॥

ప్రజాసైన్యమెదిరిస్తే
ఎవడు నిలువలేడు నిజం... ॥నిజం॥
॥ప్రజా॥

రాజ్యాంగం జైలుగోడ
దుర్మార్గుల ధర్మశాల ॥రాజ్యాంగం॥
శానాలను కూల్చగలం
దొరలను తునుమాడగలం
సమసమాజ నిర్మాణం
సాగించగ లేలెమ్మని
ప్రజారాజ్య స్థాపనకై
ప్రతిజ్ఞ యిపుడే పూనమని ॥జనసేన॥

గన్ మెన్ కవితలు :

విప్లవ వీరులు

మీరు యే యుద్ధభూమిలోని
క్షతగాత్రులు
మీరు యే సమరంలో పోరాడిన
సైనికులు
మీరు యే కార్మికులకు
పోరాట బంధువులు
మీరు యే రైతుకూలీలకు
చైతన్యం నూరిపోసిన సహచరులు
మీరు యే పీడిత తాడితులకు
వర్గకసినేర్పిన విప్లవ వీరులు
మీరు యే గిరిజనులకు
నారి సంధింపనేర్పిన శ్రామిక నేతలు.

లాల్ సలామ్

ఈ చీకటి వ్యవస్థలో
ఎర్రలాంతర్లు ముట్టించిన
ముట్టిస్తున్న కామ్రేడ్స్
లాల్ సలామ్ లాల్ సలామ్

కొండల్లో కోనల్లో
బండలపై జీవించి
ప్రజలకు అధికారం
రావాలని పోరుతున్న
గిరిజన వీరులారా
లాల్ సలామ్ లాల్ సలామ్

భూస్వామ్య దళారీల
దాస్యం భరియింపమని
కార్మికుడు కర్షకుడు
సుఖపడాలని కోరి
రణరంగంలో దూకిన
రైతుకూలీ
లాల్ సలామ్ లాల్ సలామ్

రాబందుల రాజ్యంలో
పొద్మాపు పన్నేసిన
పూటగడవదని
గొంతు తడువదని
పోరాటంద్వారానే
హక్కులు సాధించుటకై
అజ్ఞాతం పాలైన
అన్నలార
లాల్ సలామ్ లాల్ సలామ్

పోరు పాట

నమ్మి

పోరోపోరో — పోరోపోరో
గొడ్డళ్ళను — సంకబెట్టి
కొడవళ్ళను — సంకబెట్టి
పోరోపోరో — పోరోపోరో

పొరుగూరిలోనంట
కూలీ పోరాగాడొకడు
కూలెక్కువ చెయ్యమంటే
కాళ్ళిరగా గొట్టిండంట
పోరో — పోరో
తప్పెవరిదో తెల్సుకోరా

పక్కూరిలోనంట
పాలేరు పాలడుగుతే
పారతోనే సంపిండంట
పల్లజీరె పాతిండంట
పోరో — పోరో
నాయమేందో తెల్సుకోరా

ఊరిపక్క చేనుకాడ
కూలిచేసే నీలమ్మను
కూలిస్తానని రమ్మని
ఎలుగుపూటే గుంజిండట
మొత్తుకుంటే శెరిసిండట
పోరో — పోరో
నీతెక్కడో తెల్సుకోరా

కూలడుగుతే కొడ్తాడా ?
పాలడుగుతే చంప్తాడా ?
కూలిస్తా రమ్మని నీ
చెల్లెల్నే చెరుస్తాడా ?
పోరో పోరో
గొడ్డళ్ళను సంకబెట్టి

పోరో పోరో
కొడవళ్ళను సంకబట్టి

వారిశేలన్నీ పెంచీ
గరిశేలన్నీ నింపితే
బరితాతల నిలబెట్టీ
బరిగెలతో కొడ్తాడా ?
పోరో—పోరో—నీవోళ్ళను కల్సుకోరా

బంగ్లాలను కట్టిచ్చీ
దొరతనాల కట్టిస్తే
దురమారగం చేస్తాడా ?
దూదిలెక్క ఏకుతాడా ?
పోరో — పోరో
నీవోళ్ళను కూడగట్రా

నువ్ చేసిన పాపమేంది ?
నీ వోళ్ళకు సిచ్చెందుకు ?
ఒక్కశారి తల్సుకోరా
ఎవరితప్పో తెల్సుకోరా
పోరో — పోరో
సంగాలను పెట్టుకోరా
సంగతులూ చెప్పుకోరా

పంట నువ్ పండిస్తే
పంట ఆడి పెల్లైతది ?

నీ కష్టమిట్ల దోయడాని కె
వడిచ్చిండదికారం ?
నీ వాళ్ళపైనా చెయ్యేయ్య
ఎవడికిరా వాడయ్య ?
పోరో — పోరో
సంగాలను కదలించురా

కూలిచేసే వాడివ్ నువ్
కూలోళ్లా నీవోళ్ళే
పాలేరుగాడివి నువ్

పాలేర్లూ నీ వోళ్ళే
కూళ్ళ నాళ్ళ చేసోళ్ళు
ఆళ్ళే నీ చెల్లెళ్ళు
పోరో పోరో
ఆళ్ళందర్నీ కల్పుకోరా

ఏడున్నా- ఎవడైనా
కూలోల్లంతా ఒకటే
లేనోల్లంతా ఒకటే
మతమెందుకురా- మీకు
కులమెందుకురా ?
మాయదారి మాటలన్నీ
మర్శిపోండిరా-
మీ బతుకులన్నీ బాగుగాను
కల్శిపోండిరా-
పోరో- పోరో-
సంగంలో కల్సిపోరా
నీవోళ్ళను కల్పుకోరా
సంగంలో కల్సిపోయి
సంగతంతా ఎరుకచెయ్రా

ఓపికతో యింకుంటే
పాపం- పున్నెం అంటే
నమ్ముకోరా నామాట
పానం తీసేస్తారు
పసిపోల్లల సెరుస్తారు
పొలాలల్లో తొక్కుతారు
పోరో పోరో- పోరో పోరో
కొడవళ్ళను సంకబెట్టి
గొడ్డళ్ళను సంకబెట్టి
పోరో పోరో- పోరో పోరో

పొరుగూరి పుల్లన్నను
పక్కూరీ పాపన్నను
సీవూరీ నీలమ్మను
అందర్నీ కల్పుకోరా
ఆలోశన సేసుకోరా

ఈ జలగల్ని బతకనిస్తే
ఈ జలమమంతా సుకముండదు
దోసుకోని సంపుతాదు
లచ్చలకొద్దీ లచ్చా
లున్నారీ దేశంల
దొరోల్లంతా దోశటోళ్ళే
ఉన్నోళ్ళూ ఆళ్ళపట్టే
పోలీసూ ఆళ్ళపట్టే
కాంగ్రేసూ ఆళ్ళపట్టే
ఆళ్ళుంటే సుకముండదు
ఇల్లుండదు-పిల్లుండదు
పోరో- పోరో
గొడ్డళ్ళను నూఱుకోని
పోరో- పోరో
కొడవళ్ళను- నూరుకోని

శీకట్లనే లేవాలి
పేదపురుగుల నరకాలి
తెల్లారేసరికల్లా
ఎర్రెర్రగ కావాలి
నక్సల్‌బరీ సంతాల్
నేర్పిందీ యిద్యేంట
శికాకులమడవీ
శెప్పిందే యిద్యేంట
యిట్లచేస్తే నేగానీ
యిజయం మనకస్తదిరో-
పోరో- పోరో
సంగాలను కదలించుక

పోరగా- పాలేరుగా
నీలమ్మచెల్లెతోడుగా
ఆల్లబతుకు చెల్లగా
పోరో- పోరో
పోరో- పోరో
ఊరూతా పోరు పాట
పాడుకుంటూ — పోరుకుంటూ
పోరో — పోరో

గొడ్డళ్ళను సంకబెట్టి
కొడవళ్ళను సంకబట్టి
పోరో – పోరో
గొడ్డళ్ళను నూరుకుంటూ
కొడవళ్ళను నూరుకుంటూ
పోరో – పోరో

వారు బాబు దారిపైనా
సత్తెమన్న దారిపైనా
ప్రాణిగ్రాహి బాటపైనా
భాస్కరన్న బాటపైనా
పోరో పోరో – పోరో పోరో
గొడ్డళ్ళను సరిపించుక
కొడవళ్ళను సరిపించుక
పోరో పోరో – పోరో పోరో
ఊరూరా పోరు పాట
పాడుకుంటు పోరుకుంటూ
పోరో పోరో – పోరో పోరో

జోహార్లు

బి. రామాంజనేయులు

జోహార్ ! జోహార్ ! జోహార్ !
అమరవీరులారా ! అందుకోండి మా జోహార్లు ॥జోహార్॥

మహామనీషి మావో తెల్పిన
మహాసూక్తులను మననంచేసి
కార్మిక కర్షక రాజ్యం కోసం
కారడవుల్లో కాపురముంటు
కళ్ళులేని ఈ కుళ్ళు ప్రభుత చే
చంపబడ్డ ఓ కామ్రేడ్లారా ॥జోహార్॥

మీ ఆశయసిద్ధికోసం
మా అసువులనే అర్పిస్తాం
దోపిడిమూకల ధ్వంసంచేసి
సమతా రాజ్యం స్థాపిస్తాం
మరువలేము మీ ఆశయం
మరువబోము ముమ్మాటికి ॥జోహార్॥

ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం తరపున ప్రచురించనున్న సాహిత్య సంకలనాలకు కవితలు, కథలు, నాటికలు, వ్యాసాలు పంపించటానికి ఆఖరు తేదీ మే 10 వరకు పొడిగించ నైనది.

కన్వీనర్, 186, హర్షవర్ధన, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖ 3.

సమీక్షలు :

లాంగ్ మార్చ్‌లో చైర్మన్ మావోతో

ఇది చదవటానికి చాలా ఆహ్లాదకరమైన పుస్తకం. ఒకవిధమైన డాక్యుమెంటరీ చారిత్రక నవలలాంటిది. అయితే ఇందులో కల్పనకు తావులేదు. దీన్ని నవల అన టానికి రెండు కారణాలు చెప్పవచ్చు: సన్నివేశాలన్నీ ఒక పాత్ర దృక్పథంనుంచి వర్ణించబడ్డాయి; దీనిలో ఒక నాయకపాత్ర ఉన్నది. అది చైర్మన్ మావో. కథకుడు రచయితే. ఈ పుస్తకంలో లాంగ్ మార్చ్‌కి ఎంత ప్రాముఖ్యం ఉన్నదో, మావోకు అంత ప్రాముఖ్యం ఉన్నది— ఇంకా ఎక్కువే ఉన్నదికూడా.

1934–36 రెండేళ్ళు జరిగిన లాంగ్ మార్చ్ మానవ చరిత్రలోనే అపూర్వమూ, అనన్యమూ అయినది. మావో నాయకత్వంకింద సాగిన ఈ మహాప్రస్థానం ఊహాతీత మైన కష్టాలతోనూ, అంతకన్న ఊహాతీతమైన ఎర్రసైనికుల సహనశీలత తోనూ, దృఢనిశ్చయంతోనూ కూడుకున్నది. మావో మాటలలో "సామ్రాజ్యవాదులు, వాళ్ళ కావలికుక్కలైన చాంగ్ కై-షేక్ (చియాంగ్ కై-షేక్) ప్రభృతులు నిర్వీర్యులనీ, ఎర్రసైన్యం వీరాగ్రేసరుల సైన్యమనీ 'లాంగ్ మార్చ్' ప్రపంచానికి చాటింది...లాంగ్ మార్చ్ ఒక ప్రచారశక్తి కూడా. పదకొండు రాష్ట్రాలలో ఇరవైకోట్ల ప్రజానీకానికి ఎర్ర సైన్యం మార్గమే విముక్తిమార్గమని వెల్లడిచేసింది... ఒక్కమాటలో, లాంగ్‌మార్చ్ మన విజయంతో, శత్రుపరాజయంతో ముగిసింది."

లాంగ్ మార్చ్ వివరాలు ఒక ప్రత్యేక గ్రంథం అవుతుంది. ఎర్ర సైనికులు రెండు సంవత్సరాలపాటు 12,500 కిలోమీటర్లు కాలినడకన, దక్షిణాన కియాంగ్సీరాష్ట్రం నుంచి ఉత్తరషెన్సీకి నడిచింది. దారిలో ఇంచుమించు రోజూ సంఘర్షణలు జరిగాయి. ఎక్కరాని కొండలు ఎక్కారు, దాటరాని లోయలూ, నదులూ దాటారు. మానవుడు ఎన్నడూ అడుగుపెట్టని దుర్గమప్రదేశాలమీదుగా ప్రయాణించారు. పడరాని అగచాట్లు పడ్డారు. తిండికీ నీటికీ కరువు అనుభవించారు, ఉచ్చతాగారు. అయితే అది వేరేకథ.

ఆ లాంగ్ మార్చ్‌లో చైర్మన్ మావో చిత్రం ఈ రచనలో ప్రధాన వస్తువు.

చాంగ్-ఫెంగ్ (అది అతని పేరు. ఇంటిపేరు చెన్) కియాంగ్సీ రాష్ట్రంలో ఒక కుగ్రామానికి చెందిన నిరుపేదవాడు. చిన్నతనంలో గొడ్లుకాసాడు. చదువులేదు. పదమూడోఏట ఎర్రసైన్యం గురించి విన్నాడు. అదికూడా ఏమని? "ఉన్నవాళ్ళఅంతు తేల్చి, వాళ్ళ వెండి బంగారాల్ని పేదవాళ్లు పంచుకోవటానికి వీలుగా వీధుల్లో విరజిమ్ము తారట!"

చాంగ్-ఫెంగ్‌ను ఆకర్షించటానికి యిది చాలు. ఇంతలో ఎర్రసేన ఫ్యూకిన్ రాష్ట్రంలో చాంగ్‌టింగ్ చేరి, అక్కడి పెత్తందార్లను దించేసి, పేదవాళ్ళకు భూములు పంచినట్టు వార్త తెలిసింది. ఆ ఎర్రసైనికులు తమ ఊరు ఎప్పుడు వస్తారా అనుకున్నాడు. తానే ఎర్రసైన్యంలో చేరితే బాగుంటుందనిపించింది. అందుకో చేరిపోయే ఆశతో అతను పెద్దవాళ్ళకు చెప్పకుండా చాంగ్‌టింగ్ వెళ్లాడు.

"రైఫిల్ మోసే వయసుకూడా లేదు నీకు మరీ చిన్నవాడివి" అన్నారు వాళ్లు. కాని వాళ్లు సరేనన్నదాకా చాంగ్-ఫెంగ్ వదల్లేదు. అతను రెండేళ్ళపాటు "కొమ్మ" ఈ దేవని చేసిన అనంతరం బదిలీ అయింది. కమిసార్ మావో సె-టుంగ్ అనే ఆయనకు పరిచారకుడుగా ఫ్రంటు కమిటీ పంపారు. "అదృష్టం అంటే నాదే! కమిసార్ మావో అద్భుతమైనవ్యక్తి. ఆయన్తో పనిచేశావంటే నీకు గొప్ప భవిష్యత్తు వుంటుంది" అని చెప్పారు.

ఫ్రంట్ కమిటీకోసం ఎక్కడికో పోనవసరంలేదు. అవూళ్లోనే ఉంది. కొద్ది క్షణాల ప్రయాణం. మావో వుండేది "ఫక్తు కియాంగ్సీతరహా కొయ్య ఇల్లు, రెండు గదుల యిల్లు. ఒకటి పడగ్గది. రెండోది ఆఫీసుగది... పడగ్గదిలో ఓక సాదాకొయ్య మంచం— దానిమీద నూలుదుప్పటి పరిచిఉంది...దిండైనాలేదు. కమిసార్ కూడా మా అందరిలాగే అతిసామాన్యంగా జీవిస్తున్నట్టు నాకు తోచింది."

కుర్రాడు యింకా మావోను చూడకుండానే ఆయన్నుగురించి తెలుసుకోవటం ఆరంభించాడు. ఆయన్ను చూశాక, "ఆయన వేసుకునే యూనిఫారం మేం వేసుకునే బూడిదరంగు యూనిఫారమే. నాకు కనిపించినతేడా... కోటుజేబులు చాలా పెద్దవిగా ఉండటమే... బాగా పీలగా ఉన్నట్టున్నాడు. కళ్లు మాత్రం బాగా విశాలంగా, సునిశితంగా వున్నాయి... వయసు నలభై వుండవచ్చు. చేతుల్తో అభినయిస్తూ మాట్లాడుతున్నాడు. స్వరం చాలా మృదువుగా వుంది" లేచి నిలబడ్డప్పుడు పొడగరిగా గోచరించాడు.

మావో తనకు పరిచారకుడుగా వచ్చినవాణ్ణి ఊరూ, పేరూ అడిగి ఎర్రసేనలో ఎందుకు చేరావని "బడిపంతులు" ధోరణిలో అడిగాడు.

"ఎర్రసైన్యం ఎంతోమంచిది. స్థానిక పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది," అన్నాడు చాంగ్-ఫెంగ్.

వాళ్ల వూళ్లోకూడా స్థానిక పెత్తందార్లున్నారా? ఉన్నారు. చాంగ్-ఫెంగ్ తన కథ అంతా చెప్పాడు. మావో తల ఆడిస్తూ, చిరునవ్వునవ్వుతూ శ్రద్ధగా విన్నాడు. ఆయన చాంగ్-ఫెంగ్‌తో, "నువ్వింక బాగా కష్టపడి పనిచెయ్యాలి. కష్టపడి చదువుకో

వాలి.... నీపేరు నువురాసుకోగలవా?... కనీసం నీపేరు, యితర్ల పేర్లుఅయినా రాయటం నేర్చుకోవాలి...నీకు తెలియందేమైనావుంటె వాళ్ళనడిగి తెలుసుకో" అంటూ తన మరో పరిచారకుడు 'వూ'ను చూపించాడు,

"ఆయనెప్పుడూ రాత్రిపూట చాలా పొద్దుపోయేదాకా పనిచేసుకుంటారు. పొద్దునపూట ఆయనకు ఫలహారం మరీ పెందలకాడ యివ్వకు," అన్నాడు వూ.

మావోకు పరిచారకుడు అయినతరువాత ఆయనగురించి తెలుసుకునేవీ, ఆయన నుంచి నేర్చుకునేవీ చాలాఉంటాయి. "మావో జీవితం చాలా నిరాడంబరమైనది .. ఆయనకున్న సరంజామా అతిస్వల్పం- రెండు గొంగళ్లు, ఒక నూలుదుప్పటి, బూడిద రంగు యూనిఫారాలురెండు, చాలాకాలంనాటి ఒక ఓవరుకోటు, ఒక వూలుచలిబనీను, విరిగిపోయిన ఒక గొడుగు, అన్నంతినే కంచం, పుస్తకాలు, మ్యాపులు. రకరకాల పత్రాలు పెట్టుకునే ఒకమూట..." ప్రయాణాలప్పుడు ఆమూటనూ, గొడుగునూ మావో మోసేవాడు; మిగిలినవి పరిచారకుడు మోసేవాడు. మజిలీచేరగానే "రెండు చెక్కపలకలు జతచేర్చి, దుప్పట్లుపర్చి యూనిఫారాలు దిండుగా అమర్చేవాణ్ణి, అదే ఆయనపడక."

"ఆయన అతితక్కువగా నిద్రిపోయేవారు. మాదగ్గిర చిన్నలాంతరొకటి వుండేది. ప్రయాణంలో అదేమాత్రు టార్చిలైటు. క్యాంపులో అది ఆఫీసుపని చేసుకోడానికి ఉపయోగపడేది. రాత్రిపూట భోజనం ముగించుకుని ఆ లాంతరు వెలిగించి, పుస్తకాలు వగైరా బైటికితీసి వేకువజాముదాకా ఆయనపనిచేసుకుంటూ కూర్చునేవారు."

చాంగ్-ఫెంగ్ రాత్రిపూట ఆయనపక్కనే కూర్చుని, మేలుకోలేక జోగుతూంటే మావో అతన్ని వెళ్లి పడుకోమనేవాడు. వేసవి రాత్రులు మంచినీరు అడిగేవాడు. చల్లటినీటితో టవల్ తడిపి, ముఖమూ, ఒళ్ళూ తుడుచుకునేవాడు. ఆకలివేస్తే మధ్యాన్నం కంచంలో మిగిలిపోయిన ఆహారాన్ని వెచ్చబెట్టించుకుని తినేవాడు.

ఒకసారి చాంగ్-ఫెంగ్ మిగిలిపోయిన ఆహారాన్ని బయటపారేశాడు.

"ప్రజలు కష్టపడి పండించే ప్రతిగింజకూ పోరాడుతున్నాం. ఇకమీదట అట్లా ఎప్పుడూ చెయ్యకు," అని మావో అతన్ని మందలించాడు.

పరిచారకుడుగా చాంగ్-ఫెంగ్ మావోను బాగానే కనిపెట్టుకునిఉన్నట్టు కనబడుతుంది. మావోకు అవసరమైనప్పుడు వేడినీరు అందేదికాదు. ఎలాగైనా ఒక థర్మాస్ ఫ్లాస్క్ సంపాదించాలని అతను తహతహలాడి, 1931 శీతకాలంలో, యాంగ్సీరాష్ట్రంలోని చియాన్ ఎర్రసైన్యానికి వశమైనప్పుడు, పారిపోయిన ఒక పెత్తందారు ఇంట దాన్ని సంపాదించాడు. కాని, మావోకు తెలిసిందంటే ప్రమాదమని భయపడి, దాన్ని

తమ వెంటవుంటే మరొకడివద్దఉంచి, మావో కోరినప్పుడు అందులోనుంచి వేడినీరు ఇచ్చేవాడు.

మరొకటి ఏమిటంటే, మావో భోజనపాత్రి. అందులో ఒక్క-పూటకు సరిపోయే భోజనమే పడుతుంది. 1931 నవంబరులో కమిసార్ మావో, చైర్మన్ మావో అయాడు. కాని ఆయన భోజనపాత్రి మారలేదు. చివరకు, "1934 ఫిబ్రివరిలో మేం చాంగ్‌చే, ఫ్యూకిన్‌లను పట్టుకున్నప్పుడు మూడుగిన్నెల ఎనామిల్ క్యారియరు ఒకటి" సంపాదించాడు చాంగ్-ఫెంగ్.

చాంగ్-ఫెంగ్‌కు పోస్టాఫీసు ఏంచేస్తుందోకూడా తెలీదు. తమ ఉత్తరంరాస్తే అది తమ ఊరిచేరి, తనవాళ్ళకు అందుతుందంటే ఆశ్చర్యపోయాడు. ఉత్తరం రాయాలనివుంది. రాయటంరాదు. ఏంరాయాలనిఉంది అని మావో అడిగితే, అదికూడా సరిగా చెప్పలేకపోయాడు. చివరకు మావో స్వయంగా ఆ ఉత్తరంరాసి అతనిచేత పోస్టు చేయించాడు. అప్పటికి చాంగ్-ఫెంగ్ మావోకు కేవల పరిచారకుడుకాడు, అంగ రక్షకుడు.

1933 చివరలో ఎర్రసైన్యం చాంగ్-ఫెంగ్ జన్మస్థలంఉండే జిల్లాకు సమీపంగా వచ్చింది. మావో అతన్ని పదిరోజుల సెలవుమీద ఇంటికి పంపుతూ, "వెళ్లి మీవాళ్ళం దరినీ చూసిరా. నువ్వు తిరిగొచ్చాక యింకా బాగాపనిచెయ్యగలుగుతావ్. యిప్పుడు మీ కుటుంబం సోవియట్ ప్రాంతంలోవుంది," అన్నాడు.

చాలాకాలానికి ఇంటికి తిరిగొచ్చిన చాంగ్-ఫెంగ్‌ను చూడటానికి చాలామంది వచ్చారు. "మాయింటిదగ్గిర ఒక మహాసభ జరుగుతున్నంత సందడిగావుంది." చైర్మన్ మావోనుగురించి అతను వూరివాళ్లకు తెల్లవార్లూ చెప్పాడు... "చైర్మన్ మావో అచ్చం మన మామూలు జనంమోస్తరే!"... అందుకే మామూలుజనం, గ్రామ సోవియట్ అధ్యక్షుడితో సహా, మావోనుగురించి ఆసక్తితో విని ఉంటారు.

చాంగ్-ఫెంగ్ తిరిగివచ్చినాక మావో అతన్ని, "మీకుటుంబం ఎలావుంది? మీ గ్రామ సోవియట్ అధ్యక్షుడు శ్రీమంతుడా, పేదవాడా? మీ నాన్న సీకు అమ్మను చూసిపెట్టాడా?" అంటూ అడిగాడు. మావో జ్ఞాపకశక్తి: "మూడేళ్ళకిందట నేను మొట్ట మొదటిసారి ఆయన్ని కలుసుకున్నప్పుడు నాకు చిన్నప్పుడే అమ్మపోయిందనిచెప్పాను. ఆయన ఆ విషయం మరచిపోలేదు,"అంటాడు చాంగ్-ఫెంగ్.

అతనితండ్రి "కొత్తపద్ధతిలో" పెళ్ళిచేసుకున్నాడు. సోవియెట్ పరిపాలన ప్రభావం.

లాంగ్‌మార్చ్‌కి ముందు మావో అవిరామంగా పర్యటనలు చేశారు. తిండీ, నిద్రా లేదు. చిక్కిపోయాడు. ఆయన అంగరక్షకులు కలవరపడ్డారు. వాళ్లు తనను విశ్రాంతి తీసుకోమన్నప్పుడల్లా ఆయన బల్లమీద పేరుకున్న కాగితాలగుట్టలు చూపించి, అవన్నీ చూసి విశ్రాంతి తీసుకుంటానని మాట ఇచ్చేవాడు. డాక్టరును ఏర్పాటుచేస్తామంటే, టెంపరేచరుచూసి ఇంజెక్షన్లు ఇవ్వటానికి నర్సు చాలునన్నాడు. "సైన్యానికి డాక్టర్లు కావాలి. మనకున్న డాక్టర్లు బహుకొద్ది నా ఒక్కడికోసం డాక్టర్ని ఎలా పెట్టుకోను?" అని ఆయనవాదం. చివరకు ఆయనకు ఒక వైద్య పరిచారకుణ్ణి, చుంగ్-ఫ్యు-చాంగ్‌ను ఇచ్చారు.

1930 మొదలుకుని చియాంగ్ కై-షేక్ "ఎర్ర"స్థావరాలమీద నాలుగు పెద్ద దాడులు చేశాడు. చివరకు ఎర్రసేన తమ స్థావరాలను విడిచిపుచ్చి దీర్ఘ యాత్రమీద బయలుదేరవలసి వచ్చింది. 1934 అక్టోబరు 16న ఎర్రసైన్యం లాంగ్ మార్చ్ ప్రారంభించింది. మావో మరి రెండురోజుల అనంతరం బయలుదేరినట్లు కనబడుతుంది. "1934 అక్టోబరు 18 చైనా విప్లవచరిత్రలో మరువలేనిదినం. ఆరోజు సాయంత్రం అయిదు దాటాక మేం యిరవైమంది చైర్మన్ మావోతోపాటు యూటూ నుంచి బైల్దేరాం. దీర్ఘ యాత్రకు అదేనాంది" అంటాడు చాంగ్-ఫెంగ్. వాళ్లు బయలుదేరినప్పుడు ఒక్క సిపాయి అయినా అతనికి కనిపించలేదు.

మిగిలినదంతా లాంగ్ మార్చ్ సంఘటనలే.

చాంగ్-ఫెంగ్ త్వరలోనే అసంఖ్యాకులైన సైనికులనుచూసి, "మనకింత సైన్యం ఎట్లా వచ్చింది?" అని చైర్మన్ మావోను అడిగాడు ఇంకా ఎంతోమంది ముందు వెళ్ళిపోయారని మావో చెప్పాడు. సైనికులందరూ ఒక నదిని దాటేటప్పుడు మావో స్ట్రెచరుమీదఉన్న ఒక సైనికునిచూసి "గాయం బలంగా తగిలిందా, కామ్రేడ్?" అని మృదువుగా పలకరించాడు. "లేదు...నేను యిట్టే మళ్లీ యుద్ధరంగంలోకి తిరిగివస్తాను" అన్నాడు క్షతగాత్రుడు. "స్ట్రెచర్ వెళ్ళిపోయినవేపే చూస్తూ నిలబడిపోయి చైర్మన్ మావో దీర్ఘాలోచనలో మునిగిపోయాడు."

పగటిపూట శత్రువిమానాలదాడి భయం. ప్రస్థానం రాత్రివేళ సాగింది. నవంబరులో సియాంగ్ నదినిదాటటం మావోలెక్కన ఘనవిజయం. క్వాంగ్సీ, హ్యూనాన్ రాష్ట్రాల సరిహద్దుఅయిన ఆ నది కొమింటాంగ్ నాలుగోదాడికికూడా సరిహద్దు. మావోకు ఒక్కరోజైనా కడుపునిండా తిండిలేదు.

త్వరలోనే వారు మియావోజాతివారుండే ప్రాంతం ప్రవేశించారు. అక్కడఎలా ప్రవర్తించాలో మావో తన అనుచరులకు చెప్పాడు. ఎర్రసైనికులు రాత్రిపూట పడు

కునేటందుకు వాకిళ్ళతలుపులు ఊతకెత్తి, మర్నాడు మళ్ళీ పెట్టేస్తారు. కాని ఈ ప్రదేశంలో ఆపని చెయ్యవద్దని మావో హెచ్చరించాడు.

ఒక మజిలీలో మావో బసకు దిగువన ఒక పెద్ద కొలనులో పెద్ద పెద్ద గండు చేపలున్నాయి. వాటినిపట్టి చైర్మన్‌కు వండిపెడదామనుకున్నాడు చాంగ్-ఫెంగ్.

" 'నిన్న నేను చెప్పినదంతా యింతవేగం మర్చిపోయావన్నమాట!'అన్నారాయన కటువుగా " మనదికానిదేదీ ముట్టుకోవద్దని ఆయన ముందే చెప్పాడు.

మియావోలు మొరటుమనుషులనీ, వాళ్ళతో మైత్రి సాధ్యంకాదనీ అనుకున్న చాంగ్-ఫెంగ్, తమకు మియావోలలో కామ్రేడ్‌లు ఉన్నట్టు మావోనోటవిని ఆశ్చర్య పడ్డాడు. "మనకు కామ్రేడ్స్ ప్రతిచోటా వున్నారు... విప్లవాన్ని మనమే గుత్తకుతీసు న్నామని అనుకుంటున్నావా ?"అన్నాడు మావో హాస్యంగా.

నూతన సంవత్సరం వచ్చింది అప్పటికి మావోముఠా హోచాంగ్ అనే చిన్న బస్తీలోఉంది. మావోకు చాలా చక్కని బసదొరికింది. "మేం సోవియట్ ప్రాంతం విడిచిపెట్టి రెండునెలలు గడిచింది ఈ రెణ్ణెల్లలో చైర్మన్ మావో విరామం అంటూ ఎరగరు. విశ్రాంతి తీసుకునే వీలేదిక్కలేదు. ప్రయాణంలో ఆయన తన గుర్రాన్ని వడిచే ఓపికలేనివాళ్ళకో, జబ్బుగా ఉన్నవాళ్ళకో యిచ్చి, తను స్వయంగా నడిచారు. మజిలీచేసినచోట ఎప్పుడూ సమావేశాలే. అందరూ హాయిగా నిద్రపోతోంటే ఆయ నొక్కరూ రాత్రిపూట మేలుకొని కూర్చుని టెలిగ్రాములు చదువుతూ, నివేదికలు తయారుచేస్తూ, యింకా యితర కార్యభారం వహిస్తూ గడిపారు. ఎంతకాలమని యీ విధంగా నెట్టుకుపోగలరు ? ఇట్లాంటి చక్కటిచోట ఆయన కొద్దికాలంపాటు ఆగి, కొత్త సంవత్సరం ఉత్సాహంగా గడిపి, కొంత విశ్రాంతి తీసుకుంటే ఎంతబాగున్ను !" అదీ చాంగ్-ఫెంగ్ ఆలోచన కొత్త సంవత్సరం పండగకోసం అతను చాలా ఏర్పాట్లు చేశాడు. కాని మావో "మనం యిక్కడ ఆగే అవకాశంలేదు ..సంబరంచేసుకోవటం కంటే యింకా ముఖ్యమైన పనులెన్నో వున్నాయ్ :"అనేశాడు.

ముందు జరగవలసిన ముఖ్యమైన పని వాళ్లు 'వూ'నది దాటటం. చియాంగ్ కై-షేక్ వాళ్ళను వేటాడటానికి పెద్ద సైన్యాలను పంపుతున్నాడు. శత్రువుతో ఘర్షణపడ కుండా సాధ్యమైనంతవేగంగా తాము 'వూ'నది దాటాలని మావో అన్నాడు.

ఎర్రసైన్యం వూనదిని దాటినాక వాళ్ళకు తగిలిన పెద్దనది "బంగారుయిసుక"నది (చిన్‌షా). అది దాటిన తరవాత చాంగ్-ఫెంగ్ చెయ్యి, కాలూ ఆడలేదు. చైర్మన్‌కు పడకా, తిండీ, సిరా లాటివి ఏర్పాటు చెయ్యటం అతనికి చాలా కష్టమయింది కాని మావో బసకువచ్చి "నేను పనిచేసుకోవటానికి స్థలంచూశావా ?"అని అడిగాడు లేదు.

మావో తీక్షణంగా "ఇటువంటప్పుడు పని అనేది అన్నింటికంటె ముఖ్యం. అన్నం-నీళ్లు యివన్నీ అల్పవిషయాలు. ఇరవై, ముప్పై వేలమంది మన కామ్రేడ్స్ నదివిదాటటాని కింకా వేచినిలబడిఉన్నారు. ఇది ముప్పైవేలమంది జీవితాలకు సంబంధించినవిషయం" అన్నాడు.

"ఫీల్డు టెలిఫోన్ అవిరామంగా సందేశాలు పంపుతోంది. ఆయన ఏకదీక్షగా తనపనిలో లీనమైపోయారు. స్వీయసుఖానికై ఆయన ఒక్క క్షణంకూడా వెచ్చించలేదు. మూడు రోజులపాటు పగలూ రాత్రీ షుమారు 30 వేలమంది సైనికులు బంగారుయిసుక నది దాటుతూనేఉన్నారు. చైర్మన్ మావో ఆ అన్నిరోజులూ డెస్కు విడిచిపెట్టనేలేదు"

తరవాత ఎర్రసైన్యం 'యీ' జాతిప్రజలుండే ప్రాంతంచేరింది. 'యీ' ప్రజలు అనాగరికులు. చాంగ్-ఫెంగ్ భాషలో "యిక్కడ పొలాలన్నీ బీళ్లుగావున్నాయ్. వరి పొలాల్లేవు. వ్యవసాయదారుల యిల్లులేవు. అంతా బోసిగావుంది. అడవుల్లో అక్కడక్కడా మోటుగాకనిపించే బెత్తెడు పాకలున్నాయ్ "

అయితే మావో భాషలో 'యీ' జాతివాళ్లను "మనం గౌరవిస్తాం. మన సోదరుల్లాగా భావిస్తాం. తెల్ల (కోమింటాంగ్) సైన్యానికి వ్యతిరేకంగా వాళ్ళతోమనం భుజం భుజం కలిపి పోరాడ్తాం. ఎర్రసైన్యం వాళ్ళ దగ్గరికి వచ్చిందనితెలస్తే. వాళ్లు ఎగిరి గంతేస్తారు."

మావో చెప్పినది అక్షరాలా రుజువయింది. అయితే వాళ్ళభాష అర్థంకావటం లేదనీ. ఆ ప్రాంతం మరోదేశంలాగా ఉన్నదనీ చాంగ్-ఫెంగ్ నసిగాడు.

"నువ్వు కియాంగ్సీ రాష్ట్రం మనిషివి. నేను హ్యూనాన్‌రాష్ట్రంవాణ్ణి. నేను మాట్లాడేభాష నువ్వు అర్థంచేసుకోలేవు. యిక, వీళ్ళమాట నీకెలాతెలుస్తుంది చెప్పు." అన్నాడు మావో.

ఇక్కడినుంచి తాతూనది ప్రాంతానికి వెళ్లేదారి దుర్గమమైనది. "పర్వతాలమయం దోవా డొంకాలేదు. ఒత్తుగా పెరిగినగడ్డి, ఒళ్ళుగీసుకుపోయే ముళ్లపొదలు. విస్త్రంగా ఉన్న కొండపుంత పైకెక్కుతున్నకొద్దీ ప్రయాణం మరింత కష్టమైపోయింది. పోను పోను చెట్లూ చేమా మరీ దట్టంగా అల్లుకుపోయివున్నై. మధ్య మధ్య మేమాగిపోయి మా యింజనీరింగు బృందాన్ని కాలిబాట చెక్కటానికి పంపాల్సివచ్చేది."

మావో పరిపూర్ణ నాయకుడనాలి. సిద్ధాంత విషయాలలోనేకాదు, కార్యాచరణలోనే కాదు. ప్రవర్తనలోకూడా మావో నాయకుడనిపించుకున్నాడు. చూడండి- "బాటవుండనీ లేకపోనీ, చైర్మన్ మావో మాత్రం చురుగ్గా నడిచేవారు. ఆయన ముఖంలో అలు

మాత్రమైనా అలసట కనిపించేది కాదు. దార్లో మధ్య మధ్య మావేపు తిరిగి కబుర్లు చెబుతూ, కథలు వినిపిస్తూ ప్రయాణం సాగదీసేవాడు. ఆవిధంగా ఆయన్ని చూశాక మేమూ ఉత్సాహం పుంజుకున్నాం. మా అలసట గాల్లో ఎగిరిపోయింది."

మునిమాపువేళ ఒక శిఖరాగ్రంచేరి అక్కడ విశ్రమించారు. తిండితిని, మిగిలినవాళ్లు మాట్లాడుకుంటూండగా హ్వ్యావాంగ్ గురకపెట్ట నిద్రకుపడ్డాడు. అతనుకూడా మావో పరిచారకుడే. అతనిముఖంమీద నీళ్ళు చల్లటానికి ఎవరో ప్రయత్నిస్తే మావో వారించి. "పాపం. బాగా అలిసిపోయాడు. అతణ్ణి కాస్సేపు పడుకోనివ్వండి" అని తన గుడ్డలమడత అతనితలకింద దిండుగా పెట్టాడు;

మర్నాడు వాళ్లు ఒక నదిమీదివంతెన దాటేటప్పుడు మావో గుర్రాన్ని దాటించటానికి సైనికులు వెనక్కుతగ్గారు. అయితే మావో గుర్రం సకిలించి హంగామా చేసింది. మావో దాన్ని వెనక్కుతీసుకురమ్మనీ, సైనికులంతా వంతెనదాటేశాక దాన్ని దాటించమనీ అన్నాడు. అయితే మావో సామానంతా ఆ గుర్రంమీదఉన్నది. అది అవతలికి పోతేనేగాని చైర్మన్‌కు పడక వగైరాలు ఏర్పాటుచెయ్యటానికుండదు.

"ఒక్కవిషయం గుర్తు పెట్టుకోండి మన సైనికుల్నిగురించి. ఇంకాయితర్లను గురించి మొదట ఆలోచించాలి. ఎక్కడ, ఎప్పుడు అనే ప్రశ్నేలేదు. మన ఒక్క గుర్రంకోసం అంతమంది సైనికుల్ని దాటనీయకుండా ఆపేయటం తప్పుగాఉండదా ?" అన్నాడు మావో.

లూటింగ్‌వద్ద ఎర్రసైన్యం వంతెనను దాటినది ఒక అద్భుతగాథ. దానివివరాలు ఈ పుస్తకంలో లేవు నదికి రెండువేపులా ఎత్తు కొండలు. నది చాలా లోతున, ఉరకలువేస్తూ ప్రవహిస్తున్నది. నది దాటేవంతెనకుగాను 13 బలమైన గొలుసులు రెండు వేపులా ఉన్న కొండలలో తాపటంచేశారు. అందులో 9 మాత్రమే వంతెన. మిగిలినవి పట్టుకుని నడిచేవి. గొలుసులమీద చెక్కలుపరిచి ఉండేవి. అవి కొన్ని పోయాయి. మిగిలినవాటిని శత్రుసైనికులు ఎర్రసైన్యం దాటేటప్పుడు తగలబెట్టారు. లూటింగ్ నది అవతలిగట్టున ఉన్నది. అక్కడ శత్రుస్థానం ఉన్నది. అయినా ఎర్రసేన నది దాటి, లూటింగ్‌ను వశపరచుకున్నది.

మావో తన బృందానికి ముందుండి గొలుసులమీద "చాలా సహజంగా, నింపాదిగా నడిచిపోతున్నాడు. అందరూ వంతెనమధ్యకు వచ్చేసరికి వంతెన ఊగింది. చాంగ్ ఫెంగ్. ఆగిపోయాడు. మావో ఏదోచెబితే నది రొదలో అతనికి వినిపించలేదు. మావో వెనక్కువచ్చి. అతని చెయ్యిపట్టుకుని నడిపించి అవతలిఒడ్డుచేర్చాడు...ఇతరకామ్రేడ్స్ గొలుసులమీద బోర్లాపడుకుని పాకివస్తున్నారు.

"చైర్మన్, మన ఒక్కజట్టు(ఇరవైమంది)యీ వంతెనని ఎంతకాలమైనా శత్రువశం కానీకుండా పట్టుకుని వుంచగలదు. కాని, మన శత్రువులు..." అన్నాడు చాంగ్-ఫెంగ్.

మావో నవ్వి "శత్రువులు శత్రువులే. మన కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన సాగే సైన్యంతో వాళ్ళని పోల్చలేం. ఔనా?" అన్నాడు.

తరవాత కొన్నిరోజులకు వాళ్ళు ప్రయాణించేదారిలో శత్రువిమానాలు బాంబులు వేశాయి. మావో వెంట చాంగ్-ఫెంగ్‌తోబాటు హ్వ్యా చాంగ్-పో అనే రక్షకబృందం నాయకుడుకూడా ఉన్నాడు. హ్వ్యా దెబ్బతిన్నాడు. "తొందరగా కేసుచూడు." అని మావో వైద్యపరిచారకుణ్ణి ఊదరపెట్టాడు. ఆయన హ్వ్యా తలను నిమురుతూకూర్చుని "యిదేమంత తీవ్రమైంది కాదు నీకు త్వరగా కులాసా చిక్కుతుంది" అని చాటి పిల్లవాణ్ణి ఊపినట్టు ఊపాడు. కాని హ్వ్యా బతకలేదు.

అటుమీదట విప్లవ సైనికులకు ప్రకృతే భయంకర శత్రువయింది. చైచిన్ (చియాచిన్) మంచు పర్వత కనుమలను దాటటం ఒక భయంకర సమరంలాటిది. తీవ్రమైన చలి. చలిబాధకు తట్టుకునేటందుకు అల్లమూ, మిరపకాయలూ చేర్చిపెట్టుకోమని మవో అందరికీ చెప్పాడట! దోవంతా మంచు. తప్పటడుగువేస్తే అగాధాలలో పడిపోతారు. మంచు పల్చగాఉన్న ప్రాంతంలో జారుడు ఒకరినొకరు పట్టుకుంటూ ఉండాలి.

"చైర్మన్! మీకిది చాలా ప్రయాసగావుంది. మమ్మల్ని కాస్త చెయ్యందించనివ్వండి."

"నా అంతగామీరూ అలిసిఉన్నారూ."

మధ్యలో మంచుపడటం ఆరంభమై బీభత్సం చెలరేగింది. వడగళ్లు పడుతున్నాయి. నేలమీదిమంచు గాలికిలేచి సుడులుతిరుగుచున్నది. మేం చకచకా గుడ్డపట్టా తెరిచి పైకెత్తిపట్టుకున్నాం. మధ్యలో మావో నిలబడ్డారు.

మంచుతుఫాను ఎలావచ్చిందో అలాగే అకస్మాత్తుగాపోయింది. "ఎవరికైనా దెబ్బలు తగిలాయా?" అని మావో అడిగాడు. గుర్రాన్ని నడిపించేవాడికి వడగళ్ళుతాకున చెయ్యివాచింది.

దారిపొడుగునా మావో తన అనుచరులను హెచ్చరిస్తూనేవచ్చాడు-

"శిఖరంపైకిచేరేదాకా మాట్లాట్టం, నవ్వటం వగైరాచెయ్యకండి. కొండదేవుడు మీకు ఊపిరి తిరక్కుండాచేసి చంపేస్తాడు."

"కామ్రేడ్స్. సత్తువపుంజుకోండి. ముందుకుచూడండి. ఆగకుండాసాగండి."

"కామ్రేడ్స్. ఇక్కడమనం విశ్రాంతి తీసుకోటం కుదర్దు... కొద్ది ఓపికచేసుకున్నారా. దిగువన మన నాలుగోఫ్రంటు ఫౌజుకలుస్తుంది."

ఇంతలో చాంగ్-ఫెంగ్‌కు మలేరియావచ్చింది. మావో అతన్ని ఒకచేత్తో మంచులో పడిపోకుండా పట్టుకున్నాడు...

వాయువ్య జెకువాన్ ప్రాంతంలో ఒకనాడు వాళ్లు నిరామయ పర్వతప్రాంతంలో ప్రయాణిస్తుండగా వానపట్టుకున్నది. చీకటిపడింది. లాంతర్లో కిరసనాయిలు లేదు. కన్నుపొడుచుకున్నా కనపడని, దారీతెన్నూ తెలియరాని ప్రయాణం. మావో బాగా అలిసిపోయాడు. ఆగిపోవటానికి ఆయన్ను ఒప్పించి, రెండుచెట్లకు తడీహామక్ తగిలించారు ఆయనకోసం.

"కియాంగ్సీ చలువశయ్యమీద పవ్వలించబోతున్నానన్నమాట:"అని మావో ఛలోక్తి విసిరాడు. "మేం ఎన్ని విపత్తుల్లోఉన్నా, ఆయన రెండు చతురోక్తులాడితే వాతావరణం తేలికయ్యేది... మాలో కొత్తశక్తి ప్రవహిస్తున్నట్టుగా తోచేది ఎటువంటికష్టాన్ని ఎదుర్కోడానికైనా సిద్ధమయేవాళ్ళం" అంటాడు చాంగ్-ఫెంగ్.

చాంగ్-ఫెంగ్‌కు ఒకరాత్రి మెడపట్టి, పోటుపుట్టసాగింది. "చైర్మన్ మావో మహా సూక్ష్మగ్రాహి. ఆయన పరిశీలననుంచి ఏదీ తప్పించుకోలేదు. 'చెన్ చాంగ్-ఫెంగ్, మోర పైకెత్తి పైకే చూస్తున్నావ్! ఏమయింది? విమానాలొస్తున్నాయని చూస్తున్నావా యేం?'... నెమ్మదిగా నా మెడనిమిరి, వెంటనే వైద్యపరిచారకుణ్ణి పిలిచారు... నా చెయ్యిపట్టుకుని నడిపించుకొస్తూ 'గాభరాపడకు అదే తగ్గిపోతుంది' అని ఓదార్చారు... ఆయన్లో నేను పితృప్రేమచూశాను."

యాత్రసాగింది. అసీమ అరణ్యాలు దాటారు. భయంకరమైన చవిటిపర్రిలు ప్రవేశించారు. మనిషిఎత్తు గడ్డి పెరిగినప్రాంతాల మైళ్ళకుమైళ్ళు నడిచారు. కాళ్ళకింద ఊబినేల. "చైర్మన్ మావో ఎన్నోసార్లు కామ్రేడ్స్‌ను తన దృఢమైన హస్తాలతో ఊబిలోంచి బయటికిలాగారు... చైర్మన్ మావో మా అందరికంటే ముందుండి నడుస్తున్నారు. మధ్య మధ్య ఆగి అందరూ వస్తున్నారో లేదో చూసుకుని...గాని మళ్ళీ అడుగుముందుకువేసేవారు కారు. మేం బాగా అలిసిపోయి అడుగు ముందుకు వెయ్యలేనిస్థితిలో ఉన్నప్పుడు...కథలు చెబుతూ. ఛలోక్తులు విసుర్తూ మమ్మల్ని కడుపుబ్బ నవ్వించేవారు. మా అలసట ఎటెగిరిపోయేదో!"

మావో జన్మతః గురువు. దీర్ఘయాత్రలాటి క్లిష్టమైన అనుభవంమధ్య ఆయన తనవెంట ఉన్నవారికి అన్నిరకాల సహాయమూ చెయ్యటమేగాక జీవితానికి పనికివచ్చే ఉపదేశాలు ఎన్నోచేశాడు. విప్లవకారులకు అవి మరింత అమూల్యమైనవి.

"కష్టాల్ని గురించి జడిసిపోగూడదు. కష్టాలంటే భయపడితే అవి యింకా భయంకరమౌతాయి. నువ్వు భయపడకుండా నిబ్బరంగా వున్నావో, అవెంతటివైనా విన్నేంచెయ్యలేవు."

అవతలివాడు నిబ్బరం కనపరిస్తే, "గుడ్. నువ్వు నిజమైన ఎర్రసైనికుడివి."

"మనం కొత్తచోటికి వచ్చినప్పుడు కొత్తపద్ధతుల్లో జీవించటం నేర్చుకోవాలి."

చివరకు దీర్ఘయాత్ర ముగిసింది. ఎర్రసైన్యం ఉత్తరషెన్సీ చేరాక మావో కొందరు కామ్రేడ్స్‌ను సైనిక ఎకాడమీకి పంపేస్తున్నాను. ఏమంటావ్?"అన్నాడు.

ఆరేళ్ళతరవాత అతనికి మావోను విడిచిపెట్టివెళ్లాలనిలేదు. ఆయన అతనితో, "చదువుకోడానికి నీకు అవకాశం దొరకలేదు... నీచదువు పూర్తయ్యాక పార్టీకి యింకెంతో మంచిగా పనిచెయ్యగలుగుతావు. అప్పుడు నాకు చాలా సంతోషంగాఉంటుంది" అన్నాడు.

"నేను వెళ్ళిపోతే మిమ్మల్ని ఎవరు కనిపెట్టుకుని ఉంటారు?"

"దానినిగురించి నువ్వేమీ బెంగెట్టుకోకు. నీ స్థానంలో మరొకరు వస్తారు."

చాంగ్-ఫెంగ్ బయలుదేరేటప్పుడు మావో అతనికి కాగితాలూ, పెనసళ్లూ ఇచ్చాడు.

చాంగ్-ఫెంగ్ అకాడమీలో కొంతకాలంఉండి, ఒక భద్రతాదళానికి శిక్షకుడుగా నియామకం పొంది మావోను మళ్ళీ కలుసుకుని, తాను చేస్తున్నపనిచెప్పి, తనకు ఉపన్యాసం ఇయ్యటం చేతకావటంలేదని చెప్పాడు.

"నువ్విప్పుడు కేడరువి. చాలా అప్రమత్తంగా ఉండాలి. మాట్లాడేటప్పుడు చెప్పదలచింది స్పష్టంగా చెప్పాలి. వ్యర్థప్రేలాపన చెయ్యకూడదు. డాంబికం తెచ్చిపెట్టుకోకూడదు. నటించటం పనికిరాదు.

1946లో చాంగ్-ఫెంగ్ మావోవద్ద వీడ్కోలుచెప్పి షాన్‌టుంగ్ వెళ్ళిపోయాడు. తిరిగి అతనికి మావోను కలుసుకునే అవకాశం 1958 ఆగస్టులో కలిగింది.

"చెన్ చాంగ్-ఫెంగ్ కదూ? ఔనా?" అన్నాడు మావో. "మనం విడిపోయి నది సంవత్సరాలుపైగా దాటిందికదూ?"

"పన్నెండేళ్ళయింది, చైర్మన్." చాంగ్-ఫెంగ్ తానుచేసేపని చెప్పాడు.

"నువ్విప్పుడు కమాండర్ అన్నమాట. ఎప్పుడేనా మీ ఊరు వెళ్ళివచ్చావా?... నింగ్ టూలో అదే పాతయిల్లా."

ఆయన జ్ఞాపకశక్తి అమోఘం. ఇన్నేళ్ళ తరవాతకూడా అతని జన్మస్థలమైన కుగ్రామం ఆయనకు జ్ఞాపకం ఉంది;

*   *   *

ఇది ఉద్గ్రంధం కాకుండానే జనసామాన్యానికి లభించే అపూర్వ గ్రంథాలలో ఒకటి. లాంగ్ మార్చ్ కథ చదవాలంటే ఇది చాలదు కాని "లాంగ్ మార్చ్" కథ రాసేవాళ్లు చెప్పని 'ఇంటిమేట్' వివరాలు ఇందులో ఉన్నాయి. చెన్ చాంగ్-ఫెంగ్ అనే సాధారణవ్యక్తి తన అనుభవాలను మనతో అతిసహజంగా పంచుకున్నాడు. ఈపుస్తకం చదివితే మనంకూడా లాంగ్ మార్చ్‌లో మావో వెంట ఉన్న అనుభవమే కల్గుతుంది.

అనువాదంకూడా నా బుద్ధికి చాలా సరిగాఉన్నట్టు తోచింది. మూల రచయితకూ, అతనిస్థాయికీతగిన నిరాడంబరభాషలో అనువాదం సాగింది. చాంగ్-ఫెంగ్ తెలుగులో రాస్తే ఇంచుమించు ఇలాగే రాసేవాడేమోనన్న భ్రమ పాఠకుడికి కలుగుతుంది. అందరూ చదవదగిన పుస్తకం.

[లాంగ్ మార్చ్‌లో చైర్మన్ మావోతో — చెన్ చాంగ్ ఫెంగ్
జనతా ప్రచురణలు, 6-3-628/13, ఖైరతాబాదు, హైదరాబాదు-500004.
వెల : 1—50]

కోట్లాది వీరయోధులు

యెనాన్ నగరంలో ఒక గోడమీద ఇలా రాసిఉండేదట:

"ఆయన మనసులో లక్షలాది వీరయోధులు."

ఇది ఎవరినిగురించి ఎవరు ఎప్పుడు రాశారోగాని, ఆయన మావో అనుకుంటే ఏమీ ఇబ్బందిలేదు.

మావో మనసులోఉన్న లక్షలాది, కోట్లాది వీరయోధులెవరు? ప్రజలు. మావో "ప్రజలు" అన్నమాటను కర్షక-సైనికులు లేక శ్రామిక-సైనికులు అనే అర్థంలోనే వాడాడు. చీనాలో అంతర్యుద్ధం ప్రారంభంకావటానికి ఇంచుమించు ఇరవై ఏళ్ళ ముందుగానే చింగ్‌కాంగ్ పర్వతాలలో మావో రెండు మహత్తరమైన సిద్ధాంత ప్రతిపాదనలను అమలుచేశాడు. ఒకటి, రైతాంగంనుంచి శక్తివంతమూ, చైతన్యవంతమూ అయిన పురోగామి సేనలను తయారుచేయటం. దీని అనుబంధసూత్రమేమిటంటే: సేన రైతాంగానికి సోదరుడు, కర్షక, సైనిక వ్యాపకాలమధ్య అవినాభావసంబంధం ఏర్పడింది—ఇలా ఉండటం ప్రజాయుద్ధాల విజయాలకు సహాయకారి. (ఉదాహరణ: దక్షిణ వియత్నాం)

మావో అమలుచేసిన రెండవ సిద్ధాంతం పల్లెపట్లు నగరాలను ముట్టడించాలన్నది. ముందుగా పట్టణాలను జయించాలన్నపద్ధతి తప్పని మావో కొట్టిపారేశాడు. రాజకీయ చైతన్యంకలిగి "ధర్మ" యుద్ధంచేసే ప్రజలను ఎంతబలమైన సేనకూడా జయించ లేదనీ, ఎన్ని శతాబ్దాలకైనా విజయంలభించి తీరుతుందనీ మావో నిశ్చితాభిప్రాయం.

ఇక్కడ సమీక్షించే పుస్తకం చీనా అంతర్యుద్ధకాలానికి (1946- 1949) సంబంధించినది. "అంతర్యుద్ధంలో మావోతో" అన్న పేరుకూడా దీనికి సరిపోతుంది. అంతర్యుద్ధంలోకూడా యాత్రఉన్నది. దీని రచయిత మావో బృందానికిచెందిన ఒక యాత్రికుడు. కాని అతను మావోకు ఎంత సన్నిహితుడో స్పష్టంగా తెలీదు.

అంతర్యుద్ధంగురించి స్థూలంగాచెప్పుకుంటే, 1945 నాటికి ఏత్ రూట్, న్యూ ఫోర్త్ సేనలకింద పదిలక్షలమంది సైనికులున్నారు. కోమింటాంగ్ బలాలు అంతకు నాలుగింతలున్నాయి. ఒక ఏడాదిపాటు అంతర్యుద్ధం ముమ్మరంగా సాగినమీదట 1947 మధ్యకాలంలో కొమింటాంగ్ బలాలు ఎర్రసైన్యానికి రెండింతలమాత్రమే ఉన్నాయి. అదేవిధంగా శత్రునాశనం జరుగుతూపోతే ఒక ఏడాదికి శత్రుబలాలసంఖ్యకన్న విప్లవ సైన్యం హెచ్చుగాఉంటుందని మావో అన్నాడు. కాని ఆరునెలలు తిరగకుండానే ఉభయపక్షాల సైన్యాలు ఇంచుమించు సమాన ప్రమాణానికి వచ్చాయి. అయితే విప్లవ సైనికులకు హెచ్చు దీక్ష, సమర్థమైన నాయకత్వమూ ఉండటంచేత వారి బలమే హెచ్చుగాఉండింది. 1948 ఉత్తరార్థంలో వారు సాధించిన విజయపరంపరలు యుద్ధ పర్యవసానాన్ని నిర్ణయించాయి. వారి విజయానికి తోడ్పడినవి కొమింటాంగ్ చీనాలో పెరిగిపోయిన ద్రవ్యోల్బణమూ, దుర్వ్యయమూ, అవినీతీ, చియాంగ్ కైషేక్‌పట్ల సమస్తమైన ప్రజలకూగల క్రోధమూనూ, ఇంకొకసంవత్సరంలో యుద్ధం ముగుస్తుందని మావో 1948 నవంబరులో అంచనావేశాడు. కాని అలా అని నెలతిరగకముందే కమ్యూనిస్టులు ఉత్తరచీనానూ మంచూరియానూ వశపరచుకున్నారు. జనవరిలో టియెన్‌ట్సిన్ వశమయింది. పీకింగ్ (పీకింగ్) యుద్ధం అవసరంలేకుండానే లొంగి పోయింది.

లాంగ్ మార్చ్‌లాగే అంతర్యుద్ధంకూడా ఒకయాత్ర—విజయయాత్ర. ఇందులో కూడా మావోబృందం పడరానికష్టాలుపడింది. అడుగడుగునా మావో యుద్ధతంత్రమూ వ్యూహనిర్ణయాలూ, అన్నిటినీమించి ఆయన వ్యక్తిగత శీలమూ విప్లవానికి చరిత్ర ప్రసిద్ధమైన విజయాలు చేకూర్చి పెట్టాయి.

"The chinese civil war of 1946–49 is unquestionably one of the most striking examples in history of the victory of a smaller but dedicated and well-organised force enjoying popular support over

a larger but unpopular force with poor morale and incompetent leadership" (Stuart Schram)

ప్రజాభిమానాన్ని చూరగొన్న చిన్న సేన ప్రజాద్వేషాన్ని సంపాదించిన పెద్దసేన పైన విజయం సాధించటమన్నది చీనాలో యాదృచ్ఛికంగా జరగలేదనటానికి వియత్నాం మరింత గొప్ప ఉదాహరణ. కొమింటాంగ్ అడుగుజాడలలో ప్రజాద్రోహం తలపెట్టిన ఏ ప్రభుత్వమూ సరియైన రాజకీయ చైతన్యమూ, నాయకత్వమూగల ప్రజాశక్తిముందు నిలవలేదు. ఇతరదేశాలు ఇలాటి పాపిష్టి ప్రభుత్వాలకు అంతులేని సైనిక సహాయం అందజేస్తాయి— అమెరికా చియాంగ్ కై-షేక్‌కు చాలా సహాయం చేసింది— కాని అంతా బూడిదలోపోసిన పన్నీరే. పులులలాగా గాండ్రించినంతమాత్రాన అవి కాగితపు పులులు కాకపోవు. రేపటి శత్రులముందు నిన్నటి శత్రులు నిలవటం సాధ్యంకాదు.

ఈ పుస్తకం అంతర్యుద్ధకాలంలో మావోను చిత్రిస్తున్నది. జైత్రయాత్రలో మావో బృందం సైనిక నాయకత్వంవహిస్తూ ఒకచోటినుంచి ఒకచోటికి కదలుతూ ఉండేది. శత్రువును తిప్పటమూ, తికమకపెట్టటమూ, తమకు అనుకూలమైన స్థలానికి రప్పించి అక్కడ మట్టుబెట్టటమూ మావో ఎత్తుగడలు. ఒక్కొక్కసారి వారు చాలా కొద్దికుటుంబాలుమాత్రమే నివసించే అతిచిన్న గ్రామాలలో మకాంచేసేవారు తమకు తగినంతచోటు లేకపోయినా ఎలాగో సర్దుకునేవారుగాని గ్రామస్థులను ఎంతమాత్రమూ ఇబ్బందిపెట్టేవారుకారు. విప్లవ నాయకులు తమ అవసరాలకన్న యితరుల అవసరాల పట్ల శ్రద్ధవహించేవారు. తాము వెళ్లినచోటనల్లా అక్కడి ప్రజల కష్టసుఖాలు వివరంగా కనుక్కొని, వారికి పనిసహాయంచేసి, శత్రువు వచ్చినప్పుడు ఏం చెయ్యాలో చెప్పేవారు.

మావో ప్రత్యేకత ఏమంటే, శత్రువు ఏంచెయ్యాలో ఆయనే నిర్ణయించేవాడు. దానికి భిన్నంగా ఎప్పుడూ జరిగేదికాదు "దేన్నిగురించి భయం? ప్రస్తుతం శత్రువు ఈమార్గానరాడు వారి సాయుధబలాలు ఇటురావు... గూఢచారులుకూడా ఇటురావటం అంత తేలికైనపనికాదు... ప్రజలంతా మనవైపున ఉన్నారు" ఇలా తన అనుచరులతో అనగలస్థితిలో ఆయన ఉండేవాడు. తన సేననూ, శత్రుసేననూకూడా శాసించగల వాడికి విజయం రాకేంచేస్తుంది?

"ప్రజలయందు నమ్మకంకలిగి వుండాలి. శత్రువును... ప్రజలు వెంటనే పసికట్టగల్గుతారు. చుట్టుపక్కలవాళ్లే అతనివని పట్టగలుగుతారు. మీరు మరింతఎక్కువగా ప్రజలపనిని చేయాలి"అని మావో ఉద్బోధ. ప్రజలను కుష్కంగా స్మరించటంకాదు, మావో ప్రజలను త్రికర్మలా కూడగట్టుకున్నాడు. ప్రజలే విప్లవయోధులకు పెట్టనికోట.

మావో ప్రభృతులు మొదలైనవారు యెనాన్‌లో ఉండగా 1947 మార్చిలో వారిపై దాడిచేసిన చియాంగ్ కై-షేక్ సేనలకు నాయకత్వం వహించినవారిలో ఒకడు హూ త్సుంగ్-నాన్.(హూ సంగ్‌నాన్ అన్నది తప్పు) మావో విధానాలకు వ్యతిరేకంగా హూ సైన్యాలు అడుగుపెట్టినచోట "ప్రతి పరిసరగ్రామాన్ని తగులబెట్టారు. ధ్వంసం చెయ్యకుండా వారు ఒక్క ఇల్లునుకూడా వదిలిపెట్టలేదు. ప్రతిగృహ(గుహ) నివాసంయొక్క తలుపులు, కిటికీరెక్కలుకూడా అగ్నిప్రీతి కావించారు. నిశ్చయాత్మకయుద్ధానికి తల పడేందులకై మా ప్రధానబలగాన్ని కనుక్కోవాలని, శత్రువు అన్నిదిక్కులా ఆకస్మిక దాడులను తరుచుగా చేశాడు." వీటికితోడు ప్రజలను బాధించి ఎర్రసైన్యం వార్తలు రాబట్టటంలాటి నాజూకులుకూడా ఉండేవి— నక్సలైట్లనుంచి గ్రామాలను కాపాడటానికి వచ్చే పోలీసు, సైనిక బలగాల్లాగే! ఇదంతా మావో విజయానికి తోడ్పడలేదని ఎలా అనగలం?

తనకు ప్రత్యర్థి— ప్రజల శత్రువు— హూ త్సుంగ్-నాన్ గురించి మావో, "హూ త్సుంగ్-నాన్ దాటికి కృతజ్ఞతలు. నాకు మంచి వ్యాయామం ఇచ్చింది. అది నా శరీరాన్ని బాగా గట్టిపరిచింది. ఆయనకు నిజంగా నా కృతజ్ఞతలు తెలపాలి!" అనటంలో భేషజం ఏమీలేదు. తమ నాయకుడు శత్రువునుగురించి అలా అంటుంటే మిగిలినవాళ్లకు ఎంత ఉత్సాహం! అదేధోరణిలో. "హూ త్సుంగ్-నాన్ శక్తిసామర్థ్యాలున్న వ్యక్తి కాడు. వాడు విద్రోహి. కుటిలుడు. మనం ఆయనతో అనేకసార్లు పోట్లాడినప్పటికి ఒక్కసారికూడా ఓడిపోలేదు. కేవలం మన ప్రణాళికలు సక్రమంగా నెరవేర్పటంలో ఆయన కడు నేర్పరి!" ఒక్క ముక్కలో కాగితపు పులి! "హూ త్సుంగ్-నాన్ ఏమాత్రమూ చెడ్డవాడుకాడు. మాకు అవసరమైనవన్నీ ఆయనమాకు అందించాడు. శత్రువులను దెబ్బతీయటానికిది మా సైన్యానికి అపారమైన శక్తిసామర్థ్యాలను కలగజేసింది" ఇవి మావో మాటలుకావు, ఎన్ చాంగ్-ఎన్‌వి. అయితేనేం? మావో మాటల ప్రతిధ్వనులే.

హూ త్సుంగ్-నాన్ గురించి యిలాటి అభిప్రాయాలుండటం సమర్థనీయమే నని టానికి, అతను రెండులక్షలకుపైబడిన సైన్యంతో వాయువ్యప్రాంతాలగల ఎర్రసైన్యం మీద దాడులు చేశాడు. ఎర్రసైన్యం బలం ఆ ప్రాంతాల 22 వేల చిల్లర మాత్రమే. కాని యుద్ధాలు జరిగినప్పుడు 90 శాతం విజయం అల్పసేనదే! కారణం? "మన సైన్యం సంచలన (mobile) స్వభావంగలది; కొత్త పరిస్థితులను తేలికగా మలచుకొనగలది; అపాయాలనూ, అవాంతరాలనూ లెక్కచెయ్యకుండా నిరంతరయుద్ధాలను చేయగల్గినది; శత్రువుయొక్క బలహీన అంశాలు కనిపెట్టి, వాటిని ఉపయోగించుకొనేది; వల (వ్యూహం)నుండి ఒక్క శత్రువునైనా జారిపోనీయకుండా, గట్టి చావు దెబ్బలు కొట్టగలది."

"Victory is a spirit" అన్నాడు అనటోల్ ఫ్రాన్స్. విజయం అనేది మన స్పేతర— స్పిరిట్. దాన్ని మావో ఎంతో లక్ష్యపెట్టేవాడు; దాన్ని తన అనుచరులకు పుష్కలంగా ఇంజెక్షన్ చేసేవాడు. ఒకసారి రేడియోలో ఒక ఎనౌన్సర్ ఎంతో ఆవేశంతో, చియాంగ్ కై-షేక్ తన వాగ్దానాలన్నిటినీ భగ్నంచేసి ఎలా అంతర్యుద్ధం తెచ్చిపెట్టిందీ, ఎర్రసైన్యం తన విజయోత్సాహాన్ని ఎలా జరుపుకుంటున్నదీ చెప్పింది.

"ఆ బాలికా కామ్రేడ్ చాలా ఉద్దండురాలు." అన్నాడు మావో మెచ్చుకుంటూ. "నిష్కర్షమైన న్యాయంతోనే ఆమె శత్రువును చీల్చి చెండాడుతుంది... ద్వేషం, ప్రేమలమధ్య ఎంత విస్పష్టమైన వ్యత్యాసం! ఆమెలాంటి ఎనౌన్సర్లకు మరింతమందికి శిక్షణయిచ్చి మనం తయారుజేసుకోవలసివుంది."

మావో సహజమైన గురువు. బోధించటం ఆయన సహజస్వభావం. అందులోనూ ప్రోలిటేరియన్ గురువు. కేంద్రకమిటీకి తనఇంట్లో భాగంఇచ్చిన వాంగ్ అనే ముసలాయన రేడియోపెట్టె మాట్లాడటంచూసి, "ఇదేమిటి? దీనిలోపల ఎవరన్నా ఉన్నారా?" అనేసరికి మావోవెంట ఉన్నవాళ్లు విరగబడి నవ్వారు.

"నవ్వకండి. రేడియోపని చేసేవిధానమూ, దాని సూత్రాలూ మీలో ఎవరికన్నా తెలిస్తే ముసలిమామకు వివరించండి," అని మావో మందలించాడు. నవ్వారేగాని, రేడియో ఎలా పనిచేస్తోందో వారికీ ముసలాయనకు తెలిసినంతే తెలుసు. చివరకు రేడియో పనిచేసేపద్ధతి వివరించిచెప్పటం మావోవంతే అయింది.

అంతర్యుద్ధం ఆరంభమైనాక మావో మారుపేరుతో (లి తె-షెంగ్) సంచరించాడు. కాని ఒక ప్రముఖయుద్ధం జరగబోయేముందు ఆయన యోధులతో వ్యూహతంత్రంగురించి మాట్లాడుతున్నది మావో త్సె-టుంగ్ అని టెలిఫోన్‌లో అన్నప్పుడు, ఆయన అనుచరులు పరిస్థితిలో పెద్దమార్పు జరిగిందని గ్రహించారు.

మావో శత్రుబలాలు వొస్తున్నట్టుతెలిసి ఏ ప్రదేశమైనా విడిచిపెట్టివెళ్ళేటప్పుడు స్థానికప్రజలను వారి కర్మానికి వదిలెయ్యక, "క్రమపద్ధతిలో వారిని ఉపసంహరించే బాధ్యతను నిర్వర్తించేవాడు. తాము ఎటుపోతున్నదీ గ్రామ కార్యకర్తలకు చెప్పాలనీ, అందువల్ల వాళ్ళు వార్తలను పంపగలుగుతారనీ అనేవాడు. కాని అలాచేస్తే తమ రహస్యం శత్రువుకు తెలిసిపోతుందనీ, అందుచేత ప్రజలకు అబద్ధంచెప్పాలనీ కొందరు అభిప్రాయపడ్డారు. కాని ఈ అభిప్రాయాన్ని మావో తీవ్రంగా ఖండించాడు. ప్రజలు తమ సొంతసైన్యం (ఎర్రసైన్యం)తో తరలిపోయే అవకాశంఇయ్యాలి. అందువల్ల వారికష్టాలు తగ్గుతాయి. ప్రజలూ, సైన్యమూ ఒకటిగా కలిసిపోవాలి. ప్రజలకు చివరంటా "మనం" బాధ్యతవహించాలి. అదీ మావో వాదన.

అడుగడుగునా మావోనుంచి అనుచరులు నేర్చుకునేది ఏదో ఒకటి వుండేది.

ఒకసారి అనుచరులు ఆయనతో, "కొంత పెందరాడే మనం బయలుదేరటం మంచిది, చైర్మన్. చీకటిలో ఈ బాటవెంట ప్రయాణించటం కష్టం." అన్నారు.

చైర్మన్ చిరునవ్వునవ్వి, "విచారించొద్దు. శత్రువు ఊహించినదెప్పుడూ మనం చెయ్యం. పసుపువచ్చునదికి అడ్డంగా మనల్ని తరమాలని శత్రువు తలుస్తున్నాడు. కాని మనం దానికి సరిగా వ్యతిరేకమైనదే చేస్తాం: పడమరవైపుగా ప్రయాణం చేస్తాం. హౌత్సుంగ్-నాన్ ఇక్కడికి దిగినాక, మనం వదిలిపెట్టటానికి ఇంకా కావల్సినంత సమయం ఉంటుంది," అన్నాడు.

ఒకసారి వాళ్ళు ప్రయాణం చేస్తుండగా వానపట్టుకున్నది. దానికితోడు వారిదారికి దిగువన శత్రువులుండటమూ వారికి దారిచూపేవాడు దారి మరిచిపోవటమూ జరిగి అమిత క్లిష్టపరిస్థితిలో వారు నిలిచిపోవలసివచ్చింది. కాల్పులు వినిపిస్తున్నాయి – ఒకసారి దగ్గరిగా. ఆ పరిస్థితిలో మావో వ్యాఖ్యానం: "ఇది చాలా మంచివాన ఇంకో రెండు వారాలలో గోధుమపంట కోతకువస్తుంది"!

"విశ్వాలమైన ఆమాటవినగానే మాగుండె అదురుతగ్గింది." అంటాడు రచయిత.

కాంప్‌లో ఉన్నప్పుడు మావోకు క్షణంతీరిక ఉండేదికాదు. అందుచేత ఆయన మార్చ్‌చేసేటప్పుడే అందరితోనూకలిసి విడిగావుండి, వాళ్ళ యోగక్షేమాలు ఆలోచించి, జరుగుతున్న యుద్ధగతియొక్క విశిష్టతను వాళ్ళు అర్థంచేసుకుంటున్నదీ, లేనిదీ తెలుసుకుంటూ ఉండేవాడు.

సరదా కబుర్లుకూడా వ్యక్తులను సంస్కరించటానికి ఉపయోగపడేవి. ఒకసారి కొత్త నాలుగో బ్రిగేడ్ ప్రశస్తినిగురించి ప్రసక్తివచ్చింది.

"ఎన్ చాంగ్-లిన్, నువు కొత్త నాలుగో బ్రిగేడ్ నుంచి వచ్చావుగదా, అది అంత అప్రతిహతశక్తిగా రూపొందటానికి కారణమేమంటావు?" అని మావో అడిగాడు.

"పార్టీ మమ్మల్ని బాగా నడపటమే కారణం" అన్నాడు చాంగ్-లిన్.

"అది అత్యంత ప్రాథమికమైన కారణం" అని మావో ఒప్పుకున్నాడు.

చాంగ్-లిన్ అంతటితో వదలక, "ఇతరవిధాలకూడా కొత్త నాలుగో బ్రిగేడ్ విభిన్నంగావుంది. దాదాపుగా మన మనుషులందరూ హోపైకి చెందినవారు" అన్నాడు.

మావోతల అడ్డంగా ఆడించి, "హోపై మనుషులందరూ మంచియోధులని ఎక్కడాలేదు నీకు పోరాడేశక్తి వుందో, లేదో, అది నీవేరాష్ట్రానికిచెందినవాడవనే దానిమీద ఆధారపడదు. కొమింటాంగ్ సైనికులు అత్యంతహీనమైన యోధులు. కాని

మనం వారిని విముక్తి చేయడమే తడవుగా .. వారికి కొంత వర్గవిద్య చెప్పి, సమావేశాలలో పాల్గొనేటట్టుచేస్తే, వారెందుకు పోరాడుతున్నదీ, ఎవరికోసం పోరాడుతున్నదీ స్పష్టంగా అర్థమవుతుంది. అప్పుడు వారు మంచిగా పోరాడే సైనికులుగా మారుతారు" అన్నాడు.

"నా మనసులో యింకా రాష్ట్రీయతత్వం యొక్క అవశేషాలు వున్నాయి"అని చాంగ్-లిన్ గ్రహించుకున్నాడు.

"తప్పు విషయాన్నిచెప్తే పర్వాలేదు. అదే సరైనదైతే ప్రతివాడూ సమ్మతిస్తాడు. ఒకవేళ తప్పు అయితే మేమందరం విశ్లేషించులాం. అప్పుడు నీకర్థమవుతుంది" అని మావో అతన్ని ప్రోత్సహించాడు.

ఇలాటిపుస్తకం చదివేటప్పుడు మనం గమనించవలసిందేమంటే, విప్లవం ఆశయం సైనికవిజయం మాత్రమేకాదు. రాజ్యాధికారాన్ని తుపాకిగొట్టంద్వారా సాధించటం మాత్రమేకాదుకూడా; మనుషులను విప్లవానంతర జీవితానికి అనుకూలంగా మార్చటం. అదే వారిని గొప్ప యోధులుగా తయారుచేస్తుంది. కొత్తరకం రాజ్యాధికారాన్ని నిర్వహించేటందుకు అనుకూలంగా రూపొందిస్తుంది. ఈ విషయం మావోకు తెలిసినంతబాగా ఏ విప్లవ నాయకుడికీ తెలీదేమో. మనుషులను మార్చటానికీ సమాజాన్ని మార్చటానికీ మధ్య సరిహద్దులులేవు. చీనా అంతర్యుద్ధంగురించి మనం నేర్చుకుని ఆచరించదగినది బహుకొద్దిమాత్రమే ఉండవచ్చు కాని మావో మనుషులను తీర్చిదిద్దే ప్రతి అంశమూ ప్రపంచ ప్రజలందరికీ ఉపయోగిస్తున్నది. విప్లవ శత్రువులకు ఇందుకు విరుద్ధమైనసూత్రం అయినా నమూనాకు ఇందులో దొరకదు.

మనుషులను ఇలా తీర్చిదిద్దుతూనే సైనికంగా ఆయన నిర్వహించిన బాధ్యత ఇంతా అంతాకాదు. "దేశవ్యాప్తంగా సకల యుద్ధరంగాలలో కొనసాగుతున్న ప్రజల విప్లవ పోరాటాలకు పథకాన్ని రూపొందించి చిత్రీకరించటమేగాక, చైర్మన్ తన ప్రత్యక్ష సారథ్యంలో వాయువ్య యుద్ధరంగంలో జరుగుతున్న ప్రజావిముక్తి యుద్ధాన్ని నడుపవలసియుంది... మేము విశ్రాంతికోసం ఆగినప్పుడుకూడా చైర్మన్ మా వివిధ స్థావరాలనుండి వార్తలను తెలుసుకునేందుకై కమ్యూనికేషన్ మనుషులు వెంటనే రేడియో ఏర్పాటుచేస్తారు. మేము మకాంవేసినపుడల్లా గుర్రాలపైనుండి జీనుసంచులను దించకముందే ఆయన తనపని మొదలుపెట్టేవాడు."

అంతర్యుద్ధ చరిత్ర అంతా మనకీపుస్తకంలో దొరకదు. కాని ఆ యుద్ధాన్ని విజయవంతంచేసిన మావో ఆలోచనా విధానమూ, దృక్పథమూ పుష్కలంగా దొరుకుతాయి.

"శత్రువే నిద్రాహారాలులేకుండా వెళ్ళగలిగితే మనంకూడా సిద్ధమే.

"సైనికుని ఒకసారి ఉపయోగించుకునేందుకై వెయ్యిరోజులు అతనికి శిక్షణ గరపండి".

"నేడు ప్రపంచం వారిదికాదు, మనది:

"మంచి (అనుకూల) పరిస్థితులకోసం మనం ఉద్యమించి పాటుబడాలి అంతే గాక, ఎంతటి దుర్విధికైనా, దుష్పరిణామాలకైనా తయారుగాఉండాలి. ముఖ్యంగా నాయకత్వంవహించి యుద్ధాలను నడుపుతున్నప్పుడు అనేక ప్రత్యామ్నాయ ప్రణాళిక సదా తయారు చేసుకోవాలి— విజయవంతంగా పోరాడితే ఏంచెయ్యాలి? జయప్రదంగా పోరాడకపోయినట్లయితే ఏంచేయాలి? పరిస్థితిమారితే ఏంచేయాలి?— అన్ని పరిస్థితులకు తగిన ప్రణాళికలను వేసుకుని సర్వదా సంసిద్ధంగా ఉండాలి .. మనం తప్పకుండా గెలుస్తామనే విశ్వాసంగల ఈ యుద్ధంలోకూడా ఏలాంటి ఆకస్మికమైన మార్పుకైనా తట్టుకొని, జయప్రదంగా అధిగమించటానికి తయారుగా ఉండాలి."

లాంగ్‌మార్చ్‌లో ఎర్రసైన్యం పడిన కష్టాలతో పోల్చితే అంతర్యుద్ధయాత్రలో కలిగిన కష్టాలు చాలా తక్కువని మావో అన్నప్పటికీ ఇది సుఖప్రయాణం ఎంతమాత్రమూకాదు. విప్లవం అంటే విందుభోజనం కాదన్నది ఈ పుస్తకం చదివితే ఘాటుగా తెలుస్తుంది. కాని ఈ కష్టాలతోబాటు విజయాల పరంపరకూడా ఉన్నది. వాటివెనక చైర్మన్ మావో "తాయ్‌పర్వతం"లాగా ఉన్నాడు.

ఈ అనువాదం ఇంకా బాగుండి ఉండవచ్చుననిపిస్తుంది. లేనిపక్షంలో ఇది నవలలాగా చదవటానికి అనుకూలంగా ఉండదగిన పుస్తకం. అలా ఉండకపోవటానికి ఎన్ వాంగ్-లిన్‌కూడా కొంతవరకు కారణమేమో తెలియదు.

కోట్లాది వీరయోధులు – ఎన్ వాంగ్-లిన్

అనువాదం: కె. కె. జ్వలిత్, ప్రచురణ: భారత-చైనా ప్రజల సాంస్కృతిక స్నేహ సంఘటన, హైద్రాబాద్.

ప్రతులకు : 1. పిలుపు. 2. సృజన. వెల : 2 రూపాయలు.

సాహిత్య లేఖ :

'నరసింహారావు కథ'పై విమర్శలు

కె.వి. రమణారెడ్డి

[ఆగస్టు '73 సృజనలో కె. వి. రమణారెడ్డిగారు 'నరసింహారావుకథ' రాసారు. సెప్టెంబర్ 9 'విశాలాంధ్ర' దినపత్రికలో రామప్పగారు దానిపై విమర్శ రాసారు. 'విరసం సాహిత్య భండారం' అనే పుస్తకంలో దీన్ని పునర్ముద్రించడం కూడ జరిగింది. ఇదికాక నరసింహన్ అనే ఒక పాఠకుడుకూడ సృజనకు 'నరసింహరావు కథ' పై విమర్శ పంపించాడు. అది కె.వి.ఆర్.గారికి పంపించడం జరిగింది. కె.వి ఆర్.గారు రెండింటినీ కలిపి వెంటనే జవాబిచ్చారు. మే 11 న కామ్రేడ్ నరసింహారావు స్మారక దినం సందర్భంగా యీ సమాధానాన్ని ప్రచురిస్తున్నాం. సం॥]

'సై సై చిన్నాపారెడ్డీ' వరసలో, చిన్నపరెడ్డి కథను ఆసాంతం అనుకరిస్తూ, 'సృజన'లో నేను 'నరసింహారావుకథ'ను ప్రకటించి ఉన్నాను. 'విశాలాంధ్ర'లో నల్లపాటి రామప్పనాయుడు 'సృజన'కు నరసింహన్‌గార్లు తమతమ విమర్శలు పంపిఉన్నారు. ఈ విమర్శలు కొంత మేరకు సమంజసంగానే ఉన్నాయని కొందరు మిత్రులు నాతోఅనీ, నాకు రాసి ఉన్నారు.

'నరసింహారావుకథ' గురించి గుణనిర్ణయం చేసేముందు ఎవరైనా మొదట ఆ జానపదకథ గేయప్రక్రియకుగల పరిమితులను గ్రహించవలసి ఉంటుంది. 'చిన్నపరెడ్డి కథ'ను చదివీ; వినీ ఉన్నవారెవరైనా అందులో 'కవిత్వం' అతిశయించి, 'నరసింహారావుకథ'లో లోపించిందని భావిస్తారనుకోను. కవిత్వం అని మామూలుగా అనుకోబడే పదార్థం 'నరసింహారావుకథ'లోనే ఎక్కువగా ఉన్నదని గ్రహిస్తారు. 'చిన్నపరెడ్డికథ'నుగాక 'సర్వాయిపాపడికథ'ను మూనాగా నేను తీసుకునిఉంటే, జానపద కవిత్వధోరణి పాపడికథలో అతిశయించినా దానిలో అదిలేనట్లు తీర్మానిస్తారు. జానపద కథా గేయ రూపంలో ఆధునిక ఇతివృత్తాన్ని యిమడ్చడం నాకు సరిగా తెలియదు చివరకు జానపదకావ్యాల భాషగూడా నాకు పూర్తిగా పట్టుబడలేదు. ఆ తెన్నులో నేను వేసిన తప్పటడుగులకన్నింటికీ ముఖ్యమైన కారణం ఇదే. పంక్తిపూరణంకోసం వ్యర్థపదాలను వాడాననుకోనుగాని శబ్దలయదృష్టితో జీవద్భాషాపదాలకూ గ్రాంథిక భాషాపదాలకు కొన్నిటికీ నేను బలవంతపుమైత్రిని సమకూర్చడం జరిగింది. ఇంతవరకు యిరు విమర్శలతోనూ నేనేకీభవిస్తున్నాను. అయితే వ్యావహారిక భాషాపదాల కోసం నేను కనీసం

సుగుణాన్ని కూడా చూడలేకున్నారు. సంస్కృత శబ్దాలెన్నో వ్యవహారభాషలో కూడా వికృతరూపంలోనైనాసరే, నిలిచివున్నాయి. గ్రాంథికభాషాపదాలు వాడవద్దనడం మంచిదేగాని సంస్కృతశబ్దాలను నిర్విచక్షగా బహిష్కరించమనడం చాదస్తం. 'ఋజువు' లాంటి రూపాలను వాడే రామప్పనాయుడు గురివిందగింజబాపతుగా చేసిన ఉపదేశాన్ని కూడా కృతజ్ఞతతో స్వీకరిస్తున్నాను.

అయితే, విశాలాంధ్ర పత్రికను విషాలాంధ్ర పాత్రికగా మారుస్తూ విప్లవకవుల మీద విరుచుకుపడడమే పనిగా పెట్టుకున్న విమర్శకుల కోవలోకి వస్తున్నారు రామప్ప నాయుడు. నన్ను 'అకవి'గా నిరూపించేందుకు రవి ప్రయత్నిస్తే, నాలో కవితాశక్తి నై నై అని నిరూపించేందుకు రామప్పనాయుడు పూనుకొన్నారు. మంచిది. అవ్యక్తి (non-person) గా చేసేముందు అకవిగా నిరూపించడం యిలాంటి అవ్యక్తులకు ఆనవాయితీయే. అర్థచర్చచేస్తూ, 'నలీసు' 'గలీజు' శబ్దాలనూ, 'ఆత్మగౌరవం', 'స్వాభిమానం' శబ్దాలనూచూపి కేశవిశ్లేషణంచేసిన రామప్పనాయుడు, నాకు స్కూలుపిల్లవానికున్నట్టు శబ్దలౌల్యం ఉందని ఎలిమెంటరీ స్కూలు టీచరులా **మార్కులు** తీసివేశారు. **కవిత్వం విషయంలో** నేనింకా నేర్చుకుంటూనే ఉన్నాను గనక నాకైతే **ఈ ఉపమానం** ఫర్వాలేదుగాని, పెద్దరికాన్ని తలపై మోపుకున్న రామప్పనాయుడు మరి నేర్చుకోదగిందేదీ లేదన్నట్టు అహంకరించడం ఆశ్చర్యకరమేకాదు. హాస్యాస్పదంకూడా. 'నలీసు' అంటే వెలతక్కువైన (cheap) అనే అర్థం ఉన్నట్లు వారికి తెలియదు కాబట్టే "తెలియనివన్నీ తప్పులని దిట్టతనాన" పలకగలరు. 'ఆత్మగౌరవం' 'స్వాభిమానం'- ఇవి సమానార్థకాలే అనుకున్నా, వాటికి అర్థచ్ఛాయ భేదించదని భావించినా, పునరుక్తి సర్వత్రా దోషమే ఎందుకుకావాలో, emphasis కోసం ఎందుకు వాడగూడదో కవితా మర్మజ్ఞులైన రామప్పనాయుడే చెప్పాలి. నేను ప్రయోగించిన గ్రాంధిక రూపాలనాలో "జీర్ణంకాని సంస్కారాన్ని" చూపెడుతున్నాయని ఆయన అంటున్నారు. ఇది నిజమే కావచ్చుగాని ఎదుటివాణ్ని లోపమెన్నిచూపే తీరు ఆయనకుగల జీర్ణసంస్కారాన్నే చూపెడుతున్నది.

"హై హై రమణారెడ్డీ
నై నై నీలో కవితాశక్తీ"

రెండు చరణాలమధ్యగూడా "సమత"ను సాధించలేని ఈ కవితా విమర్శకుడు విషమతను మాత్రం అవలీలగా సాధించగలడు. మిత్రుడు నరసింహన్‌కూడా నేను వాడిన గ్రాంధిక రూపాలగురించి విమర్శించారు. 'హార్దిక', 'విగతజీవుడు', 'వియత్పథం'వంటి మాటలు వాడినందుకు నేను సిగ్గుపడుతున్నాను. అయితే నా రచనలో వీటిశాతం బహు కొద్ది. 'పౌరాణిక'శబ్దాలు వాడానంటూ నరసింహన్ మరొక విమర్శ చేశారు. పౌరా

జికశబ్దాలంటూ కొన్ని ఉన్నాయని యిందాకా నాకు తెలియదు. నరసింహన్ చూపెట్టిన 'హిరణ్యకశిపుడు'వంటి నా ప్రయోగాలనుబట్టి పౌరాణిక ఉపమానాలు వాడగూడదని ఆయన ఆదేశిస్తున్నట్టు అర్థంచేసుకుంటున్నాను. అయితే ఈ విషయంలో నాకు ఆయనతో ఏకాభిప్రాయంలేదు. రీతిలో (form) జాతీయవాదం వస్తువులో స్వామ్యవాదం అని స్టాలిన్ చేసిన నిర్వచనం నుంచి, ప్రజలకు సుపరిచితమైన సంకేతాలను వాడినందు చేత రచయిత చెప్పదలచుకున్నది పాఠకునికి సులభంగా ఎక్కుతుందని నేను అర్థంచేసుకున్నాను. జానపద కథాగేయం జానపదశ్రోతలకే ఉద్దేశింపబడింది కాబట్టి, జానపద సంస్కృతినుంచి ఇంకా వైదొలగిపోని పౌరాణిక కథావశేషాలనూ పాత్రలనూ వాడడం అనుచితం కాదనిపిస్తూంది. మూఢభక్తినీ మూర్ఖ విశ్వాసాన్నీ కలిగించేందుకైతే ఏమో గాని, పాత్రకూ ఘటనకూ గల విలక్షణత్వాన్ని సూచించేందుకు పౌరాణిక సంకేతాలను వాడడం కనీసం కవిత్వంలో, అందునా అభినవ జానపద కవిత్వంలో అపరాధం కాకపోగా అవసరమేమోనని నేను భావిస్తున్నాను. నరసింహారావు వర్గశత్రువులపట్ల నరసింహావతారమే ఎత్తాడని నేననలేదు. కథానాయకపాత్ర పేరులోని 'నరసింహ' శబ్దం వెంటనే నాకు హిరణ్యకశిపుణ్ని స్ఫురింపజేసింది. వర్గశత్రు నిర్మూలన హిరణ్యకశిపుని వధను గుర్తుకు తెచ్చింది. భీమ, దుర్యోధనుల ప్రస్తావనకూడా యీ దృష్టినుంచే గ్రహించాలి. గదాయుద్ధంలో అక్రమంగానూ క్రూరంగానూ నడుముకింద(బిలోదిబెల్ట్) దెబ్బతీసిన భీముడు తత్కాలానికి తన ఉదాత్తతను కోల్పోతున్నాడు. తొడలు విరిగి కిందపడికూడా తన ఠీవినీ ఆత్మగౌరవాన్నీ విడనాడని సుయోధనుడు ఉదాత్తతను సంతరించుకొని భంగపాటులో సైతం రారాజనిపిస్తూ ఉన్నాడు. తిక్కన, భాసుడు ఔచిత్య దృష్టితోనే ఆ ఘటనను వర్ణించారని పండితుడో పండితమ్మన్యుడో అయిన రామప్ప నాయుడుకు నేను చెప్పవలసిన పనిలేదు. బుల్లెట్లు తొడల్లోనూరి పడిన నరసింహారావు పతనంలోకూడా 'రారాజే'! చరిత్రలో 'రారాజు' నౌతానని తాను స్వయంగా ఒక లేఖలో రాసుకున్నాడు కాబట్టి ఆ శబ్దాన్ని దృష్టిలో ఉంచుకుని నేను అతనికి చరమఘట్టంలో సుయోధనత్వాన్ని ఆపాదింపజేశాను. అది నీచోపమ అనుకునేవాళ్ళ ఔచిత్య దృష్టికి ఎవరేం చెయ్యగలరు?

అంతరంగికులైనవారికితప్ప అన్యులకు తెలియని విషయం, 'నరసింహారావుకథ' కవి స్వకపోల కల్పితమైన విషయంకాదనేది. అందులో ఏ ఘటనకూడా కల్పితం కాదు. నరసింహారావు లేఖల్లో నాకు లభ్యమైనవి, ఆయన చనిపోయాక బాల్యమాదిగా అతని జీవితంగురించి ఆయనతల్లిగారు రాసిపెట్టుకున్న వ్యాసం— ఇవే నా ఆధారాలు. మరణఘట్టానికి సంబంధించి నేను కల్పనమీదనే ఎక్కువగా ఆధారపడడానికి కారణం, దాని తాలూకు వివరాలు నాకు అందకపోవడమే. ఆయన సాగించిన దాడుల వివరాలు

కూడా నాకిప్పటికీ తెలియవు. కాబట్టి ఆ విషయాలను విడిచివెయ్యడంగాని, వాటి ప్రభావంగురించి అతిశయోక్తులు వాడడంగాని జరిగింది. ఇక అతనిపుట్టుక, వంశం, చదువు, ఆస్తిపాస్తులు, పెళ్ళివగైరా జీవితవిశేషాలంటారా, నరసింహన్‌దృష్టికి 'చెత్త'గా మాత్రమే కనిపించే ఈ అంశాలు జీవితకథలో అవశ్యం ఉండాల్సినవే. "నరసింహారావు కథ"ను అతని జీవితకథగానే నిర్వహించబూనానుగాని, ముందువెనకలు ప్రస్తావించకుండా, పిడుగూడిపడిన చందంగా, ఒక్కమారే గెరిల్లాగా నరసింహారావు జీవితంలోని చరమఘట్టాన్ని మాత్రమే వర్ణించడం నా ఉద్దేశంకాదు. 'చిన్నపరెడ్డికథ'నుచూస్తే ఈ విషయం బోధపడుతుంది. ప్రజావీరుడికీగూడా తల్లిదండ్రులు ఉంటారు. ఆస్తిపాస్తులుంటాయి. పెళ్ళాంబిడ్డలూ అంతే. మామూలుమనిషి అసాధారణవ్యక్తి కావడంతో అతని గతంకొంత ప్రభావమైనా ప్రసరింపజేస్తుందని, నరసింహన్ వంటి తీవ్రోత్సాహులకు చెప్పకతప్పదు. అంతేగాని, "వందిమాగధుల స్తోత్రపాఠాలు" చెయ్యడం నా ఉద్దేశమూకాదు, అలాంటి స్తోత్రపాఠాలు నా రచనలోనూలేవు.

యథార్థవ్యక్తిని యథార్థచిత్రణ చెయ్యాలా లేక ఆదర్శీకరించాలా? వీరుడు కూడా మనిషే. సర్వోత్తముడుగా చిత్రింపబడిన పాత్ర కొయ్యబొమ్మ అవుతుందని సోషలిస్టు రియలిజంలోని 'పాజిటివ్ హీరో' దృక్పథం నిరూపించింది. సోవియట్ సాహిత్యంతో కనీసపరిచయం ఉన్నవాడెవడైనా, రామప్పనాయుడులాంటి తెలిసిపోయిన వారు తప్ప, అది కొయ్యబొమ్మల కొలువు అయిందని గ్రహించగలడు.

నరసింహారావు తల్లికడుపులో ఉన్నప్పుడే ఎక్కువగా కదులుతూఉండడంబట్టి, బహుశా తనకు కవలబిడ్డలు పుడతారేమో, పుట్టబోయేబిడ్డ చురుకుపాలు పట్టించుకున్న బిడ్డలాగా ఉంటాడేమోనని, ఆ తల్లికి అనిపించింది. ఆమెగారు రాసుకున్న వ్యాసాన్నిబట్టి నాకిది తెలిసింది. ఆమె మనోభావాలను ఉన్నవి ఉన్నట్టుగా నేను పాదబద్ధం చేశాను. నిజానికి, నరసింహారావు లేఖల్లోని వాక్యాలకు వాక్యాలను, వెంకటసుబ్బమ్మగారి రచనలోని మాటలకు మాటలను, వారు పేర్కొన్న ఘటనలను నేను నా రచనలోనికి బహుస్వల్పమైన మాటలభేదంతో ఎక్కించడం జరిగింది. చెప్పానుకదూ, జీవితకథను గేయంగా మలచడమే నా ఉద్దేశం. చదువుకొని బాగుపడాలని సంకల్పించుకొని కూడా నరసింహారావు చదువులో ఎక్కరాలేదు. తానుమాత్రమే మెచ్చి తలిదండ్రులు మెచ్చనిదాన్ని పెండ్లాడి చెప్పరాని సంసారబాధకు లోనయ్యాడు. వీరోచితంగా కనిపించాలంటే, వాస్తవాన్ని తారుమారుచేసి చూపాలని నరసింహన్ కోరుతున్నారా? అతిశయోక్తులువద్దుగాని అనృతోక్తులు ఫరవాలేదంటారా? సార్థకమైన, విప్లవోత్సాహకరమైన, ఘటనలనుమాత్రమే ఎంపికజేసి చిత్రించాలని కోరడంవేరు, దానికోసం వాస్తవాన్ని బలిపెట్టమనడం వేరు. పోలీసులు చుట్టుముట్టి హింసించి కాల్చినప్పుడు కంటి

నీటిచుక్కైనా రాల్చని నరసింహారావు, చిన్నతనంలో రైలుమీదినుంచి కాలుజారి పడినప్పుడు ఎందుకు గోలపెట్టాడు? అప్పుడు మాములు పిల్లవాడు. ఇప్పుడు కాకలుతీరిన విప్లవకారుడు. ఈ భేదాన్ని చూపడానికి ఆ వెనకటి ఘటనను చిత్రించాలి. నరసింహన్‌కు తెలియకపోవచ్చు గాని, ఇలాంటి సూచనలను కావ్యంలో నిలిపేపద్ధతి కావ్య మర్మజ్ఞుడైన రామప్పనాయుడికైనా తెలిసిపోయిఉంటుంది.

'పెళ్ళంపోతే తల్లియున్నది'అని ఉన్న చరణానికి ఎంతగొప్ప వ్యాఖ్యానంచేశారో చూస్తే, రామప్పనాయుడి సంస్కారానికిగల స్థాయి తెలుస్తుంది. పైగా ఆచరణం సరిగా భావాన్ని నిర్దేశించడంలేదట! గలీజు బుద్ధులతో సలీసు విమర్శలకు దిగిన ఈ మహాశయుడు విపరీతార్థాలను వెలికిలాగడంలో సిద్ధహస్తుడనని నిరూపించుకున్నాడు. ఇతనిది పూర్తిగా దోషదృష్టి. కన్నతల్లినీ దేశప్రజల్నీ నమ్ముకొన్న నరసింహారావు తల్లిలో పెళ్ళాన్నిచూస్తాడా? నరసింహన్‌కుగూడా ఈ విషయంలో ఒక అభ్యంతరం ఉంది: పార్టీతో దాంపత్యాన్నీ ప్రజలతో సంసారాన్నీ చేయబూనాడన్నట్టు నేనుచేసిన వర్ణన నరసింహారావు విప్లవ దృక్పథానికి తగదని అంటున్నారు. నిజమేగాని తన లేఖల్లో నరసింహారావే అలా వర్ణించుకున్నాడు. పద్యపాదాలలో గేయచరణాలలో కొటేషను మార్కులు పెట్టడం చూడడానికి బాగుండదుగాని పెట్టిఉంటే నాకు ఈ సమాధానం చెడద తప్పేది; పాఠకులకుగూడా అపోహలు కలిగేవికావు.

నా కవితాశక్తిని అటుంచండి, నరసింహారావు స్మృతికి నేనపచరించానని రామప్పనాయుడు, నరసింహారావును తక్కువచేశానని నరసింహన్ అంటున్నారు. నరసింహన్ ఆవేదనను అర్థంచేసుకోగలనుగాని రామప్పనాయుడు ఆవేదనను అర్థంచేసుకోలేను. మహావీరుడని నరసింహారావును ప్రస్తుతించే ఈ పెద్దమనిషి నరసింహారావు విప్లవ పంథానుమాత్రం కంటగించుకొంటాడు. బతికిఉన్న నరసింహారావుతో అతని ఆశయాలతో ఆచరణతో విభేదించి చనిపోయాకనే నరసింహారావు వీరత్వాన్ని "గుర్తిస్తాడు." నరసింహారావులాంటి విప్లవకారుల వీరమరణాన్నిమాత్రం కోరుకొంటూ, వీరోచిత జీవితాన్ని విడిచివేస్తాడు. నరసింహారావు స్మృతికి నేను అపచరించాననడం నరసింహారావు మీది అభిమానానికంటె ఎక్కువగా నా మీది దురాగ్రహానికే "ఋజువు". మరి, నరసింహారావును నేను తక్కువచేశానని నరసింహన్ ఎందుకు భావిస్తున్నట్టు? ఇంకా ఎక్కువచేసి చూపలేదనే బాధకారణమై ఉండవచ్చు. యథార్థ జీవితవిషయాల 'చెత్త'ను విడిచి వీరోచిత కృత్యాల వర్ణననే అధికతర ప్రాముఖ్యంఇచ్చి ఉండాల్సిందనే కోరిక కారణంకావచ్చు. రామప్పనాయుడన్నట్లు, నేనుగాకపోతే నాకంటే మంచికవి ఎవరైనా నరసింహారావుకు పూర్తిన్యాయం కలగజేసే చక్కని కావ్యాన్ని రాయగలరు. నర

సింహన్ విమర్శ ఒకటి బాగుంది: నరసింహారావు వీరకృత్యాల ప్రభావంగురించి నేను అతిశయోక్తులు రాశానన్నది.

వాస్తవవాదమూ కాల్పనికవాదమూ ఒకదానినొకటి అనుగమించే కళాధోరణులైతే కావచ్చుగాని పరస్పర విరుద్ధమైనవా? క్లాసిసిజం, రొమేంటిసిజమ్ అలాంటి విరుద్ధధోరణులు. పారిశ్రామిక విప్లవానంతరం బూర్జువాసామాజిక వాస్తవంతో స్పర్థించి ఆక్షేపిస్తూ గతంలో స్వర్ణయుగాలపైనో భవిష్యత్తులో ఊహాస్వర్గాలపైనో మనస్సు పంపిన కాల్పనికవాదులు తమ సమకాలీన వాస్తవాన్ని నెగెటివ్‌గా మాత్రమే వీక్షించారు. సంపన్నవర్గ భావాలమీద పెటీబూర్జువా వర్గ భావాల తిరుగుబాటే యిది. పోను పోను ఈ ధోరణి వెర్రితలలు వేసింది. కాబట్టి వాస్తవాన్ని గుణదోష విమర్శాదృష్టితో పరిశీలించి చిత్రించే రియలిజం అనే మరో కళాధోరణి ప్రారంభమైంది. కాల్పనికవాదమూ వాస్తవవాదమూ కాలక్రమాన్నిబట్టి అక్కచెల్లెళ్ళలాంటివే. విమర్శాయుత వాస్తవవాదానికి దారిచూపింది కాల్పనికవాదమే. రివిజనిస్టు సాహిత్య తత్వవేత్త అయిన ఎర్నెస్ట్ ఫిషర్ రాసిందాన్ని చూసినా, మన రామప్పనాయుడు ఈ రెండుధోరణులకు గల బాంధవ్యాన్ని గుర్తించేవారు. వెనక ఒకమారు నాలో మార్మికవాదధోరణులను వెలికి లాగి చూపిన శ్రీవారు యిప్పుడు కాల్పనికవాద ధోరణులను లాగి చూపుతున్నారు. విప్లవ వాస్తవాన్నీ కల్పననీ మేళవించేధోరణి గోర్కీ ప్రారంభింపజేసినదేనని చెప్పినా వీరంగీకరించరేమో? ఇంతకూ రివల్యూషనరీ రొమేంటిసిజంలో వీరికి నచ్చనిది రెండవమాటా, మొదటిదా? కళాధోరణులలో రొమేంటిసిజమూ రాజకీయధోరణులలో విప్లవవాదమూ వీరికి సరిపడవు. నిజమేమరి. నియోక్లాసిసిస్టులకూ రివిజనిస్టులకూ ఇవి ఎలా నచ్చుతాయి?

'నరసింహారావు కథ' మహోత్తమ కావ్యమనే స్వాతిశయం అది రాసినప్పుడు గాని, ఇప్పుడుగాని నాకు లేదు. 'ఇది కావ్యమేకాదు, ఇందులో కవిత్వమేలేదు' అని తీర్పుచెప్పే కళ్లున్న కబోదులకు నేను చెప్పి చూపగలిగిందిలేదు. ద్వేషాన్ని శమనం చేసుకోవడమే విమర్శ అనిపించుకుంటే, రామప్పనాయుడు **మహాగొప్ప** విమర్శకుడే.

కవిత్వాన్ని కటకటాల్లో బంధించి ఉంచలేరు- శ్రీశ్రీ

ఖమ్మం విరసం యూనిట్ అక్కడి సభ్యుల కవితా సంకలనం ఒకటి వేయాలని సేకరించి కార్యవర్గ సభ్యుడు జీవన్ దగ్గర సమీకరించారు. ఆ సంకలనం ఎప్పుడో వెలువడాల్సింది. కాని జీవన్ యింటిపై 30 జనవరి 74న దాడిచేసిన 'పుస్తకాలదొంగలు' (పోలీసులు) పుస్తకాలన్నిటితోపాటు వీటినికూడా ఎత్తుకుపోయారు. మళ్ళీ వీటిని సేకరించి శ్రీశ్రీ రెండు ముందుమాటలతో ఒకపాటతో, కొన్ని తమిళ విప్లవ కవితల అనువాదాలతోపాటు అందిస్తున్నారు.

తిరుగుబాటు విప్లవ కవితా సంకలనం

ప్రచురణ : విప్లవ రచయితల సంఘం, ఖమ్మం. జిల్లాశాఖ- వెల: 1-25

విరసం పిలుపు :

అధిక ధరలతో ఆకలితో మాడి చావకండి ఆయుధాలతో తిరగబడండి

అధికార మార్పిడి జరిగి (స్వాతంత్రం వచ్చి) 26 ఏళ్లు గడిచిపోయాయి. సామాన్యుడికి చిప్ప చేతికొచ్చింది. వాగ్దానాల్తో తల బొప్పి కట్టింది. కొబట్టే పాలకవర్గాల్ని చెప్పుల్తో సత్క రిస్తున్నారు. ఆకలిమంటలు అగ్నిలా దహించి వేస్తున్నాయి. అన్నమో రామచంద్రా అంటూ కోట్లాది ప్రజలు కృశించిపోతున్నారు. శ్రమజీవి వెన్నెముక విరిచి ఏయేటికాయేడు గొడ్డలిపెట్టులాంటి బడ్జెటు ప్రతిపాదించడం పాలక వర్గాలకు పరిపాటైపోయింది. సోషలిజం పేరిట నిజానికి జరుగుతుంది దోపిడిమాత్రమే. దేశం మొత్తం బద్దలుకానున్న అగ్నిపర్వతంలా వుంది. వర్గ సమాజంలో ధరలు పెరగడంతప్ప తగ్గడం అంటూ ఎన్నటికీ జరగదు. భారత పాలకవర్గాల వేళ్లు అమెరి కాలో, రష్యాలో తదితర సామ్రాజ్యవాద దేశాల్లోవున్నాయి. భారత పౌరుల పంచప్రా ణాలు అప్పుల్లో మునిగివున్నాయి. మనలో తల ఒక్కంటికి ఎన్నివందల అప్పో!

ప్రజల్ని రెచ్చగొట్టి, ఆయుధం పట్టక తప్పని పరిస్థితులు పాలకవర్గాలే సృష్టి స్తాయి. అందులో భాగంగానే మొన్న ఉత్తరప్రదేశ్‌లో పోలీసు తిరుగుబాటు జరిగింది. నేడు తిండిగింజల కొరతకు అధికధరలకు వ్యతిరేకంగా గుజరాత్ ప్రజలు విద్యార్థి కార్మికవర్గ నాయకత్వాన బ్రహ్మాండమైన పోరాటంచేస్తున్నారు. నిన్న నాగపూర్, నేడు గుజరాత్, రేపు దేశంయావత్తూ ఈ పాలకవర్గాల్ని బత్తలబజార్లకీడ్చి ఈ దోపిడీ యంత్రాంగాన్ని బద్దలుకొడుతుంది. 1967 లో ప్రారంభమైన భారత రైతాంగ సాయుధ పోరాటం నక్సల్‌బరీనుండి గుజరాత్‌వరకు అన్ని పోరాటాలకు ప్రేరణగా, తనలో సంలీనం చేసుకుంటూ ముందుకే సాగుతుంది.

ఎవరో ధాన్యాన్ని దాచివేసి ఆహార కొరత సృష్టించారని శ్రీరంగనీతులు పలికే ఈ ఇందిర నిరంకుశ నియంతృత్వ పోలీసు ప్రభుత్వానికి అంతిమఘడియలు దాపురిం చాయి. దేశంలోని ఆర్థిక సంక్షోభాన్ని ఇంకెవరూ ఆపలేరు. 'ఆకలితో మలమలమాడి చచ్చేకన్నా పోరాటంలో చావడం మేలు' నేమా వోమహోపాధ్యాయుని మాటలు భారత దేశంలో నిజమవుతున్నాయి.

పడిపోతున్న జీవనప్రమాణాన్ని పార్లమెంటు పంథాను నమ్ముకున్న ఏ పార్టీ బాగుచెయ్యలేదు. చేస్తామని ఎవరెన్ని బీరాలుపలికినా అది ఆత్మహత్యా సదృశమే. సర్కారాభ్యుదయం, సంస్కరణలు శ్మశానానికి ఉత్తమమార్గాలు. సాయుధ విప్లవం ఒక్కటే ప్రజలమార్గం.

ప్రియమైన ప్రజలారా ! మీరు ఏ రంగంలో పనిచేస్తున్నా మీరు తెలుసుకోవలసింది ఒక్కటే జీతాలు పెంచినా, క్యూలల్లో కూలేసి చాలీచాలని తిండిగింజలు పంచినా మనకు వొరిగేది ఏమీలేదు. ఈ దోపిడీ ప్రభుత్వం నాశనం కానంతవరకు మనకు క్షేమంలేదు భద్రతలేదు శాంతిలేదు.

నిరుద్యోగం, దారిద్ర్యం ధరలు పెరగడం, తిండిగింజల కొరత, ఓట్ల పన్నాగాలు, బూటక సోషలిజం మసిలికబుర్లు కాల్పులు, లాఠీలు, జైళ్లు, అరెస్టులు అన్నీ ఇవన్నీ ఈ 16 ఏళ్లుగా 56 కోట్ల ప్రజల రక్తమాంసాల్ని పిండేస్తున్న ఈ దళారీ ప్రభుత్వం 'దయ'అని మరచిపోకండి

అధికధరలకు, దోపిడికి కారణమైన ఈ వ్యవస్థను సమూలంగా, సాయుధంగా కూకటివేళ్ళతో కూల్చుట ఒక్కటే శాశ్వత పరిష్కారం !

"ఆకలితో మలమల మాడి చచ్చేకన్నా పోరాటంలో చావడం మేలు"

"ఈ దోపిడీ ప్రభుత్వాన్ని సాయుధంగా గద్దె దింపండి"

"తిండి గింజలడిగితే తూటాలు పేల్చే ప్రభుత్వానికి తూటాలే సమాధానం"

"పోరాటాన్ని వాయిదా వెయ్యడమంటే కాటికి కాళ్లుచాపడమే"

"ప్రజల ఐక్యత వర్ధిల్లాలి"

"విప్లవం వర్ధిల్లాలి"

"విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి"

విప్లవ రచయితల సంఘం
సిటీయూనిట్, హైదరాబాదు.

3-3-71

ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రగతిశీల విద్యార్థులపై ఆర్. ఎస్ ఎస్. గుండాల దాడిని ఖండిస్తున్నాం.

నేటికి సరిగ్గా 3 సంవత్సరాలక్రితం ఉస్మానియా కేంపస్‌లో పట్టపగలు జార్జిరెడ్డిని ఆర్. ఎస్. ఎస్. గుండాలు పొడిచిచంపారు. హంతకులెవరో విద్యార్థులందరికి తెలుసు. కాని ప్రభుత్వానికి దాని కోర్టుకి ఇంతవరకు తెలియలేదుట. కాని మొన్న జార్జిరెడ్డి అనుచరులను, ప్రగతిశీల విద్యార్థులని ఒక దొంగకేసులో యిరికించింది ఈ ప్రభుత్వం. స్వార్థప్రయోజనాలకోసం, వైస్ చాన్సలర్ నాయకత్వాన సిండికేటు అత్యవసర సమావేశం జరిపి పదకొండుమంది విద్యార్థులని "రస్టికేటు"చేసింది ముఖ్యమంత్రి వెంగళరావు ఫాసిజం, వైస్ ఛాన్సలర్ నూకల నరోత్తమరెడ్డి కుల రాజకీయాలు ప్రజలకు కొత్తేమీకాదు. సోషలిజం కబుర్లు చెప్తూనే ఆర్. ఎస్. ఎస్. గుండాలతో కలిసే ఈ ప్రభుత్వాన్ని, దాని తొత్తులయిన కుహనా మేధావుల్ని ప్రతిఘటించడం ఎలాగో ప్రజలు నేర్చుకుంటారు ఒకప్రక్క ఆర్. ఎస్. ఎస్. గుండాలతోనూ, మరోప్రక్క ప్రభుత్వంతో రమిస్తున్న విశ్వవిద్యాలయ మేధావులతోను నిరంతర పోరాటంచేస్తున్న ఉస్మానియా ప్రగతిశీల విద్యార్థులతో కరచాలనం చేస్తున్నాం.

అభ్యుదయ విద్యార్థి వేదిక,
సోషలిస్టు స్టూడెంట్స్ యూనియన్.

మార్క్సిస్ట్-లెనినిస్ట్‌పార్టీ కార్యకర్తలు కిష్టాగౌడ్, భూమయ్యల ఉరిశిక్షలు రద్దుచేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి పత్తిపాటి వెంకటేశ్వర్లుగారి ప్రకటన.

కామ్రేడ్ కిష్టాగౌడ్ 1927 లో ఆదిలాబాదుజిల్లా ఆసిఫాబాదు తాలూకా, కవల్‌గాంవ్‌లో పుట్టాడు. శ్రీమతి చిన్నక్క, శ్రీ ఎల్లాగౌడ్ ఆయన తలిదండ్రులు శ్రీమతి ఈశ్వరమ్మ ఆయనభార్య. ఆయనది చాల పేద రైతుకుటుంబం. 1948-51 తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ఆయనను ఆకర్షించింది. ఒక సంవత్సరంపాటు కొరియర్‌గా పనిచేసాడు. తర్వాత గెరిల్లాదళంలో చేరాడు. గట్టుపల్లి మురళి దళంలో గట్టుపల్లి ప్రాంతంలో దళచర్యలసాగిస్తూ వీరోచితంగా పోరాడుతున్న తరుణంలో పోలీసులచేజిక్కాడు. అమానుషమైన చిత్రహింసలకుగురయి వరంగల్ సెంట్రల్‌జెయిల్‌లో రెండు సంవత్సరాలు శిక్ష అనుభవించాడు.

1967 నక్సల్బరీ పోరాటం ఆయనను మళ్లా ఆకర్షించింది. 1969 లో స్థాపించబడిన భారత కమ్యూనిస్ట్‌పార్టీ(మార్క్సిస్ట్-లెనినిస్ట్)లో చేరాడు.

కామ్రేడ్ భూమయ్య 1925 లో పుట్టాడు. ఆయన తలిదండ్రులు శ్రీమతి రాజవ్వ, శ్రీ కోసగంటి వీరమల్లయ్య. కరీంనగర్ జిల్లా, పెద్దపల్లి తాలూకా, ముత్తారు ఆయన స్వగ్రామం. వాళ్ళ కుటుంబానికి ఒక్క ఎకరం భూమివుండేది. జంగంవృత్తి చేస్తూ బతుకుదెరువు సాగించేవారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఇతణ్ణి ఆకర్షించింది. గెరిల్లాలకు ఆశ్రయమిచ్చేవాడు. తిరిగి 1967 లో ప్రారంభమైన భారత రైతాంగ సాయుధ పోరాటం ఆయనను ఆకర్షించింది. భారత కమ్యూనిస్ట్ పార్టీ(మా-లె) సానుభూతిపరుడయ్యాడు.

ఆదిలాబాదు జిల్లా, ఆసిఫాబాదు తాలూకా గిన్నెధారి గ్రామానికిచెందిన లచ్చుపటేల్, గోయల్‌గాంవ్ గ్రామానికి చెందిన బోదికుంట మల్లయ్యలను 24-4-70 రోజు 'ఖతం'చేసిన కార్యక్రమంలో ఇతర స్థానిక రైతులతోపాటు వీళ్ళిద్దరు పాల్గొన్నారని ప్రాసిక్యూషన్‌వాళ్లు ఆరోపించారు.

6-1-72 రోజు ఆదిలాబాదు సెషన్స్‌కోర్టు వీళ్ళకు మరణశిక్షవేసింది. 3-4-72 రోజు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు యీశిక్షను ధృవపరచింది. వీరిద్దరూ యిప్పుడు జిల్లా జెయిల్(ముషీరాబాదు, సికిందరాబాదు)లో వున్నరు. వీళ్ళ లక్ష్యం ప్రజాసంబంధమైంది. వ్యక్తిగత ప్రయోజనాలకు ఉద్దేశించిందికాదు. దోపిడీకి గురియైన పేదరైతాంగాన్ని కాపాడడానికి చేపట్టింది. మార్క్సిస్ట్-లెనినిస్ట్‌పార్టీ నాయకులు కామ్రేడ్ ఇంతా రమణా

రెడ్డి, కామ్రేడ్ నాగభూషణ పట్నాయక్‌లపై విధించిన మరణశిక్షలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, కేంద్రప్రభుత్వం యావజ్జీవ శిక్షలుగా మార్చాయి.

1947 తర్వాత (కోర్టులో నేరం విచారించి) చట్టబద్ధంగా యే రాజకీయనేరస్తునికీ మరణశిక్ష వేయలేదు.

కామ్రేడ్ కిష్టాగౌడ్, కామ్రేడ్ భూమయ్యలపై విధించిన ఉరిశిక్ష రద్దుచేయవలసిందిగా మేం ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తున్నాం. ఈ డిమాండ్ సాధించుకోవడానికి పోరాటం చేయవలసిందిగా దేశంలోని ప్రజాస్వామిక శక్తులనన్నింటినీ కోరుతున్నాం.

రాష్ట్రమంతటా 'ప్రభుత్వ దమననీతికి వ్యతిరేకంగా పోరాటపక్షాన్ని' నిర్వహించవలసిందిగా రాష్ట్ర పౌరహక్కుల సంఘం పిలుపునిచ్చింది. 1) కిష్టాగౌడ్, భూమయ్యల ఉరిశిక్షలు రద్దుచేయాలి. 2) రాజకీయ ఖైదీలందరినీ విడుదలచేయాలి. 3) శ్రీకాకుళం, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో 'కల్లోలిత' ప్రాంతాలుగా ప్రకటించిన ఆర్డర్లను ఉపసంహరించుకోవాలి. 4) గ్రామాల్లోనుంచి పోలీసు క్యాంపులు ఎత్తివేయాలి. 5) తొలగించబడిన ఎన్ జి వో నాయకులను తిరిగి ఉద్యోగాల్లో చేర్చుకోవాలి. 6) ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులపై రస్టికేషన్ ఆర్డర్లను ఉపసంహరించుకోవాలి. 7) నక్సలైట్లతో 'ఎన్‌కౌంటర్లు'గా చెప్పబడుతున్నవి విచారించడానికి ఒక న్యాయవిచారణ సంఘాన్ని వేయాలి. గుంటూరు తాలూకా తాడికొండ గ్రామస్తుడు సాగర్ మరణం గురించి నేరవిచారణ చేయాలి. 8) విప్లవసాహిత్యంపై నిషేధాన్ని ఎత్తివేయాలి. 9) నక్సలైట్ ఖైదీలందరినీ రాజకీయ ఖైదీలుగా గుర్తించాలి. 10) వామపక్షభావాలున్న ఉద్యోగులను బదిలీచేయడంగాని, తీసివేస్తామని బెదిరించడంగాని మానాలి.

విశాఖ సెంట్రల్ జైలులో విప్లవకారులు ఏప్రిల్ 22వ తేదీన భారత కమ్యూనిస్టుపార్టీ(మా-లె) జన్మదినోత్సవాన్ని జరిపారు.

జైలు అధికారుల నిర్బంధాన్ని ఓడిస్తూ కామ్రేడ్స్ డాక్టర్ భాస్కర్రావ్, పాణిగ్రాహిల సహచరుడు కామ్రేడ్ గోరు మాధవరావు ఎర్రజెండాను ఎగురవేశారు. 'అమరవీరులకు జోహార్', 'వర్గశత్రు నిర్మూలనం వర్ధిల్లాలి', 'ప్రియతమ నాయకుడు చారు మజుందార్ అమర్ హై', 'ప్రపంచ ప్రజల ఆశాజ్యోతి జనచైనా వర్ధిల్లాలి!', 'చైనా పార్టీ 10వ కాంగ్రెస్ వర్ధిల్లాలి!', 'చైర్మన్ మావో వర్ధిల్లాలి' అనే నినాదాల మధ్య కామ్రేడ్ రవూఫ్ మాట్లాడుతూ, 'అమరుడు ప్రియతమ నాయకుడు కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వాన ప్రారంభించబడిన సాయుధపోరాటాన్ని కొనసాగించేందుకు విప్లవకారులు ఈ రోజున శపథంచేయాలని' అన్నారు.

SRJANA Telugu Monthly May '74 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

రైళ్ళను జైళ్ళు నడిపించగలవా?

మేము రైల్వే కార్మికులం
మా ఎముకలను బొగ్గుగా వేసి
మా రక్తాన్ని ఆవిరిగా మార్చి
రైలుబండ్లు నడుపుతున్నాం
అర్ధాకలితో మాడి
అనారోగ్యంతో వాడి
పెరిగే ధరలు, తరిగే ఆయుర్దాయంతో
రాజీపడలేక ఆందోళనకు ఆయత్తమవుతున్నాం
మేం ఆకాశంలో అందమైన చందమామ కావాలనలేదు
రైల్వే మంత్రి ఆర్జించిన ఆస్తి పంచివ్వమనలేదు
రైల్వేబోర్డులో తిష్టవేసిన నిరంకుశాధికార్ల దర్పం
మాకొద్దుగాక వద్దు
టాటాబిర్లాల పెట్టుబడిమీద రాబడి మేమడుగలేదు
పబ్లిక్ రంగంలోని ఉద్యోగులతో సమానమైన వేతనం
చుక్కలంటే ధరలకు సరిపడే కరువుభత్యం
బోనస్. పనిగంటల తగ్గింపు కావాలన్నాం
అందుకే సమ్మె సమ్మెట చేపట్టాం
ఆయుధాన్ని ప్రయోగించకముందే అరెస్టులుచేసింది ప్రభుత్వం
సమ్మె వెనుక సాయుధపోరాట సంకేతాలు కనిపిస్తున్నయి
అందుకే గంగవెర్రులెత్తుతున్నాయి పాలకవర్గానికి
సమ్మెతో దిగిరాని ప్రభుత్వాన్ని
సాయుధంగా దించేదాకా విశ్రమించం
శ్రామికరాజ్యం సాధించేదాకా పోరాడుతాం.

సత్యం
ఒక రైల్వే ఉద్యోగి

SRJANA
Hanamkonda
Warangal 506001
1 Re.